
చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

జూబ్లీహిల్స్ నివాసంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ సినీ నటుడు చిరంజీవి


సంపుటి 08, సంచిక: 244 | సోమవారం | 4-08-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




### ఇసి తటస్థత ప్రశ్నార్థకంగా మారింది

'ఎస్ఐఆర్'పై పార్లమెంటులో చర్చ జరగాల్సిందే : గౌరవ్ గొగోయ్ డిమాండ్

5 లో



5 లో

### దేశంలో 20శాతం రైలు డ్రైవర్ల కొరత

తప్పుడు పద్ధతుల్లో పనిగంటల తారుమారు



12 లో

### ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కలకలం

బర్త్‌డే పార్టీలో నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో పాజిటివ్

ఆరుగురు ఐటి ఉద్యోగుల అరెస్టు

## గోదావరి జలాల తరలింపు సాగనివ్వం



- సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వల్లే బనకచర్లకు బ్రేక్
- కృష్ణా జలాల వినియోగంలో గత పాలకులు పూర్తిగా విఫలం
- ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి వల్లనే బనకచర్లకు బ్రేక్ పడిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల నిర్మాణం ద్వారా గోదావరి జలాల తరలింపును సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ కృష్ణా, గోదావరి జలాలను వినియోగించుకోవడంలో గత పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టారని భట్టి ఆరోపించారు. గోదావరిలో మిగులు జలాలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి 13 టిఎంసిల నీటిని తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఈ నీటి దోపిడీ కొనసాగితే 30 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని భట్టి స్పష్టం చేశారు. గోదావరి నదిపై ఎస్ఆర్ఎస్‌పి, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల ప్రాజెక్టులను నిర్మించామని గతంలోనే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను ఖమ్మం జిల్లాలో చేపట్టామని భట్టి గుర్తు చేశారు. గోదావరిపై ప్రాజెక్టులను పూర్తి చేస్తే నీరు సముద్రంలో కలిసే ప్రసక్తే లేదని ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్లే మిగులు జలాలపై వాదన కొనసాగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి బయటకు రాకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు బిఆర్ఎస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి లు బనకచర్లపై సమర్థవంతంగా వాదనలు వినిపించారని అయినా ఆంధ్రప్రదేశ్ నాయకులు ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ తెలివిగా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలోని నీటి ప్రాజెక్టులు పూర్తయి నిల్వ అవసరాలు తీర్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల వ్యవహారంలో ముందుకెళ్లాలని

తరువాయి 2లో



## ఎందాకైనా పోరాడతాం

- గోదావరిని రాయలసీమకు తీసుకెళ్తానని కెసిఆర్ చెప్పడం వల్లే బనకచర్లకు బీజం
- రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే ప్రాజెక్టుకు ఇప్పుడు బ్రేక్ పడింది
- గోదావరిలో రాష్ట్ర వాటా 968 టిఎంసిల నీటిని సంపూర్ణంగా వినియోగించుకొనేలా ప్రాజెక్టు చేపడతాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/పెద్దపల్లి

ఎపి విభజన చట్టానికి బనకచర్ల ప్రాజెక్టు పూర్తిగా వ్యతిరేకమని, ఆ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్తానని కెసిఆర్ గతంలో అన్నారని, అప్పుడే బనకచర్లకు బీజం పడిందని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు ప్రజల్లో తప్పుడు సంకేతాలిస్తున్నారన్నారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను టిడబ్ల్యుసి, గోదావరి నదీ యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిలిపివేసిందన్నారు. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న 968 టిఎంసిల నీటి వాటా సంపూర్ణంగా వినియోగించు కునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్గాం మండలంలోని గోలివాడ వద్ద రామగుండం

తరువాయి 2లో

భావజాలం నుంచి ఆదాయం వరకు

## కశ్మీర్‌లో సరికొత్త సోషల్ మీడియా గేమ్!

భద్రతాసంస్థల విచారణలో గుట్టురట్టు

**శ్రీనగర్ :** కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సరికొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. కొంతమంది యువతలో సైద్ధాంతిక విశ్వాసంతో కాకుండా వేర్పాటువాదులను, ఉగ్రవాదులను కీర్తించే అనుచరులను సంపాదించడానికి, ప్రకటనదారుల నుండి డబ్బు సంపాదించడానికి సోషల్‌మీడియాను ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహంగా ఉపయోగించే కొత్త ధోరణి చోటుచేసుకుంటున్నదని భద్రతాసంస్థలు కనుగొన్నాయి. ఈ నేపథ్యంలో తీవ్రవాద ప్రక్రియను ఎదుర్కోవడానికి, సోషల్ మీడియా సైట్‌లను ట్రాక్ చేయడానికి శ్రీనగర్ పోలీసులు అన్ని రకాల ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అటువంటి ఖాతాల వెనక ఉన్నటువంటి కొంతమంది యువకులను అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ 'కార్యనిర్వాహక విధానం' (మోడస్ ఆపరాండి) గురించి కనుగొన్నారు. విచారణ సమయంలో నిషేధిత 'హిజ్బుల్ ముజాహిదీన్'కు చెందిన హతమైన ఉగ్రవాది బుర్హాన్ వని వంటి రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించడం అనేది అధిక, చురుకైన అభిమానులను సంపాదించడానికి ఒక ప్రణాళిక అని యువకులు

తరువాయి 12లో

## ఇసి అధికారాలను దుర్వినియోగం చేస్తోంది

- రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోంది
- రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలి : చిదంబరం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై తీవ్ర వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చిదంబరం ఎన్నికల సంఘంపై మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బిహార్ ఓటర్ల సవరణ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోందని మాజీ హోంమంత్రి అన్నారు. బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా, తమిళనాడులో 6.5 లక్షల మందిని ఓటర్లుగా చేర్చడం ఆందోళనకరమైనదని, చట్టవిరుద్ధమని చిదంబరం

తరువాయి 12లో



## హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటలే ప్రయాణం

- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మిస్తాం
- 6న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ఈ అంశాన్ని చర్చిస్తాం
- హైదరాబాద్‌ను అభివృద్ధిచేశామన్న కెటిఆర్ ఉప్పల్‌లో ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు?
- రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్/ఎల్.బి.నగర్

హైదరాబాద్ నుండి విజయవాడకు రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మిస్తామని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ నెల 6న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ అంశాలపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్ ఎల్.బి.నగర్ నుండి పెద్ద అంబర్‌పేట వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను మంత్రి ఆదివారం పరిశీలించారు. వనస్థలిపురం జంక్షన్ వద్ద క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంలో మంత్రి వెంట ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్‌డిసి ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు తనకు తెలుసని, గతంలో తాను ఎంపిగా ఉన్నప్పుడే రోడ్ల అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుమారు

తరువాయి 2లో

ఓ లిల్లీపుట్ నేతతో నల్లగొండలో

## బిఆర్ఎస్ నాశనం

- నాపై అనుచిత వ్యాఖ్యల వెనుక పార్టీ పెద్దనాయకుడి హస్తం
- బిఆర్ఎస్‌తో సంబంధం లేని వ్యక్తికి ఊతమిచ్చి వ్యాఖ్యలు చేయించినట్టు ఆధారాలున్నాయ్
- ఆ లిల్లీపుట్ నేత ఎన్నడూ ప్రజాఉద్యమాలు చేయలేదు
- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్

తనపై వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ రాష్ట్రం బాధపడిందని, కానీ బిఆర్ఎస్ నాయకులు స్పందించలేదని, తనపై ఒక వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యల వెనకాల బిఆర్ఎస్‌కు చెందిన ఒక పెద్ద నాయకుని హస్తం ఉన్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్ఎస్‌కు సంబంధం లేని వ్యక్తికి ఊతమిచ్చి తనపై వ్యాఖ్యలు చేపించినట్టు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయటపడుతుందన్నారు. కింది స్థాయికి దిగజారి ఒక మహిళపై వ్యాఖ్యలు చేయించారని, రాజకీయం చేయవచ్చని, కానీ ఇంత నీచంగా అని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ నల్లగొండ జిల్లాల్లో బిఆర్ఎస్‌ను నాశనం చేసిన ఒక లిల్లీపుట్ నాయకుడు తన గురించి 'ఆమె ఎవరు'..? అని మాట్లాడుతున్నారని, ఆ నాయకునికి ప్రోత్సాహం ఇస్తున్నదెవరో ప్రజలు ఆలోచిస్తారని, నల్లగొండలో ఒక్క సీటు కూడా రాలేదని, ఆయన సీటు కూడా సావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా

తరువాయి 2లో



రేవంత్‌రెడ్డి, రాధాకృష్ణ పదాలనే

## ఎమ్మెల్సీ కవిత వల్లెవేస్తున్నారు

- నల్లగొండలో 20 ఏళ్ల ఉద్యమాలకు, ఎన్నికల విజయాలకు నాదే బాధ్యత
- ప్రస్తుత ఓటమికీ నేనే బాధ్యుడిని
- మాజీమంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

కెసిఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వారు, బిఆర్ఎస్‌ను ఖతం చే యాలని చూస్తున్న రేవంత్ రెడ్డి,రాధాకృష్ణ ఏం మాట్లాడుతున్నారో కవిత కూడా అదే మాట్లా డుతున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి తన జోహార్లు అని అన్నారు. కవిత ఉపయోగించిన పదాలను రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఉపయోగించారని, వాళ్ళు ఉపయోగించిన

తరువాయి 2లో



## కాలువలో పడిన కారు

11 మంది మృతి, మరో నలుగురికి గాయాలు

యుపిలోని గోండా జిల్లాలో ఘటన

**గోండా :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆదివారం గోండా జిల్లాలోని సరయు కాలువలో ఓ కారు అదుపు తప్పి పడిపోవడంతో 11 మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బాధితులు సిహాగావ్ గ్రామం నుండి ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయంలో పవిత్ర జలం అర్పించడానికి వెళుతుండగా బెల్వా బహుతా సమీపంలో ప్రమాదం జరిగిందని ఇటియాథోక్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కృష్ణ గోపాల్ రాయ్ చెప్పారు. కారులో డ్రైవర్ సహా 15 మంది ఉన్నారన్నారు. గ్రామస్తులు, రెస్క్యూ బృందాల

తరువాయి 12లో

## గ్రానైట్ పరిశ్రమ కుదేలు!





- అంతర్జాతీయంగా మార్కెట్ మందగమనం
- కార్మికుల కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- ఆందోళన బాటలో యాజమాన్యాలు, కార్మికులు
- జీవో 14 ఉపసంహరించాలని డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ

రాష్ట్రంలో వేలాది కార్మికులకు ఉపాధి జీవనాధారంగా ఉన్న గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అంతర్జాతీయంగా గ్రానైట్ మార్కెట్ మందగమనంలో పడిపోయింది. ఇతర దేశాలకు తగ్గిన ఎగుమతులతో పాటు ఖనిజ రాయల్టీల పెంపు, ఉత్పత్తికి మించిన వ్యయం, ప్రభుత్వ ముడుపుల భారంతో పరిశ్రమ కుదేలవుతోంది. ప్రభుత్వం ఈ యేడాది జులై 8న జారీ చేసిన జీవో నెంబర్ 14 ద్వారా సీనరేజస్ చార్జీలను మరో 20 శాతం పెంచడంతో గ్రానైట్ క్వారీ పరిశ్రమలో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారాల్లో ప్రొడక్షన్ హాలిడేలు, ఫ్యాక్టరీలు మూత పడుతున్న నేపథ్యంలో

తరువాయి 2లో

ధర్మస్థలలో అసహజ మరణాల

## రికార్డులు మాయం

ఆర్‌టిఐ చట్టం ద్వారా వెలుగులోకి



**న్యూఢిల్లీ :** ధర్మస్థల ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరి కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటు చేసుకున్న అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ విషయం ఆర్‌టిఐ చట్టం ద్వారా ఆదివారం బహిర్గతమైంది. 2000 నుంచి 2015 మధ్య బెల్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు, యువతులు, బాలికలకు చెందిన రికార్డులన్నీ గల్లంతయ్యాయి. ఈ మేరకు ఆర్‌టిఐ కార్యకర్త జయంత్ ఆదివారం వెల్లడించారు. ఇదే సమయంలో అనుమానాస్పద మరణాలపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన గుర్తు చేశారు. అయితే తాను వందకు పైగా మహిళలు, యువతుల మృతదేహాలను పూడ్చిపెట్టానంటూ ఒక పారిశుద్ధ్య కార్మికులు ప్రకటించిన వేళ.. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు మాయం కావడం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బ్యాంకాక్‌లో వేలాదిమంది ప్రదర్శన

**బ్యాంకాక్:** న్యాయస్థానం సస్పెండ్ చేసిన ప్రధానమంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్ర తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు. పొరుగున కాంబోడియాతో సరిహద్దు ఘర్షణలకు దిగి సైనికుల మరణాలకు ఆమె కారకురాలయ్యారని ప్రదర్శకులు విమర్శించారు. ఆమె వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. జులై చివరివారంలో థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య సరిహద్దు వివాదం తలెత్తడంతో ఐదు రోజుల ఘర్షణలో 35 మంది సైనికులు మరణించారు. మరో 2.60 లక్షలమంది సరిహద్దు సమీప గ్రామాలు ఖాళీచేసి వెళ్ళిపోయారు. ఈ పరిణామాలకు పేటోంగ్‌టార్న్ షినవత్ర కారకురాలని ప్రదర్శకులు తీవ్రంగా తప్పుపట్టారు. తీవ్రమైన ఎండలు ఇబ్బంది పెడుతున్నాగానీ లెక్కచేయకుండా బ్యాంకాక్ మ్యూజియం నుండి వేలాదిమంది ప్రజలు దేశభక్తియుత గీతాలు ఆలపిస్తూ ఈ ప్రదర్శన ప్రారంభించారు. పేటోంగ్‌టార్న్‌తో పాటు ఆమె తండ్రి మాజీ ప్రధానమంత్రి తక్షిణ్ షినవత్రను కూడా దేశ ప్రస్తుత పరిస్థితులకు కారకులని విమర్శించారు. కాంబోడియాతో సరిహద్దు ఘర్షణలకు షినవత్ర కుటుంబం ప్ర ధాన కారణమని, వారికి దేశాన్ని పాలించే అధికారం లేదని నినాదాలు చేశారు.

## పాక్‌లో చమురు నిక్షేపాలు లేవు
### అవన్నీ బలోచిస్థాన్ రిపబ్లిక్ దేశ వనరులు
### ట్రంప్‌కు బలోచ్ నేతల బహిరంగ లేఖ



**క్వెట్టా :** పాకిస్థాన్‌లో అసలు చమురు, అరుదైన ఖనిజ వనరుల నిక్షేపాలు లేవని, ఈ ఖనిజ వనరులన్నీ రిపబ్లిక్ ఆఫ్ బలోచిస్థాన్‌కు చెందినవని ఈ విషయంలో అమెరికాను పాకిస్థాన్ పూర్తిగా తప్పుతోవ పట్టించిందని బలోచ్ నాయకుడు మిర్ యార్ బలోచ్ ఆదివారం డోనాల్డ్ ట్రంప్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. బలోచిస్థాన్ రిపబ్లిక్ ఎవ్వరికీ అమ్ముడుపోవడానికి, అమ్మకానికీ సిద్ధంగా లేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకోసం బలోచ్ నిధులను తమ నిధులుగా తప్పుతోవ పట్టించారన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో వేలాదిమంది అమెరికా సైనికులు మరణించడానికి కారకులైన అల్‌ఖైదా, ఇతర ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదులను, సైన్యాలను ఏకంచేసి వారికి కొమ్ముకాసింది పాకిస్థాన్ ప్రభుత్వమే అనే విషయం మరచిపోవద్దని బలోచ్ హెచ్చరించారు. లక్షలకోట్లు డాలర్లు విలువచేసే భూగర్భ వనరులను దుర్వినియోగం చేసేవిధంగా ఎలాంటి వ్యూహాత్మక తప్పిదాలకూ అమెరికా పాల్పడవద్దని కూడా ఆయన హెచ్చరిక చేశారు. పశ్చిమ,దక్షిణ ఆసియా ప్రాంతంలో ఎంతో చరిత్రాత్మకమైన భూభాగం బలోచిస్థాన్. ఈ ప్రాంతం చరిత్రలో ఇరాన్,పాకిస్థాన్,ఆఫ్ఘనిస్థాన్ దేశాలుగా ఆవిర్భవించింది. పాలనాపరంగా బలోచ్ రాష్ట్రం పాకిస్థాన్‌లో అంతర్భాగంగా ఉంది. వీరంతా పశ్చిమ ఇరానిక్ బలోచ్ భాష మాట్లాడతారు. అసలు లేని చమురు నిక్షేపాలను ఉన్నాయంటూ పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌తోపాటు ఆ దేశ దౌత్యవర్గాలు కూడా మిమ్మల్ని తప్పుతోవ పట్టించారని, మీతో ఆ దేశం వాణిజ్య ఒప్పందం చేసుకుని తప్పుతోవ పట్టించిందని ఒక బహిరంగ లేఖలో ట్రంప్‌కు మిర్ యార్ బలోచ్ హెచ్చరిక చేశారు. జులై 29వ తేదీన భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ కొద్దిగంటల తర్వాత పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారు. అమెరికా దిగుమతి చేసుకునే పాకిస్థాన్ సరుకులపై 19 శాతం సుంకాలు విధించారు. పాకిస్థాన్ తీర ప్రాంతాల్లో సామూహికంగా భారీ ఎత్తున చమురు నిల్వల క్షేత్రాలున్నాయని, ఆ దేశంలో మూడు చమురు నిల్వల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం సందర్భంగా ట్రంప్ ప్రకటించారు. దీనిపై బలూచిస్థాన్ నాయకుడు మిర్ యార్ బలోచ్ బహిరంగ లేఖద్వారా ట్రంప్‌కు పైవిధంగా హెచ్చరిక చేశారు. ప్రపంచంలో చాలా అరుదుగా లభించే చమురు నిల్వలతోపాటు, లిథియం, యురేనియం, కాపర్ వంటి ఖనిజాలన్నీ పాకిస్థాన్‌కు సంబంధించినవికాదనీ, బలోచిస్థాన్ దేశానికి సంబంధించినవని మిర్ యార్ బలోచ్ స్పష్టం చేశారు. విస్తారంగా చమురు, ఇతర విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్న విషయం నిజమే కావచ్చున కానీ ఆ నిక్షేపాలన్నీ బలూచిస్థాన్ రిపబ్లిక్‌కు చెందినవేతప్ప పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందినవి కావని ఆయన స్పష్టం చేశారు. ''మీరు ఉన్నాయనుకుంటున్న భూగర్భ వనరులన్నీ పంజాబ్‌లో ఉన్నాయనీ, ఈ ప్రాంతం అంతా నిజమైన పాకిస్థాన్ దేశమని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

# సిడ్నీలో 'మార్చ్ ఫర్ హ్యూమానిటీ'
### పాలస్తీనాకు మద్దతుగా లక్షమంది భారీ ప్రదర్శన



**సిడ్నీ:** గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణ దాష్టీకాలను, ఆకలిలో ప్రజలను మాడ్చేసే కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆస్ట్రేలియా నగరం సిడ్నీలో లక్షమంది ప్రజలు ''మార్చ్ ఫర్ హ్యూమానిటీ'' పేరుతో భారీ ప్రదర్శన జరిపారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు, ఆస్ట్రేలియా ఎడిటర్, అమెరికా సైనిక గూఢచారి కార్యకలాపాల విశ్లేషకుడు జూలియన్ అస్సాంజ్,విదేశాంగశాఖ మాజీ మంత్రి బాబ్ కార్, ప్రభుత్వ ఎంపీ ఎడిక్ హ్యూసిక్ సహా అనేకమంది ప్రముఖులు ఈ భారీ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన నిర్వహించడానికి ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు ఒకరోజు ముందుగా అనుమతి మంజూరు చేసింది. ఈ విధంగా అనుమతి ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని పాలస్తినా అనుకూల నిర్వాహకులు వ్యాఖ్యానించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజలు లెక్కచేయకుండా ఈ ప్రదర్శనలో పాల్గొని పాలస్తినా ప్రజలపట్ల తమ సంఘీభావాన్ని ప్రకటించారు. పాలస్తినా ప్రజలకు న్యాయం చేయాలని, వారి స్వయంప్రతిపత్తిని, సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని వారు కోరారు. చిన్న పిల్లలను, మహిళలను, వయోజనులను పస్తులుపెట్టి చంపడం, తుపాకీలతో ఆహార కేంద్రాలవద్ద వారిని కాల్చి చంపడం వంటి అమానుష చర్యలను తక్షణం నిలిపివేయాలని ప్రజలు నినాదాలు చేశారు. సిటీ సెంటర్ లోని లాంగ్ పార్కు నుండి ప్రజలు మధ్యాహ్నం ఒంటి గంటలకు ఒక సముద్ర ప్రవాహంలా బయలుదేరారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సిడ్నీలోని హార్బర్ బ్రిడ్జిపై ప్రదర్శన చేశారు. అమెరికా కాన్సొలేట్ వద్ద ప్రదర్శన ముగించాలని ప్రదర్శకులు భావించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని కూడా ప్రదర్శకులు తీవ్రంగా తప్పుపట్టారు. అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. హార్బర్ బ్రిడ్జి సెంటర్‌ను ఉదయం 11.30 గంటలకే పోలీసులు పూర్తిగా రాకపోకలు జరగకుండా ప్రదర్శకుల నిమిత్తం మూసివేశారు. ఈ ప్రదర్శనలో దాదాపు 90,000 మందికిపైగా పాల్గొని ఉంటారని పోలీసులు అంచనావేశారు. ఈ భారీ ప్రదర్శన నా ఊహలకు మించిపోయిందని ఒక ప్రదర్శకుడు ఈ సందర్భంగా వ్యాఖ్యానించాడు. ప్రజల భద్రత రీత్యా ఈ ప్రదర్శనను నిలిపివేసేందుకు ప్రదర్శనకు నాయకత్వం వహించినవారితో పోలీసులు సంభాషణలు చేశారు. తదుపరి వివరాలు తెలియాల్సి ఉంది.

### గాజాలో ఆహార కేంద్రంపై కాల్పుల్లో 44 మంది మృతి

గాజాలో అనేకచోట్ల ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో ఆదివారం నాడు 44 మంది మరణించారు. వీరిలో 22 మంది ఆహార కేంద్రాలవద్ద మరణించారు. ఆహారం కోసం ప్రజలు తీవ్రస్థాయిలో ఎగబడుతున్నారు. ప్రతిముగ్గురులో ఒకరు తీవ్ర ఆకలితో బాధపడుతున్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఆహారం లభించడంలేదు. ఒకవైపు ఆకలిచావులు విపరీతంగా పెరిగిపోతుండగా మరోవైపు అంతర్జాతీయస్థాయిలో ప్రపంచ దేశాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా యూరప్ దేశాలు కూడా బెంజిమన్ నెతన్యాహూ వైఖరి కారణంగా ఇప్పుడు ప్రధానంగా పాలస్తినా ప్రజలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసే పరిస్థితులు వచ్చాయి. ట్రంప్ కూడా గాజాలో ప్రజలు ఆకలి మరణాలకు గురవుతున్నారని నమ్ముతున్నారని వాషింగ్టన్ అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ పరిస్థితుల్లో గగనతల మార్గంలో కొన్ని దేశాలు ఆహారం సరఫరా చేస్తున్నప్పటికీ ఆ పరిమిత సరఫరాలు ప్రజల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీంతో ఆకలిబాధలు తట్టుకోలేక ప్రజలు గాజాకు వస్తున్న ఆహార సహాయ వాహనాలను మధ్యలోనే అడ్డుకుని మీదపడి దోచుకుపోతున్నారు. ఇప్పటివరకూ గాజాలో మృతులసంఖ్య 61వేలకు చేరువలో ఉంది. ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన 22 నెలల్లో ఇజ్రాయెల్ సైనికులు 18,500 మంది పాలస్తీనియన్లను అరెస్టు చేశారు.



## రష్యా—చైనా నావికుల సీ—2025 ఉమ్మడి సైనిక విన్యాసాలు



**వ్లాడివోస్టోక్ :** రష్యా—చైనా నౌకాదళాలు ఉమ్మడిగా బహుముఖ సైనిక విన్యాసాలను (సీ—2025) ఆదివారంనాడు ప్రారంభించాయి. రష్యా వ్లాడివోస్టోక్ సమీప సముద్ర జలాల్లో ఈ విన్యాసాలు ప్రారంభమైనట్లు చైనా నావికాదళ నిపుణుడు ఒకరు ఆదివారంనాడు చెప్పారు. ఈ విన్యాసాలలో భాగంగా నావికులకు మరింత ఎక్కువమందికి జలాంతర్గాముల నిర్వహణలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించినట్లు పిఎల్ఎ న్యూస్ మీడియా సెంటర్‌కు ఆయన చెప్పారు. రష్యాకు సమీపంలో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారంనాడు ఆ దేశ నౌకాదళానికి ఆదేశాలు ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఉక్రేన్ విషయంలో ఒత్తిడి పెంచడంకోసం ఆయన దూకుడు చర్యలకు పాల్పడ్డారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడిన ట్రంప్ జలాంతర్గాములను మోహరించాలని ఆదేశించిన నేపథ్యంలో చైనా—రష్యా నౌకాదళాల ఉమ్మడి విన్యాసాలు ప్రారంభం కావడం ఒక కీలక పరిణామం. ఐతే ఈ విన్యాసాలు రష్యా—చైనా మధ్య సాధారణంగా జరిగే వార్షిక సహకార ప్రణాళికలో ఒక భాగమేనని చైనా రక్షణమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ ఝాంగ్ ఝియావో గాంగ్ ఆదివారం నాడు రోజువారీ పత్రికాగోష్ఠిలో చెప్పారు.2012 నుండి ప్రతి సంవత్సరం ఈ వార్షిక విన్యాసాలు జరుగుతున్నాయి.ఈ విన్యాసాల ద్వారా తదుపరి రెండు దేశాల నావికులమధ్యా మరింత సహాయం, ఆదానప్రదానాలు పెరుగుతాయని ఆయన ఆశించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఈ సైనిక విన్యాసాలు ప్రారంభమయ్యాయి. మొదట పోర్టు నుండి రష్యా టగ్ బోట్లు, రెస్క్యూ షిప్‌లు, చైనా 052 డి గైడెడ్ క్షిపణి విధ్వంసక వ్యవస్థలు, రష్యాకు చెందిన జలాంతర్గాముల విధ్వంసక నౌకలు లోతైన జలాల్లోకి విన్యాసాల నిమిత్తం తరలివెళ్ళాయి. తర్వాత ఉమ్మడి ప్రణాళిక ప్రకారం రెండు దేశాలకు చెం దిన నావికులు తారుమారై ఏకమైపోయి విన్యాసాలు నిర్వహించారు. సముద్రాంతర ప్రాంతాలలో సంచరించేటప్పుడు ఎదురయ్యే కొన్ని పరిస్థితుల్లో కావాల్సిన సమాచారాన్ని రెండు దేశాల నావికులు ఇచ్చిపుచ్చుకున్నారు. వాటి గురిం చి చర్చించారు. నట్టనడిసముద్రం మధ్యలో గగనతల కార్యకలాపాలను నౌకా కార్యకలాపాలను అనుసంధానంచేసే ప్రక్రియలపై కూడా విన్యాసాలు నిర్వహించారు. జలాంతర్గాముల రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించారు. రెండు దేశాల నావికులూ ఉమ్మడిగా జలాంతర్గాములను ప్రతిఘటించే విన్యాసాలు ప్రాక్టీస్ చేశారు.

## పరిశ్రమ కుదేలు!
(మొదటి పేజీ తరువాయి)

రాయల్టీ పెనుభారం నిర్ణయాన్ని ఉపసహరించుకోకుంటే గ్రానైట్ పరిశ్రమ అంటే వెలుగు వెలిగిన కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలో దివాలా తీసే పరిస్థితి వస్తుందంటూ యాజమాన్యాలు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 297 గ్రానైట్ లీజులు ఉండగా వీటి పరిధిలో 977 హెక్టార్లలో గ్రానైట్ వెలికి తీస్తున్నారు. క్వారీల నుంచి 100 నుంచి 150 కోట్ల విలువ చేసే 50 వేల నుంచి 70 వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను వెలికి తీసి చైనాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలోని బావుపేట, కాజీపూర్, కమాన్‌పూర్, ఒద్యారం, ఆచంపల్లి గ్రామాల్లో కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న గ్రానైట్ 50 వేల క్యూబిక్ మీటర్లు విదేశాలకు ఎగుమతి అవుతుండగా 20 వేల క్యూబిక్ మీటర్లు మాత్రం స్థానికంగా ఉన్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లకు వినియోగిస్తున్నారు. దేశంలోని సుమారు 8 రాష్ట్రాలకు చెందిన ప్రజలు వివిధ విభాగాల్లో కార్మికులుగా పని చేసేందుకు వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. 2014లో 300 మేరకు క్వారీలు నడవగా ప్రస్తుతం 60 క్వారీలు మాత్రమే పనిచేస్తున్నాయి. క్వారీలు అన్ని ఉత్పత్తి చేసినప్పుడు 24 లక్షల టన్నుల గ్రానైట్ ఎగుమతి కాగా ఇప్పుడు ఈ క్వారీల నుంచి 10 లక్షల టన్నుల గ్రానైట్ మాత్రమే ఎగుమతి అవుతోంది. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ జులై 8న విడుదల చేసిన జీవో నెంబర్ 14 ప్రకారం బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ మైనింగ్‌పై సీనరేజస్ చార్జీలను 20 శాతం పెంచింది. దీని ప్రకారం కలర్ గ్రానైట్ గ్యాంగ్సా రేటు రూ.1128/రూ.2990 నుంచి రూ.1354/రూ.3588కి పెరిగింది. బ్లాక్ గ్రానైట్ గ్యాంగ్సా రేటు రూ.1361/రూ.3900 నుంచి రూ.1633/రూ.4680కి పెరిగింది. ఫలితంగా ఒక్క మీటర్ క్యూబ్ గ్రానైట్‌పై రూ.1435 అదనపు భారం పడుతుంది.

**నిర్వహణలో అదనపు భారం**

2022లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 18, 21 ద్వారా 30 శాతం రాయల్టీ పెంచిన నేపథ్యంలో ఇప్పటి వరకు మొత్తంగా 88 శాతం భారంగా మారిందని వాపోతున్నారు. రాయల్టీపై అదనంగా 40 శాతం వసూలు చేస్తున్న పర్మిట్ ఫీజు పరిశ్రమపై మరింత భారం మోపుతోంది. కాగా ఇది ఇతర రాష్ట్రాల్లో అమలు లేకపోవడంతో తెలంగాణలోని పరిశ్రమలు పోటీ పడలేక కుదేలవుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న 20 శాతం డిఎంఎఫ్ చార్జీలను ఎపి, ఒడిశా, కర్నాటకలో 10 శాతానికి పరిమితం చేయడంతో ఇక్కడి పరిశ్రమకు మార్కెట్ భారంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన సీనరేజ్ పన్ను కలుపుకుని అమ్మకం ధరలో 65 శాతానికి పైగా ఖర్చవుతోందని వాపోతున్నారు. వరుసగా ఎదురవుతున్న నష్టాలను భరించలేక ఇప్పటికే చాలా క్వారీలు మూతపడ్డాయని, క్వారీ నిర్వాహకులు అప్పుల్లో కూరుకుపోయారని , ప్రభుత్వం వెంటనే పునరాలోచించి పెరిగిన చార్జీలను తగ్గించాలని కోరుతున్నారు.

**ఉపాధిపై తీవ్ర ప్రభావం**

ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రస్తుతం ఉన్న పన్నులు తగ్గించి 10 శాతం మేరకు మాత్రమే పన్నులు వసూలు చేస్తుండడంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బయ్యర్లు అక్కడికి వెళ్లి గ్రానైట్ బ్లాక్స్ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో పన్ను మినహాయింపు ప్రాంతాల వైపు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 14ను తక్షణం ఉపసంహరించాలని, జీవో నెంబర్ 4 (2023) ద్వారా ఇచ్చిన రెండు సంవత్సరాల ఉపశమన గడువును మరింత పొడిగించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. పర్మిట్ ఫీజును పూర్తిగా రద్దు చేసి రాయల్టీ, సీనరేట్ చార్జీలు 40 శాతం వరకు తగ్గించాలని కోరుతున్నారు. ఆంధ్రా, ఒడిశా, కర్నాటకలో అమలులో ఉన్న మాదిరిగా డిఎంఎఫ్ చార్జీలు 30 శాతం నుంచి 10 శాతానికి తేల్చాలని డిమాండ్ చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడి వలస కార్మికులు, కూలీలు, ట్రాన్స్‌పోర్టర్లు, మెషినరీ టెక్నీషియన్లు, ముడిసరుకుల సరఫరాదారులు వేలాది మంది జీవిస్తున్నారు. తాజా నిర్ణయాలతో పరిశ్రమలో ఉపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని యజమానులు వాపోతున్నారు.

**పరిశ్రమలు నడిపేదెలా?**

**విజయ భాస్కర్, క్వారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

ప్రభుత్వం పెంచిన రాయల్టీతో పరిశ్రమలను మూసి వేసుకునే పరిస్థితి వచ్చింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ రాయల్టీ ఫీజు పెంచడంతో బయ్యర్లు సైతం రావడం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 14, 16 వల్ల గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ మరింత కష్టంగా మారింది. ఇప్పటికే అనేక సార్లు పెంచగా ఇబ్బందుల మధ్య పరిశ్రమలు నడిపిస్తున్నాం. పరిశ్రమలు మూతపడితే అనేక మంది ఉపాధి కోల్పోయే అవకాశముంది. ప్రభుత్వం వెంటనే జీవోను ఉపసంహరించుకుని పరిశ్రమలను కాపాడాలి.

## తరలింపు సాగనివ్వం
(మొదటి పేజీ తరువాయి)

ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని 95 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ కార్డును కూడా అమలు చేస్తున్నామన్నారు. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందిస్తున్నామన్నారు. ముదిగొండ మండలంలో 84 శాతం ఇండ్లకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని 22500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. 104 సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నామని మహిళలకు 21వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. రానున్న మూడేళ్లలో మరో రూ. 80వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. అంతకు ముందు ముదిగొండ మండలం కమలాపురంలో 10వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ నిర్మాణానికి పెద్దమండవ గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నాగార్జున సాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందక నష్టపోతున్నామని తెలిపిన భట్టివిక్రమార్క సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వేర్ హౌజింగ్ కార్పోరేషన్ ఎండి లక్ష్మి , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, సిపి సునీల్ దత్, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వల్లెవేస్తున్నారు
(మొదటి పేజీ తరువాయి)

పదాలనే ఆమె వల్లె వేస్తున్నారని జగదీష్ రెడ్డి ఆదివారం తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో 25ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, ఎన్నికల విజయాలకు తనదే బాధ్యత అయితే, ప్రస్తుత ఓటమికి కూడా తానే బాధ్యుడనని అన్నారు. ఏదైనా అంతిమంగా పార్టీనే ఫైనల్ అని, వ్యక్తులుగా ఏదో చేస్తామంటే వారి భ్రమ అని, కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారని, కానీ తాను అలా కాదని, పార్టీకి సైనికుడినని తెలిపారు. తాను ఈ మధ్య కాలంలో కెసిఆర్‌ను 50 సార్లు కలిశానని, వారి గురించి మాట్లాడటం వృథా అని చెప్పానని, బనకచర్ల, వ్యవసాయరంగానికి సంబంధించిన అంశాలపైనే తాను కెసిఆర్‌తో చర్చించామని జగదీష్ రెడ్డి తెలిపారు. కెసిఆర్ లేకపోతే ఎవ్వరూ లేమని, అందులో ఎటువంటి సందేహమూ లేదని స్పష్టం చేశారు. తాను చావుతప్పి కన్నులొట్టబోయినట్టుగా గెలిచానని, కానీ కొంతమంది అది కూడా గెలవలేదు కదా?,అని ఎద్దేవా చేశారు. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని, తాను చూసి ఉంటే స్పందించేవాడినని జగదీష్ రెడ్డి తెలిపారు.

## ఎందాకైనా పోరాడతాం
(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు,ప్రభుత్వ సలహా హర కర వేణుగోపాల్ ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణారావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ అంబేద్కర్ చౌరస్తాలోని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుల కృషి మేరకు రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు కోటీ పది లక్షల రూపాయలు మంజూరు చేశామని ,రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా 75 కోట్లు ఖర్చు చేసి అంతర్గాం, ముర్మూర, బ్రాహ్మణ పల్లి ,ఎల్లంపల్లి సోమనపల్లి, మద్దిరాల, తొట్యాలపురం మొదలగు గ్రామాలకు, 17 ఎల్ ద్వారా కుక్కల గూడూరు, నిట్టూరు గ్రామాలకు మొత్తం 13 వేల పైగా ఎకరాలకు నీరు చేరుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మంథని నియోజకవర్గం, పెద్దపల్లి జిల్లాకు ఒక ఎకరాకు నీరు ఆందించలేదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెట్టామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం లక్ష కోట్లు వృథా చేసిందని అన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టు 38 వేల కోట్లతో నిర్మించి ఉంటే నేడు గోదావరి పరివాహక ప్రాంతంలో కరువు ఉండేది కాదని, గత ప్రభుత్వం దోపిడి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని తెలిపారు. 3 బ్యారేజీలు ఫౌండేషన్ బలహీనంగా ఉందని, అక్కడ నీరు నిల్వ చేస్తే 44 ఊర్లు , భద్రాచలం కొట్టుకొని పోతాయని ఎన్.డి.ఎస్.ఏ రిపోర్ట్ అందించిందని అన్నారు. 3 బ్యారేజీల మరమ్మతు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని,వ్యవసాయ శాఖ, నీటీ పారుదల ప్రాజెక్టు సమన్వయంతో 3 బ్యారేజీలు నిరుపయోగంగా ఉండగా గత సంవత్సరం రికార్డు స్థాయిలో 2 కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని అన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు నాయకులు ఇచ్చిన హామీల అమలు మేరకు ఉమ్మడి జిల్లా మంత్రిగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. రేషన్ కార్డులు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ పంపిణీ చేస్తామని అన్నారు.

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో లక్షాధికారుల చేయాలని లక్ష్యంతో పని చేశామని, నేడు మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. బండ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో అనేక ధర్నాలు చేశామని అన్నారు. ప్రస్తుతం గత ప్రభుత్వాల తప్పిదాలను సరి చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం రైతులు అధిక ఆదాయం సంపాదించాలనే లక్ష్యంతో ఆయిల్ పామ్ విస్తరణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ,రైతు ఆదాయ వనరులు పెంచే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని రావాలని, రామగుండం ప్రాంతంలో ఎన్టిపిసి, సింగరేణి, ఆర్.ఎఫ్.సి.ఎల్, కేశారాం సిమెంట్ వంటి పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడ ప్రైవేట్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేస్తామని,రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ప్రతి నీటి చుక్కను ఉత్తర తెలంగాణ ప్రాంతాలు వాడుకునేలా ప్రణాళికలు చేయాలని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే కోరిక మేరకు స్థానిక బస్ స్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17ఎల్, 27 ఎల్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యం అవుతుందని అన్నారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజల చిరకాల వాంఛ రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రామగుండం ప్రాంతంలో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మించాలని కోరారు. స్థానికంగా ధాన్యం నిల్వ చేసేందుకు అదనపు గోడౌన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 2 గంటలే ప్రయాణం
(మొదటి పేజీ తరువాయి)

రూ. 650 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. కెటిఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని చెబుతున్నారని, అయితే ఉప్పల్ నారపల్లి ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్ల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని, బంగారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణను చేసిందని దుయ్యబట్టారు. ప్రజలే దేవుళ్లుగా మారి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఆయన అన్నారు.

**బిసి రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు**

బిసి రిజర్వేషన్ల గురించి కెసిఆర్ కుమార్తెకు ఏం సంబంధం అని ప్రశ్నించిన మంత్రి, గత పదేళ్లు బిసిల గురించి ఎందుకు మాట్లాడలేదని బిఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. ఎవరెవరికి ఎంత ఇవ్వాలో వారికే ఇస్తామనేది తమ ఇందిరమ్మ ప్రభుత్వ విధానమని చెప్పారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.

## చట్టం చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్లమెంటులో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ ధర్నాకు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రిజర్వేషన్ల విషయంలో సిఎం ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరినీ కలుపుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైన ఒత్తిడి పెంచే విధంగా ఐక్య పోరాటాన్ని చేపట్టాలని జాన్‌వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ వద్దకు పంపిస్తే ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు పార్లమెంటులో రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించకపోతే వారు తమ పదవులకు రాజీనామా చేసే విధంగా ఒత్తిడి పెంచేలా ఆందోళనా కార్యక్రమాలకు పూనుకోవాల్సి వస్తుందని జాన్‌వెస్లీ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ నాశనం
(మొదటి పేజీ తరువాయి)

చివరి నిమిషంలో అనుకోకుండా గెలిచిన సీటు అని కవిత ఎద్దేవా చేశారు. ఎన్నడూ ప్రజా ఉద్యమాలు చేయలేదని, కెసిఆర్ లేకపోతే ఆ లిల్లీపుట్ నాయకుడు ఎవరని ప్రశ్నించారు. మనలో మనకు అయోమయం ఉన్నప్పుడు ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడవచ్చునా అని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు చేపట్టనున్న 72 గంటల నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనపైన వ్యాఖ్యలు చేపించే కుట్రకు పాల్పడిన ఆ నాయకుడు తన (కవిత) వద్ద పది మందిని పెట్టి ఇక్కడ జరిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తీసుకుంటున్నానని చావు తెలివితేటలను ప్రదర్శిస్తున్నారని, కానీ అక్కడ (బిఆర్ఎస్) ఏం జరుగుతుందో కూడా తనకు సమాచారం వస్తుందని, ఏ సమయంలో ఎవరిని కలిశారు..? అన్నీ తనకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తనను ఒంటరి చేసి ఏదో చేయాలనుకుంటున్నారన్నారు . సిఎం రమేష్ స్వయంగా బయటికి వచ్చి మాట్లాడడం, తాను కెసిఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడం ఈ రెండింటికీ అవినవభావ సంబంధం ఉన్నదని భావించే పరిస్థితి వస్తుందన్నారు. తన తండ్రి కెసిఆర్‌కు అంతరంగికంగా రాసిన ఉత్తరాన్ని బయటపెట్టి, పార్టీలోని అంశాలను బహిర్గతం చేసింది ఎవరు?, తనను మాట్లాడేందుకు ఫోర్స్ చేసి, ఇప్పుడు దాని చుట్టూ డ్రామాలు ఆడుతున్నారని కవిత మండిపడ్డారు.

ఉద్యమంలో తమను బంధించినవారే.. బిఆర్ఎస్‌లో పదవులు పొందారు...

నిన్న గాక మొన్న పార్టీలోకి వచ్చిన ఒక చిన్న పిలగాడు కూడా ఎటుపడితే అటు మాట్లాడుతున్నారని, 'అసలు మీరేవరు..?తెలంగాణ ఉద్యమంతో మీకు సంబంధం ఏమిటి..?, బిఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత బిఆర్ఎస్‌లో చేరి. పదవులు పొంది, ఉల్టా తమపైనే మాట్లాడుతారా? తాము ఉద్యమించిందే మీ మీద కదా?' అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిలగాడు చిన్న పిలగాని తరహాలోనే ఉండాలని, పెద్దవారి విషయంలో తలదూర్చవద్దని హితవుపలికారు. తాము ఉద్యమాలు చేసి బతుకమ్మ తీసుకుని వెళ్తుంటే తమను బంధించిన వారే, బిఆర్ఎస్ అధికారంలోనికి రాగానే తమ పార్టీలో చేరి, పదవులను అనుభవించారని, అలాంటి వారు తమపైనే వేలు ఎత్తి చూపిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారికి పదవులు ఇచ్చారు కాబట్టే తెలంగాణ వాదులు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అవినీతి కాంగ్రెస్ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలి: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 20 నెలల అసమర్థ, అరాచక, అవినీతి పాలనకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. రానున్న ఉప ఎన్నికల్లో అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు కూడా ఆగిపోతాయని, కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న మోసాలు, కుంభకోణాలను ప్రజలు అంగీకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ భావించి, అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిలిపివేస్తుందని కెటిఆర్ ఆరోపించారు. జూబ్లీహిల్స్ దివంగత ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా మరోసారి జూబ్లీహిల్స్‌లో బిఆర్‌ఎస్ జెండా ఎగురవేద్దామన్నారు.



తెలంగాణ యూనివర్సిటీల అభివృద్ధిలో కాంట్రాక్ట్ అధ్యాపకుల పాత్రపై ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

## మహిళల ఆర్థిక స్వాలంబనకు ప్రభుత్వం చేయూత

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహిళల అభ్యున్నతి కోసం సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంబనతో ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి అనసూయ సీతక్క మహిళలకు పిలుపునిచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం విస్తృత స్థాయిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. మోసా, చందూర్ మండల కేంద్రాలలో నూతనంగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదివారం ప్రారంభోత్సవాలు చేశారు. అదేవిధంగా మోస్రాలో జనరల్ ఫంక్షన్‌హాల్, చందూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజ్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి లబ్దిదారులకు రేషన్ కార్డుల మంజూరి పత్రాలు, స్వయం సహాయ మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సును కాంక్షించే ప్రభుత్వమని, అందుకే అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వసతులతో కూడిన మండల కార్యాలయాల సమీకృత భవన సముదాయాలను నిర్మించటంతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇల్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో అమలవుతున్నాయన్నారు. పోడు పట్టాలను ఇప్పటికే అర్హులను గుర్తించి పంపిణీ చేశామని ఇంకను కొంత మంది అర్హులు మిగిలి ఉన్నందున వారికి కూడా పోడు పట్టాలు అందించేందుకు చొరవ చూపాలని పోచారం మంత్రిని కోరగా సీతక్క సానుకూలంగా స్పందించారు. కార్యక్రమాల్లో సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, డీపీఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీ రాజ్ ఈఈ శంకర్, సంబంధిత శాఖల అధికారులు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల చైర్మన్లు, ప్రజలు పాల్గొన్నారు.



## పేదలందరికీ సంక్షేమ ఫలాలు

రేషన్‌కార్డుల పంపిణీలో మంత్రి వివేక్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అంధించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఆధునికరణ కోసం రాష్ట్రంలో రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. పది వేల మంది ఉపాధాయులను నియమించి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ఎన్నికల్లో హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే ప్రజలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గానికి మొదటి విడతో 35 వందల ఇల్లు మంజూరైనప్పటికీ అధిక సంఖ్యలో లబ్దిదారులున్నందున రెండవ విడతలో పేర్లు వచ్చిన స్వంత స్థలం ఉన్న వారందరికి ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. రానున్న కాలంలో ఇల్లు లేని పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ నియోజకవర్గంలో పది వేల ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేయగా, ఇప్పటీకి 8 వేల ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే గజ్వేల్ నియోజక వర్గంలో నాలుగు వేల రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గజ్వేల్ మాజీ ఎంఎల్‌ఎ,డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ హమీద్, ఆర్డీఓ చంద్రకళ, డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డి,మాజీ అధ్యక్షులు ఎలక్షన్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మాజీ అధ్యక్షులు భూంరెడ్డి, ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సిపిఐ నాయకులు దయానందరెడ్డి, నాయకులు మునీర్, గాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాష, కరుణాకర్, భానుప్రకాష్ రావు,ఆజీస్ తదితరులు పాల్గొన్నారు.




**రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి**

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జగదేవ్‌పూర్ మండల రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంత్రి వివేక్ వెంకటస్వామికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఆదివారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి మండల రేషన్‌డీలర్లు పలు సమస్యలను వివరిస్తూ మెమోరాండం అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్‌డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంపు, పర్మినెంట్ ఆథరైజేషన్, హెల్త్ కార్డులు, రేన్‌దుకాణాల నిర్వహణకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షకార్యదర్శులు రమేష్, అన్నపూర్ణ నర్సింలు, డీలర్లు మునీర్, సత్యం పరమేశ్వర్, రాజేందర్, ఎల్లారెడ్డి, ఈదిరెడ్డి, సురేష్, వెంకటేష్, అశోక్, అనంతం, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు త్వరలోనే 'హెల్త్ కార్డులు'

ప్రతి మూడు నెలలకూ 'ఆరోగ్య సమీక్షలు'
సెప్టెంబర్ 5 నుంచి అన్ని గురుకులాల్లో ఒకే రకమైన భోజనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో ఆహారం, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు తీసుకుంటుంది. నాణ్యమైన ఆహారం విషయంలో ఇప్పటికై 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్, పారదర్శక టెండర్' విధానాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, త్వరలోనే గురుకుల విద్యార్థులకు 'హెల్త్ కార్డ్'లు ఇవ్వనుంది. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖతో పలుమార్లు సంప్రదింపులు జరిపింది. ప్రస్తుతం గురుకులాల్లో చేరుతున్న విద్యార్థులలో కొందరికి ఇదివరకే రక్తహీనత, లాంటి పలు సమస్యలు ఉంటున్నాయని, అలాంటి వారు గురుకులాల్లో చేరిన తర్వాత ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుందని, సదరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేలోపే పరిస్థితులు విషమిస్తున్నాయని సంక్షేమ శాఖ గుర్తించింది. దీంతో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి హెల్త్ కార్డులను ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి విద్యార్థి బరువు, హెమోగ్లోబిన్ స్థాయి, బిఎంఐ వంటి వివరాలను ఆ 'హెల్త్ కార్డ్'లో పొందుపర్చనున్నారు. ఇలాంటి ఆరోగ్య సమస్యలను త్రైమాసికం సమీక్షించి, ఆహారం అలవాట్లతో ఆరోగ్యంలో వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సంక్షేమ శాఖ నిర్ణయించింది. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు రక్త హీనత సమస్య ఉన్నదనే విషయం తల్లిదండ్రులకు కూడా తెలియదని, అందుకే గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావించింది.




**సెప్టెంబర్ 5 నుంచి అన్ని గురుకులాల్లో ఒకే రకమైన ఆహారం**

సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న లక్షలాది విద్యార్థులకు రుచికరమైన, పరి శుభ్రమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించే ఉద్దేశంతో చేపట్టిన 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్, పారదర్శక టెండర్ ప్రక్రియ' అమలును వేగవంతం చేసింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్ల టెండర్ ప్రక్రియ ముగిసింది. సెప్టెంబర్ 5 నుంచి కొత్త కాంట్రాక్టర్లు ఆహార ఇతర వస్తువులను సరఫరా చేయనున్నారు. అన్ని గురుకులాల్లో ఒకే రకమైన నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందనుంది. రాష్ట్ర స్థాయిలో అవసరమైన అన్ని పదార్థాలను కూడా ఒకే ప్రమాణం, ఒకే రేటుకు కొనుగోలు చేసి, జిల్లాల వారికి పంపించనున్నారు. తద్వారా నాణ్యమైన సరఫరా సజావుగా, సమయానికి జరుగుతుందని సంక్షేమ శాఖ భావిస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వారీగా వేర్వేరు సరఫరాదారులపై ఆధార పడే విధానంతో నాణ్యత వ్యత్యాసాలు, రవాణ లోపాలు, రేట్ల భేదాలు ఉండేవని, కొన్నిసార్లు సరఫరా ఆలస్యం జరిగి, పదార్థాల నాణ్యత తగ్గిపోవడం వంటి సమస్యలు వచ్చేవని అధికారులు తెలిపారు. సరఫరా చేసే ఏజెన్సీలు నాణ్యత, పరిమాణం, సమయపాలన తప్పని సరిగా పాటించాలని, ఇందుకు డాష్‌బోర్డ్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.అలగు వర్షిని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు**

ఆహార నాణ్యత కోసం స్టీమ్ కుకింగ్ తప్పనిసరి చేశారు. వండిన పదార్థాలను స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలలోనే నిల్వ చేయాలని, ప్లాస్టిక్, అల్యూమినియం పాత్రలకు పూర్తిగా నిషేధించాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రతి నెలా యాదృచ్ఛికంగా ఆహార నమూనాలు సేకరించి, గుర్తింపు పొందిన ఫుడ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇదివరకే సంక్షేమ శాఖ హెచ్చరించింది.

## ప్రతి పౌరుడు సాయుధ బలగాల.. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'మన వీరులకు వందనం ఆపరేషన్ సింధూర్' పేరిట దేశ భక్తిని చాటి చెప్పే ఒక ప్రత్యేక కార్యక్రమం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ)లో జరిగింది. అఖిల్ భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఎబిఆర్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, దేశ సేవలో తమ ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగానికి, ధైర్యసాహసాలకు ఘన నివాళి అర్పించింది. ప్రత్యేకించి పహెల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లలోని అనేక ఉగ్రవాద శిబిరాలపై భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్‌పై ఈ కార్యక్రమంలో ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి, ఏబిఆర్‌ఎస్‌ఎమ్ జాతీయ సంయుక్త సంఘటనా కార్యదర్శి గుంథా లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ దేశ యువతతో పాటు ప్రతి పౌరుడు సాయుధ బలగాల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి అనేది ఒక నినాదం కాదని, అది ఒక జీవన విధానమన్నారు. డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో భారత్ ఉపయోగించిన సుదూర డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ వంటి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రశంసించారు. నేడు భారత్ సాంకేతికంగా బలమైన, ఆత్మనిర్భర్ దేశమని ఆయన అన్నారు. గుంథా లక్ష్మణ్ ఏబిఆర్‌ఎస్‌ఎమ్ పాత్రను వివరిస్తూ, ఈ సంస్థ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) 2020కి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శౌర్య గీతం, సెల్యూటింగ్ ది సోల్జర్స్, ఏ సాంగ్ ఆఫ్ సాక్రిఫైస్ అనే థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ పాటకు బల్లెపల్లి మోహన్ సంగీతం అందించి, గానం చేయగా, సాహిత్యాన్ని అగరం వసంత (హోసూరు), రమణ వనమాల అందించారు. పాటలోని తెలుగు భావాన్ని చెక్కుచెదరకుండా ఆంగ్లంలోకి అనువదించి గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ డాక్టర్ వంగీపురం శ్రీనాథ చార్యులు అందించారు. రవి వర్మ పోతేదార్ ఈ పాటకు మెలోడీ సమన్వయం చేశారు.




## తప్పుదోవ పట్టిస్తున్నారు!

ఎపి మంత్రి నారా లోకేష్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బనకచర్లపై ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలను తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. నీటి లభ్యతపై సరైన అవగాహన లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ నికరజలాలు, మిగులు జలాలు, వరద జలాల గురించి లోకేష్ ముందు తెలుసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ట్రిబ్యునల్ నిర్ణయం ప్రకారం తెలంగాణకు 968 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 531 టిఎంసిల నికర జలాలు కేటాయించిన తర్వాతే మిగులు జలాలు, ఆ తర్వాత వరద జలాల గురించి ఆలోచించాలని స్పష్టం చేశారు. వరద జలాల లభ్యత పైన ప్రాజెక్టుల నీటి వినియోగం పూర్తయిన తర్వాతే వరద జలాలు లెక్కలోకి వస్తాయన్నారు. ఈ విషయం తెలియకుండా ప్రజలను మభ్యపెట్టి, ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసే విధంగా లోకేష్ ప్రయత్నిస్తున్నారని మంత్రి ప్రభాకర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, ట్రిబ్యునల్ నిర్ణయించిన విధంగా తెలంగాణకు ఉన్న నీటి హక్కులను ఒక్క చుక్క కూడా వదులుకోమని ఆయన తేల్చి చెప్పారు. నీటికి సంబంధించిన అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య గతంలో నెలకొన్న పరిస్థితులు మళ్లీ తీసుకురావడం మంచిది కాదని ప్రభాకర్ అన్నారు. ప్రజలను మోసం చేసే విధంగా తప్పుడు సమాచారం ఇవ్వద్దని మంత్రి హితవు పలికారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చాకే అభివృద్ధి అవుతుందని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. జనహిత పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆర్మూర్‌లో పాదయాత్ర చేసిన తర్వాత పివిఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాకే మెరుగైన అభివృద్ధి జరుగుతుందన్నారు. అర్గుల్ గ్రామానికి పెట్టింది పేరని, ఇక్కడి నుంచి అర్గుల్ రాజారాం మంత్రిగా వ్యవహరించారన్నారు. నాణ్యమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, రైతులకు ఇస్తుందని చెప్పారు. రైతులకు 20 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదవాడి కళ అని పేదవాడి కలను తీర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో నాయకులు మీనాక్షి నటరాజన్, సంపత్‌కుమార్, షబ్బీర్ అలీ, సీతక్క, సుదర్శన్ రెడ్డి, సురేష్, భూపతిరెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఘటనాస్థలంలో సూసైడ్ నోట్ లభ్యం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నయీమ్‌నగర్‌లోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి శివాని (16) ఎంపిసి మొదటి సంవత్సరం విద్యార్థినీ కళాశాల ప్రాంగణంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందించకుండా కళాశాల యాజమాన్యం నేరుగా వరంగల్ ఎంజి ఎం ఆసుపత్రి మార్చురీకి తరలించింది. ఈ చర్యపై శివాని కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులలోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాగా ఘటనాస్థలంలో ఒక సూసైడ్ నోట్ లభించింది. అందులో కళాశాలలో చేర్చే ముందు ఒక్కసారి ఆలోచించాల్సింది అంటూ.. ఆ చదువు నాకు అర్థం అవుతలేదు అని, తన తల్లిదండ్రులు ఇంత ఫీజ్ కట్టి చదువిస్తున్నా నాకు సరైన మార్కులు రావడం లేదని శివాని తన మనోవేదనను వ్యక్తం చేసింది. ఈ కార్పొరేట్ విద్యా విధానమే తన చావుకు కారణం అని ఆ లేఖలో స్పష్టంగా తెలియచేసింది. అంతేగాక ఈ లేఖతో మరింత అనుమానాలు ముదిరాయి. పూర్తి విషయాలను వెలికితీసేందుకు పోలీసులు విచారణ ప్రారంభించారు. కళాశాల యాజమాన్యం నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన రాలేదు.




**విద్యార్థి ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు....**


విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఈ ఘటనపై సీరియస్‌గా స్పందిస్తూ, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, వారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో శివాని మృతదేహాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థిని చావుకు కారణమైన విద్యాసంస్థ పర్మిషన్ రద్దు చేసి, కాలేజీని మూసివేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు.

## శృతి మించిన వైద్య దోపిడీ

ఆరోగ్యశ్రీ ఉన్నా అక్రమ వసూళ్లు
ఆరోపణలు వస్తేనే చర్యలు
'ప్రసూన'పై చర్యలకు జంకెందుకు...?

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరంలో వైద్య దోపిడీ శృతిమించుతుంది. కొన్ని ఆసుపత్రులు ప్రభుత్వ నియమ నిబంధనలను తోసిపుచ్చి తాము చెప్పిందే చట్టమన్న రీతిలో వ్యవహరిస్తున్నాయి. ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై స్పందిస్తున్నారు తప్ప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మిగిలిన సమయాల్లో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఖమ్మం ఆసుపత్రుల్లో కొన్నింటి పరిస్థితి దొరికితే దొంగ దొరకకపోతే దొర అన్న చందంగా తయారైంది. కొన్ని ఆసుపత్రులు పదే పదే పొరపాట్లు చేస్తున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఖమ్మంలోని ప్రసూన ఆసుపత్రి ఆరోగ్యశ్రీ పథకం ఉన్న అదనంగా డబ్బులు వసూళ్లు చేశారన్న ఆరోపణపై ఎవరో ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించలేని స్థితి. వైద్యంలో శృతి మించిన దోపిడీ జరుగుతున్నా దీనిని అరికట్టే వారు ఎవరన్న బాధితుల ప్రశ్నకు సమాధానం లేకుండాపోతుంది. ఇప్పుడు ఆసుపత్రి నిర్వహణ, వైద్యం అతిపెద్ద లాభసాటి వ్యాపారంగా మారింది. వైద్య వృత్తిని పవిత్రంగా సేవాభావంతో నిర్వహించేవారు. ఇప్పుడు వైద్యం కాసులు కురిపించే వృత్తిగా మారడంతో ఇప్పుడు ఆసుపత్రులను అడ్డుగా పెట్టుకుని వ్యాపారాలు నిర్వహించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. కొందరు వైద్యులైతే మానవత్వాన్ని మరిచిపోతున్నారు. ఎలా వీలైతే అలా డబ్బు గుంజే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో సిఎంఆర్‌ఎఫ్ నిధుల్లో అక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో ఖమ్మం పరువు తీసిన కొన్ని ఆసుపత్రులు ఏదో ఒక రకంగా అనుమతులు తెచ్చుకుని మరల అదే రీతిలో కొనసాగిస్తున్నారు. తాజాగా మార్వెల్ ఆసుపత్రి నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు కాజేసి ఇప్పుడు మూసివేతకు గురైంది. ఇంకా బయటకు రావాల్సిన ఆసుపత్రులు కొన్ని ఉన్నాయన్న ప్రచారం జరుగుతుంది. అవసరం ఉన్నా లేకున్నా ఆపరేషన్లు చేయడం, పరీక్షలు నిర్వహించడం చేస్తున్నారు. దీనిని నియంత్రించడం ఎలా అన్నది ఒక సమాధానం లేని ప్రశ్నగా మారింది. మారిన ఆహారపు అలవాట్లు, ప్రకృతి తీరు, వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యాధుల బారినపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో సామాన్యులు వైద్య సాయం పొందటం తలకు మించిన భారంగా మారింది. ఆసుపత్రులను కాసుపత్రులుగా మార్చి కోట్లు గడిస్తున్నా అక్రమార్కులపై ఎక్కడో ఒక చోట చర్యలకు ఉపక్రమించకపోతే భవిష్యత్తులో రోగాల బారినపడిన పేద, మధ్యతరగతి ప్రజలు బతికే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు సైతం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని ఆసుపత్రుల్లో ఆర్‌ఎంపిలు చెప్పిన వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలపైన విచారణ జరగాల్సి ఉంది. మొత్తంగా వైద్యాన్ని సామాన్యుల దరికి చేర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రభుత్వ పరంగా వైద్య సాయం అందిస్తూ ప్రైవేటు వైద్య దోపిడీని నిలువరించాల్సిన బాధ్యత తమదేనన్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నకిలీ బిల్లులు, అక్రమ వసూళ్లకు పాల్పడిన ఆసుపత్రులను సీజ్ చేయడంతో పాటు వైద్యులను వైద్య వృత్తి నుండి బహిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


OFFICE OF THE DISTRICT COORDINATOR RAJIV AAROGYASRI HEALTH CARE TRUST KHAMMAM
Dated: 01.08.2025




## 'ఎంజాయ్ పేరుతో గంజాయి, డ్రగ్స్ సేవించొద్దు' సిడి ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామాలు, పట్టణాలోని కళాశాలలు, పాఠశాలలో గంజాయి, డ్రగ్స్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహా మండలి సభ్యులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా ఆధ్వర్యంలో రూపొందించిన 'ఎంజాయ్ పేరుతో గంజాయి, డ్రగ్స్ సేవించవద్దు' అనే పాటల సీడిని హైదరాబాద్, రవీంద్రభారతిలోని తన చాంబర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నదని, యువతను సక్రమమైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ మత్తులో కూరుకుపోయి, పెద్ద చదువులు చదవాల్సిన విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై పాటలు రాసిన రచయిత పల్లె నరసింహను, పాటను పాడిన కళాకారులను మంత్రి జూపల్లి అభినందించారు.





# జనరల్

STATE & REGIONAL NEWS

## రామచిలుకకు వైద్యం

**ప్రజాపక్షం/చర్ల :** అనారోగ్యంతో కదలలేని రామచిలుకను చూసి వదిలివేయకుండా వైద్య సాయం అందించి అటవీ శాఖాధికారులకు అప్పగించిన ఘటన చర్లలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక గురుదేవ్ విద్యాలయ పరిసరాల్లో ఓ చిలుక నడువలేని స్థితిలో ఉండటాన్ని ఉపాధ్యాయులు గమనించారు. వెంటనే దానిని చేరదీసి దానికి వైద్య సాయం అందించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత దానిని అటవీ శాఖాధికారులకు అప్పగించారు. చిలుక కాలుకు 126 క్రిష్ అనే నెంబర్ అమర్చి ఉండడంతో అది జియో ట్యాగింగ్ అని అనుమానం కలుగడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దానిని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అది పెంపుడు చిలుకని అది జియో ట్యాగింగ్ కాదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇదే తరహాలో జియో ట్యాగింగ్ కలిగిన ఓ గ్రద్ద చర్ల మండలంలో చక్కర్లు కొడుతుండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది.





## గ్రానైట్ క్వారీలో ప్రమాదం

### ఆరుగురు మృతి

బల్లికురవ : ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని బల్లికురవ సమీపంలోని సత్యక్రిష్ణ గ్రానైట్ క్వారీలో ప్రమాదం జరిగింది. గ్రానైట్ క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు మృతి చెందారు. ప్రమాద సమయంలో క్వారీలో పనిచేస్తున్న 16 మంది కార్మికులు ఉన్నారు. మృతులు ఒడిశా వాసులుగా ప్రాథమికంగా గుర్తించారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 4 మృత దేహాలను వెలికి తీశారు. తీవ్రంగా గాయపడిన మరో 8 మంది కార్మికులను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. క్వారీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టలేదని అధికారులు భావిస్తున్నారు. క్వారీ ప్రమాద ఘటనపై బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ స్థానిక అధికారులతో మాట్లాడారు. సహాయక చర్యలు వేగవంతం సూచించారు.

ఘటనపై సిఎం చంద్రబాబు విచారం: బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాద ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్వారీలో పనులు చేస్తున్న కార్మికులపై రాళ్లు పడడంతో పలువురు మృతి చెందారు. ప్రమాదంలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై విచారణ జరపాలని ఆదేశించారు. గ్రానైట్ క్వారీలో పలువురు కార్మికులు దుర్మరణం పాలవడం తనని తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటిశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రమాదంలో రోజువారీ కూలీలు మృతిచెందడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యసాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు లోకేశ్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రమాదంపై మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికూమార్ స్పందించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిబంధనల మేరకు భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## 108 అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** చుట్టు చీకటి, దట్టమైన అడవి, సరిగా కాలి నడకకు నోచుకోని గొత్తికోయగూడెం, బురద రోడ్డును దాటుకొని ఎలాగైన వైద్య సేవలు అందించాలనే సహసంతో ముందుకు సాగుతున్న క్రమం లో బురద రోడ్డులో అంబులెన్స్ వెళ్ళలేని పరిస్థితి, మైలు దూరం నడిచి గర్భిణీ స్త్రీని కుటుంబ సభ్యుల సహాకారంతో తీసుకొచ్చి అంబులెన్స్‌లో అం బులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశా రు. వివరాల్లోకి వెళితే ఏటూరునాగారం మండలం గుండెంగవాయి గ్రా మానికి చెందిన ఆవులం సునీత(30) సంవత్సరాలు పురిటి నొప్పులతో బాధపడుతూ స్థానికుల సహాయంతో 108 కి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అంబులెన్స్ సిబ్బంది పైలట్ కోటి, ఈఎంటి శివలింగం ప్రసాద్‌లు హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్తున్న క్రమంలో బురదమయంగా ఉన్న రోడ్డు అంబులెన్స్ వెళ్ళని పరిస్థితి కాలి నడక మార్గాన మైలు దూరం నడిచి అంబులెన్స్ వద్దకు తీసుకొని పరీక్షించి ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సందర్భంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే పురిటినొప్పులు అధికమవడంతో తక్షణమే స్పందించిన ఈఎంటి శివలింగ ప్రసాద్ ఈఆర్‌సి డాక్టర్ మౌనిక సూచనలతో మధ్యాహ్నం 12.11 గంటలకు సుఖ ప్రసవం చేయగా పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత తల్లిబిడ్డలకు కావాల్సిన చికిత్స అందించి తల్లి బిడ్డలు క్షేమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జరిగిన విషయాన్ని వైద్యులకు వివరించి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శివలింగం ప్రసాద్, పైలట్ కోటి, గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రమాదం నుండి కపాడిన అంబులెన్స్ సిబ్బందికి గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## శిశు హక్కుల సంరక్షణ కమిషన్‌తో.. జాతీయ స్థాయి ప్రముఖ నిపుణుల బృందం భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ స్థాయిలో మేధో అభివృద్ధి వైకల్యాల రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రముఖ నిపుణుల బృందం తెలంగాణ రాష్ట్ర శిశు హక్కుల సంరక్షణ కమిషన్‌ఛైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి ,కమిషన్ సభ్యులు వందన సిహెచ్ అపర్ణా, చందన, సరితల నిపుణుల బృందం ఆదివారం సమావేశమైంది. ఈ సందర్భంగా వికలాంగ పిల్లల హక్కుల పరిరక్షణ , ప్రోత్సాహంపై కమిషన్ చేస్తున్న కృషిలో భాగస్వామ్యమైయ్యేందుకు నిపుణుల బృందం ఆసక్తిని వ్యక్తం చేసింది. పిల్లల పునరావాసం, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్నకార్యక్రమాలలో తమ సహకారాన్ని అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు, బాల హక్కుల పరిరక్షణ, పునరావాసం మరియు సమగ్ర అభివృద్ధి కోసం ఈ నిపుణులు జాతీయ స్థాయిలో అందిస్తున్న విలువైన సేవలను ప్రశంసించారు మరియు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్. శిల్ప మణోగమా డా. దత్తాత్రేయ రాయ్, రాకేశ్ రాజన్, మమత అగర్వాల్, మిస్ పి. హెప్సిబా మాణిక్య లతా, తదితరులు పాల్గొన్నారు.

## పంపుడ్ స్టోరేజ్‌ని వినియోగంలోకి తీసుకురావాలి

### రాబోయే 20ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు

### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పంపుడ్ స్టోరేజ్‌ని పెద్ద ఎత్తున తీసుకొనిరావాలని, రాబోయే 20 ఏళ్లకుసరిపడా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క అన్నారు. హైడల్‌పవర్‌తోపాటు పంపుడ్‌స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో 23పాయింట్స్‌ను గుర్తించి వాటిమీద సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలవద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాలనుంచి పులిచింతలవరకు కృష్ణామీద ఉన్న హైడల్‌పవర్ ప్రాజెక్టులను సమీక్షచేసి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైతే ప్రపంచపేరుగాంచిన కన్సల్టెంట్‌ల సేవలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. సోలార్‌ద్వారా పగలుజరిగే ఉత్పత్తిని స్టోరేజ్‌చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికతను దానికి అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించుకోవాలన్నారు. రాబోయేతరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పర్యావరణహితమైన పవర్‌ను ఉత్పత్తిచేసి అందించాలన్నారు.సిఎండినుండి సిబ్బంది దాకా వాళ్లకి అవసరమైన సాంకేతికతను పెంపొందించుకోవడానికి అవసరమైన సాంకేతికతను పెంపొందించుకోవడానికి అవసరమైన సిలబస్ రూపొందించి మూడురోజుల ట్రైనింగ్ కోసం అవసరమైన సిలబస్‌రూపకల్పనతోపాటు అవసరమైన నిపుణుల పర్యవేక్షలో ట్రైనింగ్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రీన్‌హైడ్రోజన్, ఫ్లోటింగ్ సోలార్, రూఫ్‌సోలార్ థర్మల్‌పవర్, పవనవిద్యుత్తు, అణువిద్యుత్ బ్యాటరి స్టోరేజ్‌లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్ కోసం వినియోగాన్ని ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేసుకోవాలన్నారు.

## పోలీసు ఉన్నతాధికారులు తప్పు చేస్తే ఎస్‌పిసిఎలో ఫిర్యాదు చేయండి



జస్టిస్ బి.శివశంకర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, అంతకంటే ఎక్కువ హోదా కలిగిన అధికారుల్లో పోలీసు సిబ్బందిపై పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు తప్పు చేసిన అధికారులపై ఫిర్యాదులు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ (ఎస్‌పిసిఎ) కార్యాలయం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని 8వ అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఆదివారం జస్టిస్ బి.శివశంకర్‌రావు ప్రారంభించారు. ఆయన ఎస్‌పిసిఎకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిసిఎ సభ్యులు మాజీ ఐపిఎస్ పి. ప్రమోద్ కుమార్, డిపిసిఎ ఛైర్మన్ డాక్టర్ వ(రె. వెంకటేశ్వర్లు, వై. అరవింద్ రెడ్డి, అదనపను మాజీ అదనపు ఎస్‌పి కె.వి. రామ్ నర్సింహ రెడ్డి, ఎఐజి ఎం.రమణకుమార్ సీనియర్ పోలీసు అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పిసిఎ ఛైర్మన్ జస్టిస్ బి.శివ శంకర్ రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడంలో ఇటువంటి సంస్థల ప్రాముఖ్యత ఎంతో అవసరమన్నారు.

ఎస్‌పిసిఎ స్వతంత్రంగా పనిచేస్తుందని, పోలీసు సిబ్బంది ఏదైనా దుష్ప్రవర్తన లేదా పోలీసు అధికారాలను దుర్వినియోగం పై ఫిర్యాదులు చేయడానికి పౌరులకు అందుబాటులో ఉండే వేదికను అందిస్తుందని పేర్కొన్నారు. పోలీసు పనితీరుకు సంబంధించిన ఫిర్యాదులు, ఫిర్యాదుల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని 8వ అంతస్తు,డి బ్లాక్ లో ఉన్న ఎస్‌పిసిఎ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని రాష్ట్ర పోలీసు ఫిర్యాదు అథారిటీ (SPCA) ఛైర్మన్ సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆసరా పింఛన్లలో రూ.16 కోత?

### పోస్టల్ శాఖపై లబ్ధిదారుల ఆందోళన..

**ప్రజాపక్షం/బైంసా:** నిర్మల్ జిల్లాలో ఆసరా పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా వచ్చే రూ.2016లో 16 కోత విధిస్తున్నారని పోస్టల్ శాఖ అధికారులపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నా యి.దాదాపు జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మందికి పైగా పింఛన్ దారులు ఉన్నారని,వారికి ప్రతి నెలా కేవలం రూ.2000 మా త్రమే ఇస్తున్నారని,మిగిలిన రూ.16ను పోస్టల్ శాఖ వారే ఉంచుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.పింఛన్ల పంపిణీలో జరుగుతున్న ఈ అవకతవకలపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం రూ.2016 మం జూరు చేస్తున్నప్పటికీ,తమకు మాత్రం తక్కువ మొత్తం అందడంపై పింఛన్ దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ శాఖ అధికారులు ఈ విషయంపై సరైన సమాధానం ఇవ్వడం లేదని,ఇది పూర్తిగా తమ హక్కులను కాలరాయడమేనని వాపోతున్నారు.

**బైంసా లో మహిళల నిరసన,కలెక్టరేట్ ముట్టడికి హెచ్చరిక..**

ఈ విషయమై బైంసా మండలంలోని దెగాం గ్రామంలో మహిళలు ఆందోళన నిర్వహించారు.ఎప్పటికప్పుడు రూ.2016 పూ ర్తిస్థాయిలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే,జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ విధంగా నిరసన తెలపడం ద్వారా ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చి న్యాయం పొందాలని వారు భావిస్తున్నారు.పింఛన్ దారులకు న్యాయం చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సాగునీరు అందక... రైతులకు శాపంగా మారి ఎండుతున్న పంట పొలాలు .. అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులలో జలకళ సంతరించుకుంటుంటే కాలువల ద్వారా చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. మండల పరిధిలోని కోర్లకుంట సమీపంలో భీమా పేస్ 2 ద్వారా ప్యాకేజీ 27 కాల్వకు సాగునీరు రాకపోవడంతో కాల్వ కింద సాగు చేసిన సుమారు 350 ఎకరాల మేర వరి మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. భీమా ప్యాకేజీ 27కు సాగునీరు రావాల్సి ఉండగా పాన్‌గల్ మండలంలోని తెల్ల రాళ్లపల్లి బొల్లిగట్టు సమీపంలో జమ్ము సిల్ట్ పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో కాల్వ కింద సాగు చేసిన సుమారు 350 ఎకరాల మేర వరి మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. భీమా ప్యాకేజీ 27కు సాగునీరు రావాల్సి ఉండగా పాన్‌గల్ మండలంలోని తెల్ల రాళ్లపల్లి బొల్లిగట్టు సమీపంలో జమ్ము సిల్ట్ పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో సాగునీరు కాలువల వెంట సాగటం లేదని, గతంలోనే కాలువలో జమ్ము సిల్ట్ తొలగించే పనులను చేపట్టాలని పలుమార్లు పాలకులకు అధికారులకు విన్నపించుకున్న పట్టించుకోవటం లేదని కొర్లకుంట, బొల్లారం రైతులు వాపోయారు. సాగునీరు వస్తుందని ఆశతో సుమారు 350 ఎకరాల మేర పంట పొలాలు సాగు చేసుకోవడం జరుగుతుందని ప్రస్తుతం నీళ్లు రాకపోవడంతో పంట భూములు నెర్రలు భారీ ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు వరి తూకాలు వేయగా వాటి కూడా నీళ్లు సరిపోకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు.

**నీళ్లు లేక భూములు నెర్రలు .... రైతు నారాయణ**

నాకు బీమా పేస్ 2 ప్యాకేజీ 27 కాల్వ కింద రెండున్నర ఎకరాలు పొలంలో వరి పంట వేసుకోవడం జరిగిందని కాలువకు నీళ్లు రాకపోవడంతో నీళ్లు లేక భూములు నెర్రలు వస్తున్నాయని మరో రెండు మూడు రోజుల్లో సాగునీరు రాకపోతే చేను ఎండిపోయి పెట్టిన పెట్టుబడి పై నష్టపోవాల్సి బొల్లారానికి చెందిన రైతు జిల్లెల నారాయణ వాపోయారు.

**కాల్వకు సాగునీరు వచ్చేలా చూడాలి .... రైతు హన్మంతు**

తాను కొర్లకుంటకు సమీపంలో కాలువ కింద రెండు ఎకరాల్లో వరి, మూడు ఎకరాలలో మొక్కజొన్న పంటలు వేసుకోవడం జరిగిందని, కాలువలో నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, వర్షాలు అనే కురుస్తాయి అనుకుంటే అవి కూడా ముఖం చాటేశాయని, అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని కాల్వకు సాగునీరు వచ్చేలా చూడాలి.

**ఎండిపోతున్న పంటలు .... రైతు వెంకటేష్**

ఏడు ఎకరాల పొలంలో కొంత మేర వరి నాటు కోగా, మరి కొంత వరి నాటుకోవడానికి తుకం పోసుకోవడం జరిగిందని, నాటిన వరి పొలానికి కాలువ నీళ్లు లేకపోవడంతో వ్యవసాయ బావిలో ఉన్న కొద్దిపాటి నీటితో పొలానికి కొద్దికొద్దిగా తడుపుతున్నానని, పోసిన తూకానికి నీళ్లు లేకపోవడంతో ఎండిపోతుందని ఆందోళన చెందుతున్నాడు.

**భీమా పేస్ 2 డిఈ కిరణ్ కుమార్ ......**

భీమా పేస్ 2 ప్యాకేజ్ 27 కాలువలో కేతపల్లి తెల్ల రాళ్లపల్లి మధ్యలో జమ్మూ సిల్ట్ బాగా పేరకపోవడం వల్ల కాలువలలో నీళ్లు ముందుకు పోవటం లేదని పనులు ప్రారంభమయ్యాయని రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి చివర యాకట్టు వరకు పంట పొలాలకు సాగునీరందిస్తామని తెలిపారు.



## రాష్ట్రపతితో ప్రధాని మోదీ..హోం మంత్రి అమిత్‌షా ‘వేర్వేరు భేటీలు’

### ఇటీవలి జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వివరణ

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కొద్ది గంటల వ్యవధిలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో వేర్వేరుగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ముర్మును ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో కలిసిన ప్రధాని మోదీ ఇటీవల చోటుచేసుకుంటున్న పలు కీలక పరిణామాల విషయమై చర్చించారు.అయితే వారిరువురి సమావేశానికి సంబంధించిన సమగ్ర వివరాలు ఇంకా బయటికి వెల్లడికాలేదు. ‘ప్రధానమంత్రి నరేంద్రమోదీజీని రాష్ట్రపతి భవన్‌లో సమావేశానికి రాష్ట్రపతి ఆహ్వానించారు’ అని రాష్ట్రపతి భవన్ ఒక ‘ఎక్స్’ పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్‌శా రాష్ట్రపతితో సమావేశానికి పిలువబడ్డారు’ అని మరికొద్ది గంటల సమయానికే రాష్ట్రపతి భవన్ ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలిపింది. కాగా, యునైటెడ్ కింగ్‌డమ్, మాల్దీవులను ఇటీవల పర్యటించిన తర్వాత రాష్ట్రపతితో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఇది మొదటి సమావేశం. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తుపై చర్చ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్ మూలంగా పార్లమెంట్‌లో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఆపరేషన్ సింధూర్‌పై ఉభయ సభలలో చర్చ మినహా జులై 21నుంచి ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలకు పెద్దగా ప్రాధాన్యత లేదన్న అభిప్రాయాలు ఇటీవల జోరందుకున్నాయి. గతవారం లోక్‌సభ మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆరు నెలల పాటు పొడిగించడానికి ఆమోదం తెలిపింది. దీనిపై రాజ్యసభ ఇంకా చర్చకు స్వీకరించలేదు. ఫిబ్రవరి 13న ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించబడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశం నుంచి ఎగుమతులపై 25శాతం సుంకాలను ప్రకటించడమే కాకుండా న్యూఢిల్లీ రష్యా నుంచి మిలిటరీ సామాగ్రి, చమురు కొనుగోలుపై పేర్కొనబడని జరిమానాలు ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత జరిగిన ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను కలిగిఉంది.

## బెంగాలీని ‘బంగ్లాదేశీ భాష’గా పిలవడం బిజెపి ఉద్దేశపూర్వక దుష్ప్రచారం

### ఢిల్లీ పోలీసులు క్షమాపణ చెప్పాలి

### సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్



**న్యూఢిల్లీ :** అధికారికంగా బంగ్లా అని పిలిచే బెంగాలీ భాషను ఢిల్లీ పోలీసులు ‘‘బంగ్లాదేశీ భాష’’గా చిత్రీకరించడం ఏదో పొరపాటువల్ల కాదని, ఉద్దేశపూర్వకంగానే ద్వేషం ప్రదర్శించారని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) విమర్శించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆదివారంనాడు ఢిల్లీలో ఒక ప్రకటనచేస్తూ, ఢిల్లీ పోలీసులు ఈ విషయంపై వెంటనే క్షమాపణ చెప్పితీరాల్సిందేనని డిమాండ్ చేశారు. అనేక బిజెపి పాలిత రాష్ట్రాలలో బెంగాలీలకు వ్యతిరేకంగా ఆ పార్టీ చేస్తున్న దుష్టప్రచారంలో భాగంగానే అమిత్ షా కనుసన్నల్లో ఢిల్లీ పోలీసులు ఉద్దేశపూర్వకంగా ద్వేషాన్ని వెళ్ళగక్కారని డి.రాజా విమర్శించారు.

‘‘బెంగాలీ అనేది భారతదేశ భాష, మనదేశంలో ఉన్న అన్ని భాషల లాగానే బెంగాలీ కూడా ఒక జాతీయ భాష, జన గణ మణ మన జాతీయ భాషలగీతం. భారతదేశ చరిత్రకు ఒకరూపం ఇచ్చిన భాష బెంగాలీ భాషను, బెంగాలీ ప్రజలను అవమానించిన బిజెపి, అమిత్ షా, ఢిల్లీ పోలీసులు సిగ్గుపడాలి. మన దేశాన్ని ఈ విధంగా విభజించే ముందుగా వారు రాజ్యాంగపరంగా వారికున్న విధులను గుర్తుచేసుకోవాలి, అందువల్ల ఈ ఘోర తప్పిదానికి పాల్పడిన ఢిల్లీ పోలీసులు వెంటనే జాతికి క్షమాపణ చెప్పాలి’’ అని తన ప్రకటనలో డి.రాజా డిమాండ్ చేశారు.


న్యూఢిల్లీలోని దక్షిణజిల్లా లోధీ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ అమిత్ దత్ (దర్యాప్తు అధికారి) బెంగాలీ భాష మాట్లాడే వలస కార్మికులను బంగ్లాదేశీయులనే అనుమానంపై అరెస్టుచేశారు. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించి బెంగాలీ భాషలో రాసి ఉన్న లిఖితపూర్వక పత్రాలను హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి తర్జుమా చేయడానికి ఒక అనువాదకుడు కావాలని, అనువాదకుణ్ణి నియమించాలని కోరుతూ న్యూఢిల్లీ చాణక్యపురిలోని బంగ భవన్ ఇన్‌ఛార్జి అధికారికి ఒక విజ్ఞప్తి చేశారు. ఆ లిఖిత విజ్ఞప్తిలో, భారత రాజ్యాంగబద్ధంగా గుర్తింపు పొందిన బెంగాలీ భాషను ‘బంగ్లాదేశీ భాష’గా పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా మనదేశంలో బంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారని అనుమానించి ఎనిమిది మంది వలస కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద మనదేశంలో నివసించడానికి ఎలాంటి అధికారిక పత్రాలు, వీసా, పాస్‌పోర్టులు లేవు.వారి జాతీయ గుర్తింపు కార్డులు, పుట్టినతేదీ సర్టిఫికెట్లు, బ్యాంకు ఖాతాల వివరాలు వారి నుండి విచారణ సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు వారిని న్యాయ విచారణకు తరలించారు. వారి వద్ద ఉన్న గుర్తింపు పత్రాలు బెంగాలీ భాషలో ఉండటంతో, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి వాటిని అనువదించడానికి ఒక అనువాదకుడికోసం బంగ భవన్‌ను సంప్రదించిన సందర్భంగా లిఖితపూర్వక విజ్ఞప్తి చేస్తూ, బెంగాలీ భాషను ‘‘బంగ్లాదేశీ భాష’గా సదరు ఇన్‌స్పెక్టర్ అమిత్ దత్ పేర్కొన్ని బెంగాలీ విదేశీభాషగా చిత్రించి అవమానించాడు.

అదేవిధంగా సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా ఢిల్లీ పోలీసులను తీవ్రంగా తప్పుపట్టారు. బెంగాలీ భాష మాట్లాడే వలస కార్మికులను బంగ్లాదేశీ జాతీయులుగా అనుమానించి ద్వేషాన్ని రగిలించడం ద్వారా దేశంలో రెండోస్థానంలో ఎక్కువమంది మాట్లాడే బెంగాలీ భాషను వ్యతిరేకించడం ఏకపక్ష తిరస్కార చర్యగా మార్చారని విమర్శించారు. బహుళ భాషలకు నిలయమైన భారతదేశంలో గతంలో ఏనాడూ ఈ విధంగా బుద్ధితక్కువతనంగా మెజారిటీ దురహంకార దాడి జరగలేదని గుర్తుచేశారు. భారతదేశ బహుభాషాతత్వాన్ని, భారతదేశ భిన్నత్వాన్ని, ఐక్యతే మన శక్తిఅని ఈ విధమైన భాషాపరమైన దాడిని తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

**బెంగాలీయులను విదేశీయులుగా చిత్రించే యత్నం : టిఎంసి**

బెంగాలీ అనే భాషా పదాన్ని చెప్పడానికి ‘బంగ్లాదేశీ భాష’ అనే మాటను ఉపయోగించడం ద్వారా ఢిల్లీ పోలీసులు దేశంలో బెంగాలీభాష మాట్లాడే లక్షలాదిమందిని విదేశీయులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా విమర్శించింది. ఎక్స్ వేదికగా తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఒక ప్రకటన చేస్తూ ఢిల్లీ పోలీసుల చర్యను తీవ్రంగా తప్పుపట్టింది. రాజ్యాంగపరంగా గుర్తింపు పొందిన బెంగాలీ భాషను బంగ్లాదేశీ భాషగా అదికారికంగా చిత్రీకరించే ప్రయత్నం దేశంలో ఉన్న లక్షలమంది బెంగాలీయులను విదేశీయులుగా చిత్రంచడమేనని విమర్శించింది.

‘‘బెంగాలీప్రజలపట్ల బిజెపికి కున్న ద్వేషానికి ఒక పరిమితి అంటూ లేదా? బిజెపి పాలిత రాష్ట్రాలలో బెంగాలీభాష మాట్లాడే వలసవెళ్ళిన కార్మికులను నిర్బంధించి అవమానించి, పదే పదే వేధింపులకు గురిచేసిన తర్వాత ఇప్పుడు అమిత్‌షా, ఢిల్లీ పోలీసులు అన్నిరకాల ఉల్లంఘనలకు పాల్పడ్డారు, అన్నిపరిమితులను దాటేశారు, బంగ్లా మాతృభాషను అధికారికంగా ‘బంగ్లాదేశీ భాష’గా ముద్రవేశారు’’ అని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఎక్స్ వేదికగా కేంద్ర హోంమంత్రిపైనా, ఢిల్లీ పోలీసులపైనా తీవ్రంగా మండిపడింది. ప్రపంచవ్యాప్తంగా బంగ్లా (బెంగాలీభాష) మాట్లాడేవారు 25 కోట్లమంది ఉన్నారని, భారతదేశంలోని 22 అధికారిక భాషల్లో బంగ్లాభాష కూడా ఒకటిగా రాజ్యాంగపరంగా గుర్తింపు పొందిందని అలాంటి భాషను ‘‘బంగ్లాదేశీ భాషగా పిలిచి ఉద్దేశపూర్వకంగా విద్వేషపూరిత దాడి చేశారని, బెంగాలీభాషకున్న భారతీయ మూలాలను చెరిపేశారని, బెంగాలీభాష మాట్లాడేవారిపై విదేశీయులనే ముద్రవేశారని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ తీవ్రస్థాయిలో విమర్శించింది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మూడో రోజుకు చేరిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. భద్రతా దళాలు ఉగ్రవాదుల చుట్టూ ఉచ్చు బిగించాయి. ఉదయం నుండి అడపాదడపా కాల్పులు జరుగుతుండగా, ఎన్‌కౌంటర్ మూడవ రోజుకు చేరుకుందని ఒక అధికారి తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి భద్రతా దళాలు డ్రోన్‌లతో సహా అన్ని మార్గాలను ఉపయోగిస్తున్నాయని ఆయన అన్నారు. దక్షిణకశ్మీర్ జిల్లా అఖల్‌లోని అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం ప్రారంభమైన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ప్రారంభ కాల్పుల తర్వాత, ఆ రోజు రాత్రి ఆపరేషన్ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కార్డన్‌ను బలోపేతం చేసి ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలించారు. శనివారం ఉదయం కాల్పులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు.

# ఏడాది కావొస్తున్నా.. 'న్యాయం ఎండమావేనా'?

**కోల్‌కతా ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీలో 'హత్యాచార' బాధిత యువ డాక్టర్ తల్లిదండ్రుల నిర్వేదం**

**పోలీస్, సిబిఐ మీద విశ్వాసం సన్నగిల్లింది.. ఇక న్యాయ వ్యవస్థపైనే మా ఆశ**

**మాకు లభించింది న్యాయం కాదు, ఒక కపట నాటకమని తండ్రి ఆరోపణ**



**కోల్‌కతా :** 'మా కూతురుకు న్యాయం జరుగుతుందా?' అని కోల్‌కతాలోని ఆర్‌జి.కర్ మెడికల్ కాలేజిలో 'హ'త్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్ తల్లితండ్రులు గాయపడ్డ, బాధాతప్తహృదయాలతో ఏడాదికాలంగా న్యాయం కోసం వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు. తాళం వేసిన సెమినార్ రూమ్‌లో యువ మహిళా డాక్టర్ అత్యాచారం, హత్యకు గురైన దారుణ సంఘటన పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్నే కాకుండా యావత్ భారతదేశాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే. హత్యాచారానికి గురైన కూతురు జ్ఞాపకాలు ఏడాదిపాటు నిద్రలేని రాత్రులు వెళ్లదీస్తున్నారు తల్లిదండ్రులు. ఆమె తండ్రి మాట్లాడుతూ తమ కూతురుకు న్యాయం జరగడం ఇప్పుడు కేవలం న్యాయ వ్యవస్థపైనే ఆధారపడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. 'మాకు పోలీస్, సిబిఐ మీద ఉన్న విశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. సిబిఐ రాజకీయంగా, ఇతరవిధంగా రాజీపడిందనేది మాకు అర్థం అయ్యింది. కోల్‌కతా పోలీసులు చెప్పినట్లుగా వారు చిలుకపలుకులు పలుకుతున్నారు' అని హత్యాచార బాధితురాలి తండ్రి 'పిటిఐ'కి చెప్పారు. గత ఏడాది 2024 ఆగస్టు 9న 26 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ మృతదేహాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ బిల్డింగ్ నాలుగ వ అంతస్తులోని చెస్ట్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ సెమినార్‌హాల్‌వద్ద కనుగొన్నారు. అత్యంత దారుణమైన గాయాలతో కూడిన ఆమె మృతదేహంరాష్ట్రప్రభుత్వ హాస్పిటల్‌లో లభ్యం కావడం పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. హత్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలని ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌కు చెందిన విద్యార్థులు డాక్టర్లు, పౌర సమాజానికి చెందిన వారంతా భారీసంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఎలుగెత్తారు, ఆందోళనలు నిర్వహించారు. యావత్ దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు,డాక్టర్లు ఆమెకు న్యాయం జరగాలని మద్దతుపలుకుతూ ఆందోళనలు నిర్వహించారు. ఏడాది తర్వాత ఇప్పుడు హత్యాచార బాధితురాలి కుటుంబం మాట్లాడుతూ న్యాయం అనేది అంతు చిక్కకుండానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. 'అది కేవలం హత్యకాదు. తెలివైన మహిళ ఒక హాస్పిటల్ లోపల కూడా సురక్షితంగా ఉండదు' అనే ఒక సందేశాన్ని తెలియజేస్తోందని హత్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్ తండ్రి చెప్పారు. ఆమె అత్యాచారం, హత్య కేసులో సంజయ్‌రాయ్ అనే వ్యక్తి అరెస్ట్ చేయబడి, జీవిత ఖైదు విధించబడింది. కానీ బాధితురాలి కుటుంబం, అనేక హక్కుల కార్యకర్తలు ఇంకాఈ కేసు ముగియలేదని గట్టిగా పట్టుబడుతున్నారు. 'మొదటి రోజు నుండీ మేం చెబుతున్నాం. ఒక వ్యక్తి కంటే ఎక్కువ మందే ఉన్నారు. ఆమె చాలా బలిష్టురాలైన మహిళ. ఒక సురక్షిత భవనంలోపల ఒకే ఒక్క పురుషుడు అత్యాచారం, హత్యకు పాల్పడ్డారనడానికి ఆస్కారమే లేదు. తొలినాళ్లలో జరిగినవి అన్నీ కప్పిపుచ్చడం అనేవి పెద్ద హస్తాలు ఉన్నాయనే విషయం వెల్లడిస్తోంది' అని హత్యాచార బాధిత యువ మహిళా డాక్టర్ యొక్క తల్లి కంటతడిపెట్టారు. సాక్ష్యాలను నాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని బాధితురాలి తండ్రి ఆరోపించారు. 'శ్మశానవాటికలో మూడుమృతదేహాలు ఉన్నాయి. అయినప్పటికీ మా ముందే కూతురు మృతదేహాన్ని దహనం చేశారు. ఎందుకీ తొందర? ఆధారాలను తడుడిచిపెట్టడానికి చర్యలు తీసుకున్నారు' అని ఆయన ఆరోపించారు. ఆ తర్వాత ఈ కేసుకు సంబంధించి ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, పూర్వపు తలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌ఇన్‌చార్జి అభిజిత్ మొండల్‌ను కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించారనే అభియోగాలపై ఇద్దరినీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.కానీ 90రోజుల్లో సిబిఐ చార్జిషీట్‌ను దాఖలు చేయడంలో విఫలమైన తర్వాత అభిజిత్ మొండల్ విడుదలయ్యారు.'సిబిఐనినమ్మడంమా మూర్ఖత్వమే అయ్యి ంది. కోల్‌కతా పోలీసులు వారికి ఇచ్చిన వాటినే వారు పునరావృతం చేశారు తప్ప కొత్త పేర్లు లేవు. కొత్త అరెస్టుల లేవు. సమాధానాలు లేవు' అని హత్యాచార బాధితురాలి తండ్రి చెప్పారు. కేసు నిర్వహణ గురించి ప్రశ్నలు లేవనెత్తిన సుప్రీంకోర్టు పరిశీలనను కూడా బాధిత వైద్యురాలి కుటుంబం లేవనెత్తింది. 'ఆ ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. వారు (సిబిఐ) దర్యాప్తు కొనసాగుతోంది అంటున్నారు. అది సరిపోదు' అని ఆయన అన్నారు. 'మేం సాధారణ ప్రజలమే కానీ మూర్ఖులం కాదు. మా కూతురిన ప్రభుత్వ ఆసుపత్రి లోపల తాళం వేయాల్సిన గదిలో అత్యాచారం చేసి హత్యచేశారు. శక్తివంతమైన వ్యక్తుల నుండి రక్షణ లేకుండా అది ఎలా జరుగుతుంది' అని బాధిత యువ మహిళా వైద్యురాలి తల్లి ప్రశ్నించారు 'మాకు లభించింది న్యాయంకాదు. అది ఒక కపటనాటకం.అదిన్యాయాన్నిఅపహాస్యం చే యడం. మేం చనిపోయేవరకూ దర్యాప్తును 10లేదా 20 సంవత్సరాలు లాగుతారు. అది వారి వ్యూహం. తల్లిదండ్రులను, న్యాయం కోరుకునే ప్రజలను అలసిపోనివ్వండి అనేది వారి వ్యూహం' అని హత్యాచార బాధిత యువ మహిళా వైద్యురాలి తండ్రి ఆరోపించారు.

## ఇసి తటస్థత ప్రశ్నార్థకంగా మారింది

**బిహార్ 'ఎస్ఐఆర్' పై పార్లమెంటులో చర్చ జరగాల్సిందే**

**గౌరవ్ గొగోయ్ డిమాండ్**

**పహల్గామ్‌పై ప్రజలకు హోంశాఖ క్షమాపణ చెప్పలేదు**



**గువహటి:** భారత ఎన్నికల సంఘం తటస్థత ప్రశ్నార్థకంగా మారిందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, లోక్‌సభలో ఆ పార్టీ ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ విమర్శించారు. ఎన్నికలసంఘం బీహార్‌లో చేసిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)పై చర్చ జరగాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు కోరతున్నప్పటికీ ప్రభుత్వం తిరస్కరిస్తోందని విమర్శించారు. అదేవిధంగా పహల్గామ్‌లో గూఢచారి వ్యవస్థ వైఫల్యం కారణంగా ఉగ్రవాదుల దాడి జరిగినప్పటికీ కేంద్ర హోంశాఖ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పలేదని విమర్శించారు. అసోం ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడి హోదాలో, ఆ రాష్ట్రపార్టీ విస్తుతకార్యనిర్వాహకసమావేశంలో పాల్గొనేముందుగా గౌరవ్ గొగోయ్ ఆదివారంనాడు గువహటిలోపాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రభుత్వమే నియమించినప్పటికీ ఎన్నికల సంఘం తీరుపై పార్లమెంటులో చర్చించేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన నిలదీశారు. "భారత ఎన్నికల సంఘం తటస్థత మీద సందేహాలు నెలకుంటున్నాయి, ఈ ప్రశ్న దేశ ప్రజల బుర్రలను తొలిచేస్తోంది, అందువల్లనే ఇంతముఖ్యమైన విషయంమీద పార్లమెంటులో చర్చ జరగాలని మేం కోరుతున్నాం, కానీ ప్రభుత్వం మాత్రం ఏదో విషయాన్ని దాచిపెట్టాలని ప్రయత్నం చేస్తోంది, ఏమిటది? గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ,లోక్‌సభ ఎన్నికల్లోనూ కూడా ప్రభుత్వం ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకుందా?" అని ఆయన ప్రశ్నించారు. బీహార్‌లో సవరించిన ఓటర్ల జాబితాపై పార్లమెంటులో ఎలాంటి దాపరికం లేకుండా బహిరంగంగా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, కానీ కేంద్ర ప్రభుత్వం ఎందుకని ఏదో విషయాన్ని దాచాలని ప్రయత్నం చేస్తోందని ప్రశ్నించారు. "సామాన్య ప్రజలు దేశంలో తమ ఓటు హక్కుకు సంబంధించిన విషయాలు తెలుసుకోవాలని కోరుకుంటున్నారు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవాలని కోరుతున్నారు, ఈ విషయంపై పార్లమెంటులో ఖచ్చితంగా చర్చ జరగాలని మేం కోరుతున్నాం, కానీ ప్రభుత్వం మాత్రం మే ఈ విషయంపై చర్చించలేం అని చెబుతోంది, ఎందుకని?'' అని గొగోయ్ నిలదీశారు. "ఎన్నికల సంఘం ఏ ప్రభుత్వ విభాగానికీ సంబంధించినది కాదు, అదొక ప్రత్యేక స్వతంత్ర, తటస్థ వ్యవస్థ అనేది వారి తర్కం, కానీ ఈ తర్కం అర్థరహితం, విడ్డూరమైన విషయం, ఎందుకంటే ఎన్నికల సంఘం ప్రధాన అధికారిని నియమించేదివారే, ప్రధానమంత్రి సారథ్యంలోని కమిటీయే ఎన్నికల ప్రధానాధికారిని నియమిస్తోంది'' అన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్ళిన ఓటర్లు ఆ జాబితాలలో ఉండాల్సిన తమ పేర్లు కనిపించడం లేదని, వాటిని తొలగించారని చెప్పిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. ఆపరేషన్ సింధూర్ గురించి కూడా మాట్లాడుతూ, పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన బాధితులకు కేంద్ర హోంమంత్రి కనీస మర్యాద కూడా ఇవ్వలేదు, గూఢచారి కార్యకలాపాల వైఫల్యం కారణంగా పర్యాటకులు మరణించారు, ఈ గూఢచారులు కేంద్ర హోంశాఖ పరిధిలోనే పనిచేస్తారు, కాబట్టి ఇది కేంద్ర హోంశాఖ వైఫల్యమే, కానీ ఈ విషయంపై ప్రజలకు కేంద్ర హోంశాఖ క్షమాపణలు చెప్పలేదు, ఇదీ వాళ్ళ ప్రభుత్వ పనితీరు'' అని గౌరవ్ గొగోయ్ విమర్శించారు.కాగా, అసోం కాంగ్రెస్ విస్తృత కార్యనిర్వాహక సమావేశం ఆదివారం ఉదయం గువహటిలో ప్రారంభమైంది. పార్టీ ఎంపీలు, ఎంఎల్‌ఎలు, సీనియర్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తగిన వ్యూహాన్ని రచించే విషయం సమావేశంలో చర్చించారు. అసోం అసెంబ్లీలో 126 స్థానాలు ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అసోం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. ఈ సమావేశంలో అసోం పరిస్థితులపై ఒక రాజకీయ తీర్మానంతో పాటు ఆర్థిక వ్యవహారాలపై మరో తీర్మానం కూడా చేస్తారు.




## 7న ఇండియా కూటమి విందు సమావేశం

**న్యూఢిల్లీ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంపై వ్యూహాన్ని చర్చించడానికి ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకులు 7న విందు సమావేశం నిర్వహించే అవకాశం ఉందని ఆదివారం వర్గాలు తెలిపాయి. ఎస్ఐఆర్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌కు నిరసనగా 8న భారత ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మార్చ్ చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు కూడా యోచిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో ఎస్ఐఆర్ అంశంపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ప్రతిపక్షాల విందు సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. చర్చ కోసం ప్రతిపక్షం చేసిన డిమాండ్ పాలక కూటమి నుండి సానుకూల స్పందన రాకపోవడంతో రెండు వారాల పాటు సాగిన పార్లమెంట్ సమావేశాలు దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. ఎస్ఐఆర్ అంశంపై తమ వ్యూహాన్ని చర్చించడానికి ఇండియా కూమిటి పార్టీ నాయకులు 7న విందు సమావేశం నిర్వహిస్తారని, ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక ప్రకటించబడినందున, అనేక మంది ప్రతిపక్ష నాయకులు తాము ఉమ్మడి అభ్యర్థిని కూడా నిలబెట్టవచ్చని సూచించినందున ఈ సమావేశం జరుగుతుందని వర్గాలు తెలిపాయి.

## 301 నగరాల్లో నీట్ పిజికి 2,42,000 మంది అభ్యర్థులు హాజరు

**న్యూఢిల్లీ :** వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సులలో ప్రవేశం కోసం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) నిర్వహించే నీటి పిజి పరీక్షకు ఆదివారం 2,42,000 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 301 నగరాల్లో, 1,052 పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌పై ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఒకే షిఫ్ట్‌లో నిర్వహించిన అభ్యర్థుల సంఖ్యా పరంగా భారతదేశంలోనే అతిపెద్ద కంప్యూటర్ ఆధారిత పరీక్ష. అక్రమార్గాలను కట్టడి చేసేందుకు పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు ఎన్‌బిఇఎంఎస్ వివిధ వైద్య కళాశాలలు, గుర్తింపు పొందిన ఆసుపత్రుల నుండి 2,200 కంటే ఎక్కువ మంది అధ్యాపకులను నియమించింది. అన్ని పరీక్షా కేంద్రాలలో తగినంత శాంతిభద్రతలు, సైబర్ భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూసేందుకు ఎన్‌బిఇఎంఎస్ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలకు లేఖ రాసింది. ఈ విషయంలో జిల్లా పరిపాలన, పోలీసుల నుండి కూడా సహాయం కోరింది. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి సైబర్ స్కామ్‌ను నివారించడానికి, ఎన్‌బిఇఎంఎస్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) నుండి సహాయం తీసుకుంది. ఈ పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మోసం జరగకుండా నిరోధించడానికి దాదాపు 300 మంది సైబర్ కమాండోలు వివిధ పరీక్షా కేంద్రాలకు, ముఖ్యంగా సున్నితమైన వాటికి వెళ్లారని అధికారులు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల నుండి స్వీకరించబడిన ప్రత్యక్ష సిసిటివి ఫీడ్‌ను రియల్ టైమ్ పద్ధతిలో నిరంతరం వీక్షించడానికి ఎన్‌బిఇఎంఎస్ తన కార్యాలయంలో 200 మందికి పైగా సిబ్బందిని నియమించింది. సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, మెడికల్ కాలేజీల డీన్/డైరెక్టర్ మరియు ఎన్‌బిఇఎంఎస్ గవర్నింగ్ బాడీ సభ్యులు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా పరీక్షా కేంద్రాలను సందర్శించారు. తగిన సంఖ్యలో మొబైల్ సిగ్నల్ జామర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని పరీక్షా కేంద్రాలలో మొబైల్ సిగ్నల్‌లను బ్లాక్ చేశారు. ఎండి, ఎంఎస్, పిజి డిప్లొమా వంటి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశానికి నీట్ పిజి పరీక్షను నిర్వహిస్తారు.

## ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి

**హత్యాయత్నం కేసు నమోదు!**

**శ్రీనగర్ :** లగేజీ విషయంలో ఓ ఆర్మీ అధికారికి, ఎయిర్‌లైన్స్ సిబ్బందికి మధ్య వివాదం చెలరేగింది. మాట మాట పెరిగి చివరికి చేయిచేసుకునే వరకూ వెళ్లింది. ఈ గొడవలో సిబ్బందికి గాయాలు అయ్యాయి. ఈ దాడిలో గాయపడ్డ సిబ్బంది ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. ఈ ఘటన శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో జరిగింది. విమానయాన సంస్థ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ఆర్మీ అధికారి 16 కిలోల బరువున్న లగేజీతో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఏడు కిలోల బరువు ఉన్న వస్తువులకు మాత్రమే అనుమతి ఉందని అక్కడి సిబ్బందిఆర్మీ అధికారికి తెలిపారు. అంతకు మించిన సామగ్రి ఉంటే వాటికి డబ్బులు చెల్లించాలని కోరారు. అయితే ఛార్జీలు చెల్లించడానికి నిరాకరించిన అతను ఏరోబ్రిడ్జిలోకి ప్రవేశించారు. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించినట్లు గమనించి భద్రతా సిబ్బంది ఆయన్ని వెంటనే గేట్ వద్దకు తీసుకెళ్లారు. అయితే ఈ విషయంపై ఆగ్రహించిన ఆర్మీ అధికారి అక్కడున్న నలుగురు స్పైస్‌జెట్ సిబ్బందిపై దాడికి దిగారు. పిడిగుద్దులు కురిపిస్తూ, కాలితో తన్నడం వల్ల వారికి గాయాలైనట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. దాడిలో ఓవ్యక్తి స్పృహ కోల్పోయి పడిపోయినప్పటికీ, ఆపకుండా తీవ్రంగా తన్నడం వల్ల అతని వెన్నెముకకుగాయమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతంబాధితుడుఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ అధికారులు, దాడికి పాల్పడ్డ ఆర్మీ అధికారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. సిబ్బందిపై దాడి చేసిన ప్రయాణికుడిని పౌర విమానయాన నిబంధనల ప్రకారం నోఫ్లై జాబితాలో చేర్చడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పౌర విమానయానమంత్రిత్వశాఖకు లేఖ కూడా రాశామని పేర్కొన్నారు. అయితే సిబ్బందిపై దాడికి పాల్పడ్డ ఆర్మీ అధికారికి సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. సదరు ఆర్మీ అధికారిపై హత్యాయత్నం కేసు నమోదైంది.

## చైనా జె-10 జెట్ ఫైటర్ల సామర్థ్యాన్ని చిన్నచూపు చూసిన రాఫెల్ పైలట్లు!

**ఆపరేషన్ సింధూర్‌పై రాయిటర్స్ నివేదిక**



**బీజింగ్:** భారతదేశం ఈ ఏడాది మే ఏడో తేదీన చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్థాన్ ప్రయోగించిన చైనా యుద్ధ విమానాలను భారత్ రాఫెల్ యుద్ధ విమానాల పైలట్లు తక్కువగా అంచనావేశారని సరికొత్త నివేదిక ప్రచురితమైంది. చైనా జె-10 యుద్ధ విమానాలకు, భారత్ రాఫెల్ యుద్ధ విమానాలకు మధ్య చీకట్లో గంటసేపు యుద్ధం జరిగిందని, ఈ యుద్ధంలో కనీసం ఒక రాఫెల్ విమానం కుప్పకూలిపోయిందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ ఒక నివేదికలో వెల్లడించగా, ఈ యుద్ధంలో జె-10 జెట్స్‌ను ఉపయోగించి భారత్‌కు చెందిన ఫ్రాన్స్ తయారీ మూడు రాఫెల్ యుద్ధ విమానాలనుకుప్పకూల్చివేశామనిపాకిస్థాన్ చెబుతున్నదని మరో నివేదికలో రాయిటర్స్ పేర్కొంది.భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక చర్యల సందర్భంగా ఐదు యుద్ధ విమానాలు కుప్పకూలిపోయాయని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో భారతదేశం ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందనే విషయం ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయింది. భారత రక్షణశాఖ దీనిపై ఎలాంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో అంతర్జాతీయస్థాయిలో అనేక కథనాలు వస్తున్నాయి. పాకిస్థాన్‌పై భారత్ చేసిన యుద్ధం చివరకు భారత్-చైనా గగనతల యుద్ధ సామ ర్థ్యాన్ని అంచనావేయడానికి ఒక విశ్లేషణా వేదికగా మారింది. చైనాలోని చెంగ్డూ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ తయారు చేసిన చెంగ్డూ జె-10 ఫైర్‌బ్రాండ్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కొనుగోలు చేసింది. ఈ యుద్ధ విమానం సామర్థ్యాన్ని భారత్ రాఫెల్ పైలట్లు తక్కువగా అంచనావేశారని, అందువల్లనే జె-10 యుద్ధ విమానం నుండి ప్రయోగించిన పిఎల్-15 క్షిపణి రాఫెల్ యుద్ధ విమానాన్ని కూల్చివేసిందని రాయిటర్స్ వార్తాసంస్థ సరికొత్త సమాచారాన్ని సమకూర్చిందని పాకిస్థాన్ ప్రభుత్వ పత్రిక ఆదివారంనాడు తెలియజేసింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత రాఫె ల్ యుద్ధ విమానాలు కుప్పకూలాయన్న వివాదంపై ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ యుద్ధ విమానాల కంపెనీ డస్సాల్ట్ ఏవియేషన్ సిఇఓ-ఛైర్మన్ ఎరిక్ ట్రాపియర్ ఫ్రెంచ్ మ్యాగజైన్ 'ఛాలెంజెస్'కు జూన్‌రెండోవారంలో ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. మూడు రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని ఆయన కొట్టిపారేశారు. భారతదేశ ప్రభుత్వం రాఫె ల్ యుద్ధ విమానాలపై తమకు ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదని, నిర్దేశిత లక్ష్యాలు సాధించడంలో రాఫెల్ యుద్ధ విమానాలవల్ల ఎలాంటి లోపం జరగలేదని ఇంటర్వ్యూలోఎరిక్ ట్రాపియర్ చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానం కుప్పకూలిపోయిందన్న ప్రచారం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల సైనిక వ్యవస్థలకు ఆశ్చర్యం కలిగించిందనీ, పశ్చిమదేశాల హార్డ్‌వేర్ వ్యవస్థపై సందేహాలు వస్తున్నాయని చైనా పత్రిక పేర్కొంది. దీంతో ఫ్రెంచ్ డస్సాల్ట్ కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలిగే పరిస్థితి వస్తోంది. కానీ ఉద్దేశపూర్వకంగా పాకిస్థాన్ పనిగట్టుకుని రాఫెల్‌పై దుష్ప్రచారం చేస్తోందని భారత ప్రభుత్వం ఇప్పటికే కొన్నిసార్లు ప్రకటించింది.

## బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం ప్రణాళికలు

**ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలన్న విపక్షాల డిమాండ్‌కు స్పందించని బిజెపి సర్కార్**

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు ప్రతిపక్షాలు ఐక్యంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికార పక్షం స్పందించడం లేదు. దీంతో గత రెండు వారాల నుంచి పార్లమెంటులో విపక్షాలు, ప్రభుత్వం మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం లోక్‌సభలో కీలకమైన క్రీడా బిల్లును ఆమోదింప చేసుకునేందుకు సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. క్రీడా సంస్థల పనితీరులో ఎక్కువ పారదర్శకతను కల్పించే జాతీయ క్రీడా పాలసీ బిల్లును లోక్‌సభలో పరిశీలన ఆమోదం కోసం ఎజెండాను తయారు చేశారు. ఈనెల 13 నుండి అమల్లోకి వచ్చేలా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించడంపై హోంమంత్రి అమిత్ షా చేసిన తీర్మానాన్ని రాజ్యసభ సోమవారం ఆమోదానికి జాబితా చేసింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్‌పై రెండు రోజుల చర్చ మినహా, జులై 21న బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రతిపక్ష పార్టీల నుండి తీవ్ర నిరసనలను రే వ్యక్తమవుతున్నందున ఉభయ సభలలో వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి పార్లమెంటు కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయి. గత సమావేశాల్లో తరచుగా వేర్వేరుగా తమ గళాలను వినిపించిన ఇండియా కూటమి పార్టీలు ఓటర్ల జాబితా అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి వ్యతిరేక ఓటర్లను తొలగించడం, ఆ పార్టీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపిస్తున్నాయి. అర్హత కలిగిన ఓటర్లు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించబడతారని నిర్ధారించుకోవడానికి ఓటర్ల జాబితాల సమగ్రతను రక్షించడానికి జాతీయ స్థాయిలో ఈ కసరత్తును ప్రారంభిస్తామని ఇసి చెబుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఇసి 'ఓట్ చోరీ'కి పాల్పడుతోందని (ఓట్లను దొంగిలించడం) ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని నిత్యం తూర్పారబడుతున్నారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చ చేపట్టాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో, ప్రతిపక్షం పార్లమెంటులో తన నిరసనలను కొనసాగిస్తోంది.

## దేశంలో 20శాతం రైలు డ్రైవర్ల కొరత

**తప్పుడు పద్ధతుల్లో పనిగంటల తారుమారు**



**న్యూఢిల్లీ:** రైల్వేశాఖలో 20 శాతం రైల్వే డ్రైవర్ల కొరత ఉండటంతో ఉన్న డ్రైవర్ల పనిగంటలమధ్య ఉన్న విరామ సమయం ఎంట్రీలను తప్పుడు పద్ధతుల్లో తారుమారుచేసి దోపిడీ చేస్తున్నారని లోకో పైలట్స్ యూనియన్ విమర్శించింది. ఒకసారి రైలును తీసుకుని డ్రైవర్ బయలుదేరిన తర్వాత తొమ్మిది గంటలకంటే ఎక్కువ సమయం పనిచేయమని అడిగేఅధికారం ఉండదని, కానీ విధుల్లోకి వెళ్ళే ముందు సంతకం పెట్టిన తర్వాత విధులు పూర్తిచేసి సంతకం పెట్టిన తర్వాత విరామం 11 గంటలకంటే ఎంత మాత్రం ఎక్కువగా ఉండకూడదని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పేర్కొంది. కానీ డ్రైవర్ల చేత చాలా ఎక్కువ గంటలు పనిచేయించుకుని ఆన్‌లైన్ క్రూ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (సిఎంఎస్) ద్వారా పనిగంటల సమయాలను తారుమారు చేస్తున్నారని, డ్రైవర్లు మాత్రం బండి ఎక్కిన తర్వాత 12 నుండి 16 గంటటవరకూ విరామం లేకుండా రైలును డ్రైవింగ్ చేస్తున్నారని వారి పనిగంటలను దోపిడీ చేస్తున్నారని యూనియన్ విమర్శించింది. దేశంలో ఉన్న అన్ని రైల్వే జోన్లలోనూ పరిస్థితులు ఇదేవిధంగా ఉన్నాయని విమర్శించింది. అన్ని రైల్వే జోన్లలోనూ 80 శాతం ట్రిప్పులను తొమ్మిది గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలని రైల్వే బోర్డు సేఫ్టీ విభాగం 2021లో జారీ చేసిందని పేర్కొంది. లోకో మోటివ్‌లను నడిపేందుకు భారీ ఎత్తున ముమ్మరంగా కొత్త డ్రైవర్ల నియామకాలకు తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా, లోకోమోటివ్ డ్రైవర్లకు యూరినల్స్ సహా అనేక సదుపాయాలు కల్పిస్తామని రైల్వే మంత్రిత్వశాఖ తొలుత స్పష్టం చేసిందని, ఇంతవరకూ ఎలాంటి సదుపాయాలు ఇవ్వకుండా సిబ్బంది కొరతతో రైల్వే పాలనాయంత్రాంగం నిబంధనలన్నింటినీ ఉల్లంఘిస్తోందని యూనియన్ విమర్శించింది. 900కు పైగా ఉన్న లోకోమోటివ్‌లలో యూరినల్ సదుపాయాలు ఇస్తామని పేర్కొందని, మరో 7000 లోకోమోటివ్‌లలో ఎయిర్ కండిషనర్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చిందిని, ప్రస్తుతం నడుస్తున్న 558 రన్నింగ్ రూములను ఆధునీకరిస్తామని వాగ్దానం చేసిందని యూనియన్ విమర్శించింది. "అనేక రైల్వే జోన్‌లలో, డివిజన్లలో అక్రమ పద్ధతులు అమలు చేస్తున్నారు. తూర్పు మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు మేం ఈ సమస్యలన్నీ తెలియజేశాం, ఆయనకు ఒక మెమొరాండం సమర్పించాం, అనేక సమస్యలపై ఫిర్యాదులు చేశాం, లోకో పైలట్ల పని నిర్వహణలో ఎదురవుతున్న దుస్థితిని వివరించాం, ఒకసారి ట్రిప్పు పూర్తయిన తర్వాత బ్రేక్‌కు సంబంధించి జరుగుతున్న మోసాలను వివరించాం, కానీ జరుగుతున్న అక్రమ పద్ధతుల గురించి మేం చేసిన ఆరోపణలకు తూర్పు మధ్య రైల్వే నుండి మాకు ఎలాంటి స్పందనా రాలేదు, కానీ విధులు పూర్తిచేసిన తర్వాత విధుల్లో ప్రవేశించేటప్పుడు తప్పుడు పద్ధతులలో విరామకాలాన్ని వక్రీకరించేవిధంగా ఆన్‌లైన్‌లో ఎలాంటి తారుమారు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇ సి ఆర్ ధన్‌బాద్ డివిజన్ నుండి ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొంది. బండి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తప్ప విరామ సమయంల్లో సంతకాలు తీసుకోకూడదని అందరికీ ఆదేశాలు జారీ అయ్యాయి, ఒకవేళ సిబ్బంది లాబీలోనే గనుక ఇలాంటి తప్పుడు పనులు జరిగితే తక్షణం వాటిని ఆపేయాలని, అలాంటి ఘటనలు కనిపిస్తే, చాలా కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన సర్క్యులర్ జారీ అయ్యిందని ఎఐఎల్ఆర్ఎస్ఎ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ రౌత్ చెప్పారు. 12 గంటలకంటే ఎక్కువ సమయం పనిచేసినప్పుడు కాంట్రాక్టు సిబ్బందికి 45 నిమిషాల నుండి రెండు గంటలపాటు నోటి మాట ద్వారా సీనియర్ అధికారుల నుండి విరామం ఇస్తున్నారని, కానీ నెలవారీ సిబ్బంది పనిగంటల చార్టులు సమర్పించినప్పుడు మాత్రం అదనంగా పనిచేసిన పని గంటల సమయాన్ని లెక్క కట్టకుండా భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని రౌత్ విమర్శించారు. ఈ విధమైన అక్రమ, ఎంతమాత్రం సురక్షితంకానీ డ్యూటీ బ్రేక్స్‌కు నోటిమాట ద్వారా ఇచ్చే అనుమతులను అమలు చేస్తున్నారని, సిఎంఎస్ డేటా ఎంట్రీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, నోటిమాట ద్వారా అనుమతులు ఇచ్చే అధికారులు మాత్రం ఆ సమయాన్ని కూడా ఆ చార్టుల్లో చేర్చమని వారికి చెబుతున్నారని రౌత్ విమర్శించారు. తప్పుడు సమయాలను నమోదు చేస్తున్నారని విమర్శించారు.

## ఖైదీ నెంబర్ 15528


**రేవణ్ణకు జైలులో నెంబర్ కేటాయింపు**

**బెంగళూరు :** అత్యాచారం కేసులో మాజీ ప్రధాని దేవగౌడ మనవడు, మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు శాశ్వత జైలు శిక్ష విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన్ అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అతడికి ఖైదీ నెంబర్ 15528 ను కేటాయించారు. అయితే అతడు శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు.రాత్రిబాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించారన్నారు. వైద్యుల పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు ధీనంగా ఉన్నడని.. అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరో వైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళ్తానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది.ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్నసెల్‌లోఉంచామన్నారు.అతడిని ఉంచి సెల్‌కు భద్రత కల్పించామని చెప్పారు. సాధారణ ఖైదీలకు వలే డ్రస్ కోడ్ ఆయనకు ఉందని తెలిపారు. ఆడ్రస్‌నుప్రజ్వల్‌కుఅందజేస్తామనిస్పష్టం చేశారు.2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలుకు కొద్ది రోజుల ముందు హాసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన కొన్ని అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




# సమాజానికి అద్దం... భవిష్యత్తుకు దీపం..

కొన్ని శతాబ్దాలు సాహిత్యం అంటే వర్ణనకు... వ్యక్తి పూజకు పరిమితైంది. క్రమంగా మార్పులు సంతరించుకుంటూ కొన్నాళ్లు భావ సాహిత్యం హోరులో కొట్టుకుపోయింది. ఆ తర్వాత ప్రగతిశీల సాహిత్యం.. విప్లవ సాహిత్యం... అభ్యుదయ సాహిత్యం వంటి ఎన్నో ప్రక్రియలు తెరపైకి వచ్చాయి. ఇప్పటికీ వస్తునే ఉన్నాయి. వీటిలో అత్యధిక శాతం సమకాలీన సమాజానికి అద్దం పట్టేవిగానే ఉన్నాయి. సమస్యలపై గళం విప్పడంతో తమ బాధ్యత తీరిపోయినట్టు రచయితలు ప్రవర్తించడం మొదలైంది. ఇది ఆహ్వానించతగిన పరిణామమే. కానీ, కేవలం సమస్యలను ఏకరువు పెట్టడం.. దోపిడీని ఖండించడమే సాహిత్య లక్షణం కాకూడదు. భవిష్యత్తుకు దారిచూపే కాంతిదీపమై వెలుగొందాలి. సమస్యను ప్రస్తావించినప్పుడు, పరిష్కారాన్ని చూపడంలోనే ఆ రచన పరిపూర్ణతను సంతరించుకుంటుంది. దోపిడీని ప్రశ్నించమేకాదు... ప్రతిఘటించే మార్గాలను సూచించడం.. మార్గదర్శకం చేయడం వల్లే సాహిత్య ప్రయోజనం చేకూరుతుంది. సమాజంలో సహజన్యాయానికి భంగం కలిగించే ప్రధాన బలగం దోపిడీ వ్యవస్థ అనేది బహిరంగ రహస్యం. ఈ దోపిడీ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థాయిల్లో అనేక రూపాల్లో కనిపిస్తుంది. దీనిని వ్యతిరేకించడానికి ఉద్యమాలు, ఉద్యోగాలు, చట్టాలు, మానవ హక్కుల కమిషన్లు పాటుపడుతున్నాయి. కానీ, మార్పు కోసం పోరాడే చైతన్యాన్ని ప్రజల్లో కలిగించే సాధనం సాహిత్యం మాత్రమే. ఈ నేపథ్యంలో దోపిడీ వ్యవస్థను ఖండించే సాహిత్యం ఎంత అవసరమో, అది సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. దోపిడీలేని భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో చెప్పే బాధ్యత కూడా సాహిత్యానికి ఉంటుంది. ఒక మనిషి మరో మనిషి... ఒక వర్గాన్ని మరో వర్గం శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా, మతపరంగా, జాతీయంగా కబళించే వ్యవస్థ నేడు వేళ్లూనుకున్నదనే నిజాన్ని మనం చూస్తునే ఉన్నాం. ఇది వ్యక్తిగత స్థాయి నుంచీ, అంతర్జాతీయ స్థాయిదాకా విస్తరిస్తున్నది. భూస్వామ్య దోపిడీ లేదా కార్మికుల శ్రమ దోపిడీ.... వర్గవాద దోపిడీ లేదా జాతి ఆధారిత దోపిడీ... వలసవాద దోపిడీ లేదా మతవాద దోపిడీ... విధానం ఏదైతేనేం? మనిషిని మనిషి పీక్కు తినడం. ఈ దోపిడీ వ్యవస్థను కూలదోయడానికి సాహిత్యాన్ని మించిన ఉత్తమ మారంగం, ముఖ్యమైన మార్గం, అద్భుతమైన ఆయుధం మరొకటి లేదు. సాహిత్యం అనేది ఒక కళాత్మక వ్యాఖ్యానమే కాదు. అది సమాజాన్ని అద్దంలా చూపించగల శక్తివంతమైన మార్గం. అంతటితో ఆగిపోకుండా.. భవిష్యత్ మార్గాన్ని చూపించే మార్గదర్శి. సాహిత్యం భావోద్వేగాలకు మాత్రమే కాదు, తాత్వికతకు, యథార్థానికి, ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి ఉపయోగపడాలి. 'సాహిత్యం సమాజాన్ని విముక్తి వైపు నడిపించగలదు' అంటాడు ప్రముఖ రచయిత ముని మోహన్ సేన్‌గుప్త. ఈ సిద్ధాంతం ప్రకారం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాహిత్యం ఒక జాగృతశక్తిగా పని చేస్తుంది. అగమ్యగోచరంగా మారిన బతుకులను మార్పు బాట పట్టిస్తుంది. బాసవన్న, అక్కమహాదేవి, రవిదాస్, కబీర్ లాంటి భక్తకవులు కులదోపిడీ వ్యతిరేకంగా గళం విప్పారు. వాళ్ళ రచనలు మతపరమైన భిన్నత్వాన్ని ప్రశ్నిస్తూ, సమానత్వం అనే భావనను బలంగా ప్రతిపాదించాయి. సమానత్వంతోనే నిజమైన బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని వారి రచనలు ఎలుగెత్తి చాటాయి. ఆంగ్ల సాహిత్యంలో, జార్జ్ ఆర్వెల్, ఫ్రాన్జ్ ఫానన్, ఎడ్వర్డ్ సైడ్ వంటి రచయితలు వలస పాలకుల దోపిడీ విధానాన్ని ప్రశ్నించారు. వలసవాదాన్ని ఎండగట్టారు. తెలుగు సాహిత్యం విషయానికి వస్తే, ఎంతో మంది రచయితలు సామాజిక సమస్యలను ప్రస్తావించారు. ప్రజలను ఆలోచింప చేశారు. కానీ, శ్రీశ్రీ వంటి అతికొద్ది మంది మాత్రమే కర్తవ్యబోధ చేశారు. దోపిడీని ఎదిరించి, ఏ మార్గంలో పయనించాలో సూచించారు. సాంకేతికత విప్లవాత్మక మార్పులను సంతరించుకుంటున్న నేటి కాలంలో సాహిత్యం కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. బ్లాగ్‌లు, డిజిటల్ కథలు, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలలో చైతన్యం కలిగిస్తోంది. యువ రచయితలు పేదలపై దోపిడీ, కార్మికుల సమస్యలు, మైనారిటీ హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనలను ఆధారంగా చేసుకొని రాస్తున్నారు. కానీ, కొద్ది మంది మాత్రమే ఈ సుడిగుండం నుంచి బయటపడే విధానాలపై తమ ఆలోచనలను వెల్లడిస్తున్నారు. సామాజిక దోపిడీని ఎండగట్టే రిపోర్టింగ్, జర్నలిజం కూడా ఒక రకంగా సాహిత్యమే. జర్నలిస్టులు కూడా ఈ భూమికలో భాగం. ప్రగతిశీల సాహిత్యం... రెవల్యూషనరీ రైటింగ్.. దళితవాద రచనలు.. ఆదివాసీ గిరిజన సాహిత్యం.. స్త్రీవాద సాహిత్యం.. ఇత్యాది విధానాలు ఎన్ని ఉన్నా... దోపిడీలేని వ్యవస్థను నిర్మించడమే వాటి అంతిమ లక్ష్యం. ఇందుకు సమర్థులు. వారే వాస్తవిక మార్గదర్శకులు. సాహిత్యం కేవలం అలంకారశాస్త్రానికి పరిమితమైన కళగా నిలిచిపోకూడదు. అది కాలాన్ని ప్రతిబింబించే అద్దంగా మాత్రమే కాక, కాలాన్ని మలచే హస్తంగానూ ఉండాలి. ఇది సత్యాన్ని, శాశ్వతతను, మార్పును సూచించే సాధనంకావాలి. శాశ్వతమేమీ లేని ఈ ప్రపంచంలో, మార్గం చూపగలిగే శక్తి కలిగిన రచనలు చరిత్రను మలుపుతిప్పుతాయి. ఒక రచయిత కేవలం ఊహలకు స్వేచ్ఛ ఇచ్చినంత మాత్రాన అతని రచన శాశ్వతతను పొందదు. సమాజం పట్ల, మానవుని బాధ్యత పట్ల, భవిష్య తరాలప పట్ల అతని బాధ్యత తీరిందని అనుకోకూడదు. రుగ్మతలపై స్పందించాలి. తప్పును గట్టిగా నిలదీయాలి. వాస్తవాలను ధైర్యంగా నిలబడి చెప్పగలగాలి. మార్పులను సూచించాలి. మార్గనిర్దేశనం చేయాలి. అందుకు భిన్నంగా, కేవలం గతాన్ని ఉల్లేఖించడమో, వర్తమానాన్ని వర్ణించడమో మాత్రమే చేస్తే, అది సాహిత్యం కాదు – అది చరిత్ర రచన. కానీ భవిష్యాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడిన రచనలే సాహిత్యంగా నిలుస్తాయి. ఇలాంటి రచయతలు




ప్రజలు దోపిడీని సహజంగా తీసుకోకుండా, ప్రశ్నించే స్థితిలోకి తీసుకురావడం, సమకాలీన చరిత్రకు అద్దం పట్టడం ఒక ఎత్తయితే, మరికొంత ముందుకు వెళ్ళి, దార్శనికతను ప్రదర్శించి, భవిష్యత్ నిర్మాణాన్ని కళ్ళ ముందు ఆవిష్కరించడం మరో ఎత్తు. సాహిత్యం అంటే కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదని, అది సమాజాన్ని ప్రతిబింబించాలని, విమర్శించాలని, అవసరమైతే దిశానిర్దేశం కూడా చేయాలని అనుకోవడంలో తప్పు లేదు. ఒక రచయిత కాలానుగుణంగా రచించినా, అతని కలం భవిష్యత్ పఠకులను ప్రభావితం చేసేలా ఉండాలి. గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని ఆవిష్కరించి, భవిష్యానికి మార్గం చూపే విధంగా సాహిత్యం ఉండాలి. అలా అయితేనే అది శాశ్వతంగా నిలిచే శక్తివంతమైన రచన అవుతుంది. ఈ సమయంలోనే అసలు రచన లేదా సాహిత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్న తలెత్తుతుంది. సాహిత్యం కేవలం భావోద్వేగాల ప్రవాహమా? సామాజిక పరిస్థితుల చిత్రణమా? వ్యక్తిగత అనుభవాల కూర్పా? ఈ ప్రశ్నలకు సమాధానం ఒక్కటే. ఇవన్నీ సాహిత్యంలో భాగాలే. సాహిత్యం సమాజానికి మార్గదర్శకత్వం అందించాల్సిన ఒక శక్తి కావాలన్నదే కీలకం. ఈనాటి యాంత్రిక, యాంత్రికతమయిన ప్రపంచంలో, అసమానతల వలయాల్లో, మానవతా విలువలకు ఎదురవుతున్న పరాభవాల్లో , మార్గం చూపించాల్సింది రాజకీయ నాయకులుకాదు.. మత గురువులు అంతకన్నా కాదు. కలం పట్టు గలవాళ్లే గతాన్ని, వర్తమానాన్నీ చర్చిస్తాడు. భవిష్యత్తును ఊహిస్తాడు. బాటలు నిర్మిస్తాడు. మిగతా భాషల్లో మాదిరిగానే తెలుగులోనూ రచయితలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ, సాహిత్యాన్ని చరిత్ర రూపంలో చూసే దృష్టి చాలా మందిలో కొరవడుతున్నది. సాహిత్యం సమాజపు ప్రతిబింబమే కాదు, దాని మలుపు కూడా అనే అభిప్రాయం చాలా తక్కువ మందిలో కనిపిస్తున్నది. సాహిత్యం సమాజానికి అద్దం అన్న మాట చాలామందికి తెలుసు. కానీ అది సమాజానికి మార్గనిర్దేశక శక్తి కూడా కావాలన్న నిజాన్ని చాలా మంది అర్థం చేసుకోవడం లేదు. సమాజంలో మార్పు రావాలంటే, ముందుగా ఆ మార్పు రచనల్లో ఉండాలి. రచయితలో ఆ తపన ఉండాలి. ప్రతి రచనా జమానవ జీవితానికి సంకేత కావాలి. మార్పు కోసం, కొత్త దిశ కోసం, ఉన్నత లక్ష్యాల కోసం, మరొక మెట్టు పైకి తీసుకెళ్లే చోదక శక్తి కావాలి. సాహిత్యం ప్రాంతీయ పరిమితులను దాటినప్పుడే, విశ్వ మానవతకు తోడ్పడే సాధనమవుతుంది. భారతీయ సాహిత్యంలో మాత్రమే కాదు, పాశ్చాత్య సాహిత్యంలో కూడా కొన్ని రచనలు తమ యుగానికి ముందుగానే భవిష్యాన్ని ఊహించాయి. మానవత్వానికి మార్గాలు చూపించాయి. కొన్ని రచనలు చీకటి భవిష్యాన్ని హెచ్చరికగా ఉంటే, మరికొన్ని ఆశాజనక మార్గాలను ప్రతిపాదించాయి. అన్ని విధాలుగానూ దోపిడీ కొనసాగుతున్న ప్రస్తుత కాలంలో, అలాంటి రచనల శ్రేణి పెరగాలి. ఇక్కడ జార్జి ఒర్వెల్ '1984' నవలను ప్రస్తావించుకోవచ్చు. అందులో కేవలం రాజకీయ వ్యంగ్యంతోనే సరిపుచ్చలేదు. ప్రజలపై అధికారుల నియంత్రణ ఎలా పనిచేస్తుందో వివరించాడు. అధికారం, నియంత్రణ, ప్రజాస్వామ్య హక్కుల మధ్య ఉన్న సున్నిత సంబంధాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్‌ను మార్చుకోవడానికి అనుసరించాల్సిన విధానాలను సూచించాడు. భవిష్య సమాజాన్ని అతను ఎంత చక్కగా పరిశీలించి, దానిని చెరగని రచనగా మలిచారో చూస్తే, భవిష్యనిర్దేశక సాహిత్యం ఎలా ఉండాలో అర్థమవుతుంది. ఆల్డర్ హక్స్‌లే వంటి రచయితలు సాంకేతిక ఆధిపత్యం, జనాభా నియంత్రణ, వైద్య శక్తుల దుర్వినియోగం వంటి అంశాలను భవిష్యపు ప్రమాదంగా చూపించారు. చినూవా అచెబె పాశ్చాత్య వలసవాదంపై తీవ్ర విమర్శలు చేస్తూనే, ఆఫ్రికన్ సంస్కృతిని ఆదరించే మార్గాన్ని చూపించాడు. అక్యూటెర్ డ్యామ్ నూతన వ్యవస్థలపై తీవ్ర విమర్శలతో రచన చేస్తూ భవిష్య భవితవ్యంపై హెచ్చరికలు చేశాడు. ఇలాంటి రచనలు చదువుతుంటే, సాహిత్యం అనేది, సామాజిక శక్తుల మధ్య సంభాషణను కల్పించాలని, ఊహా ప్రపంచాల ద్వారా నిజ జీవితాన్ని పరిశీలించే శక్తిని పెంచాలని అర్థమవుతుంది. అదే సమయంలో వాస్తవాల ఆధారంగా భవిష్య మార్గాన్ని సూచించాలని, ప్రతి పాఠకుడిలో ఆలోచనను పెంచాలని ఈ రచనలు సూచించడాన్ని గమనించవచ్చు. పాశ్చాత్య సాహిత్యంలో యూటోపియా (ఆకాంక్షిత భవిష్య ప్రపంచం), డిస్టోపియా (వికృత భవిష్య యథార్థం), మానవతా తత్వాలు వంటి అంశాలన్నీ కలసి, సాహిత్య ధర్మాన్ని నిర్వచిస్తున్నాయి. భవిష్యత్ మార్గాన్ని చూపుతున్నాయి. ఈ కోవకు చెందిన కొంత మంది యువ రచయితలు సమాజాన్ని సూటిగా తాకే రచనల ద్వారా పాఠకుల ఆలోచనా పటాన్ని విస్తరించించడం ఆహ్వానించదగిన పరిణామం. ఆధిపత్య వ్యతిరేకత, మానవ హక్కుల పట్ల చైతన్యం, మహిళలు, దళితులు, ఆదివాసీల స్వరాలకు ప్రాతినిధ్యం, అభివృద్ధి పేరుతో జరిగే విధ్వంసంపై విమర్శ, వ్యక్తిగత అంతర్భావాల స్వేచ్ఛా ప్రకటనల ఆవశ్యకతలను ప్రస్తావిస్తూ, ప్రతిఘటన స్ఫూర్తిని నింపుతూ, భవిష్యత్తుకు మార్గనిర్దేశనం చేస్తూ రచనలు చేయడం ఓ అపూర్వ దృశ్యం. ఇలాంటి రచనలే నేటి అవసరం. ఈనాటి ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత, ఆధునికత, గ్లోబలైజేషన్ ప్రభావం ఏటా పెరుగుతోంది. ఈ వాతావరణంలో సాహిత్యం తన మార్గనిర్దేశక ధర్మాన్ని కొనసాగించగలదా అనే సందేహం జనించటం సహజం. కానీ, ఈ మార్పులను ఎలా అర్థం చేసుకోవాలి? వాటిలోని మానవీయతను ఎలా కాపాడాలి? అనే ప్రశ్నలు వేసుకున్న తర్వాతే, రచనలు చేస్తే, సమాధానం దానంతట అదే లభిస్తుంది. నిజానికి ఈనాటి యువత అనేక సవాళ్ల మధ్య జీవిస్తోంది. ఉద్యోగం, మానసిక ఒత్తిడి, అనిశ్చిత భవిష్యత్తు, సోషల్ మీడియా ప్రభావం, ఒంటరితనపు బాధ వంటి ఎన్నో సమస్యలు చుట్టుముట్టి వేధిస్తున్నాయి. ఇలాంటి సమయంలోనే, యువతకు దిక్సూచిగా మారే రచనలు అవసరం. పాఠకుడిని ధైర్యపరిచే రచనలే అవసరం. భవిష్యాన్ని అన్వేషించేలా చేసే రచనలు అవసరం. ప్రశ్నించడం నేర్పించే కథలు, శూన్యంలోకి లాగకుండా భావనల నెత్తుటిని కొద్దిగా ఆపగలిగే రచనలే నేటి అవసరం. 'ఒక మంచి రచన కేవలం ప్రశ్నలు సంధించి, సమాధానాలు ఇవ్వడంతో ఆగిపోదు. సమాధానాలను ఆధారంగా చేసుకొని, మంచి భవిష్యత్తును అందిపుచ్చుకునేలా పాఠకుడిని ప్రేరేపిస్తుంది' అంటాడు ప్రముఖ రచయిత హనిఫ్ ఖురేషీ. ఈ మాటల అక్షర సత్యాలు. ఈ లక్షణాలు ఉన్న సాహిత్యం విస్తారంగా రావాలని కోరుకుందాం. వస్తుందని ఆశిద్దాం.

— సత్యశ్రీ

## తొలి నవల ఏది?

ప్రపంచపు తొలి నవల ఏది? ఈ ప్రశ్న చిన్నదే గానీ, సమాధానం చెప్పడానికి విస్తారమైన అన్వేషణ అవసరం. ఎంతో మంది సాహితీ చరిత్రకారులు అనేకానేక అంశాలను పరిశీలించి, సమీక్షించి, మథించి, చివరికి జపాన్ రచయిత్రి మురసాకీ శికిబు రచన 'గెంజీ కథ' (ది ఆఫ్ గెంజి)ను తొలి నవలగా ప్రకటించారు. ఇప్పటికీ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. హీయాన్ కాలంనాటి ఈ రచనలో హికారు జెంజీ అనే రాజకుమారుని జీవితం, ప్రేమలు, రాజకీయాలు, సమాజాన్ని ఆధారంగా చేసుకుని కథ ముందుకు వెళుతుంది. షికిబు రచనలు, ముఖ్యంగా ఆమె 'ది ది ఆఫ్ గెంజీ', ప్రపంచ సాహిత్యంపై విప్లవాత్మక ప్రభావాన్ని చూపాయి. ఈ నవలను ప్రపంచంలోనే మొట్టమొదటి మానసిక నవలగా కూడా పరిగణిస్తారు, ఇది సాహిత్యంలో కథన నిర్మాణం, పాత్రల మానసిక లోతు, సాంస్కృతిక వివరాల సమగ్రతను పరిచయం చేసింది. షికిబు రచనల ద్వారా జపనీస్ సాహిత్యం ప్రపంచ సాహిత్య వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందింది, అలాగే మహిళా రచయిత్రుల పాత్రకు ప్రాధాన్యం ఏర్పడింది. 'ది ది ఆఫ్ గెంజీ' లోని భావోద్వేగాలు, సామాజిక, రాజకీయ నేపథ్యాలు ఇతర భాషల సాహిత్య రచనలపై కూడా ప్రభావం చూపాయి. సాహిత్య అనువాదాలు ద్వారా ఈ ప్రభావం మరింత విస్తరించింది. ఆమె రచనలో బౌద్ధ ధర్మ భావాలు, మానవ సంబంధాల లోతైన విశ్లేషణలు ప్రపంచ సాహిత్యంలో సృజనాత్మకతకు కొత్త దారులు చూపించాయి. షికిబు సాహిత్య శైలీ, పాత్రల మానసిక విశ్లేషణలు పాశ్చాత్య సాహిత్యంలో కూడా ఆదర్శంగా నిలిచాయి, తద్వారా నవల రూపంలో కొత్త ప్రమాణాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా, మురాసాకి షికిబు రచనలు ప్రపంచ సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచాయి, నవలల రూపకల్పన, పాత్రల అభివృద్ధి, సాంస్కృతిక ప్రతిబింబాల పరంగా సుదీర్ఘ ప్రభావం చూపాయి. సంప్రదాయ జపనీస్




భాషలో ఉన్న ఈ రచనా కాలాన్ని క్రీస్తుశకం 1020 ప్రాంతం నాటిదని చెప్తారు. సరైన సంవత్సరంపై ఇంకా స్పష్టత లేదు.


## 'ఉలిపికట్టె' కథాకమామీషు

'ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపికట్టెది మరోదారి' అనే తెలుగు సామెత అందరికీ తెలిసే ఉంటుంది. ఈ మాటకు ఉలిపికట్టె, ఉలిపిగొట్టు, ఉలిపిరిగొట్టు అనే రూపాంతరాలున్నాయి. ఈ పదం 'చివరి కట్టె', 'మొండికట్టె', 'కష్టాలన్నీ ఈ కట్టెతోగాని పోవు' వంటి పద ప్రయోగాల్లోని 'కర్ర' అనే పదానికి, ఇందాకటి సామెతలో 'కట్టె' అనే పదానికి సారూప్యం ఎంతమాత్రం లేదు. మానవ శరీరాన్ని 'కర్ర' లేదా 'కట్టె'తో పోల్చడం ఆనవాయితీ. అందుకే, ఆ పదబంధాల్లో వినిపించే కట్టె అనే పదాన్ని శరీరంగా భావించాల్సి ఉంటుంది. ఇక ఉలిపి కట్టె విఃయానికి వస్తే, 'ఉలిపి' అనే పదాన్ని నామవాచకంలో వాడినప్పుడు పొగరుబోతు, దుర్మార్గుడు, పెడమనిషి, కోపదారి వంటి అర్థాలు ఉన్నాయి. అయితే, ఉలిపి అనే చెట్టు కూడా ఉంది. దాని కట్టె ముక్కలను బాణాసంచా తయారీలో ఉపయోగిస్తారు. ఈ కర్ర కాలేటప్పుడు చిటపటలాడుతుంది. ఈ కట్టెముక్కలాగానే మటమటలాడే వ్యక్తిని ఉలిపి (కట్టె/గొట్టు) అని వ్యవహరిస్తారు. దీని రూపాంతరమైన 'ఉలిపిరి'ని చాలా నిఘంటువులు చేర్చలేదు. కానీ 'ఉలిపిరి కాగితం' (ట్రేసింగ్ పేపర్) వంటి సమాసాల్లో తేలికైన, పల్చని, తిన్నగా చినగని మొదలైన అర్థాల్లో వాడుకలో ఉంది. ఎర్రడాలున్న తెల్లమచ్చలనూ,తెలుపుమీద మసరగా ఉండే మచ్చలున్న మబ్బురంగునూ ఉలిపిరి అంటారు. జిల, మంట, చికాకు, బాధ పుట్టించే రోగాన్ని ఉలిపితెగులు అంటారు.

## చదవాల్సిన పుస్తకం


### ఓ పుస్తకం... రాజకీయ దుమారం!

ఒక పుస్తకం సమకాలీన రాజకీయాలపై ఎంతటి ప్రభావం చూపిస్తుందనడానికి 'ది టిరనీ ఆఫ్ మైనారిటీ: వై అమెరికన్ డెమోక్రసీ రీచ్డ్ ది బ్రేకింగ్ పాయింట్' గొప్ప ఉదాహరణ. 2023 జులై 7న తొలిసారి మార్కెట్‌లోకి విడుదలైన ఈ పుస్తకం అమెరికా రాజకీయాలను కుదిపేసింది. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన స్టీవెన్ లెవిట్స్కీ, డేనియల్ జిబ్లాట్ సంయుక్తంగా రచించిన ఈ పుస్తకంలో, మైనారిటీగా ఉన్న ఒక వర్గం, మెజారిటీ వర్గంపై ఏ విధంగా పె త్తనం చెలాయిస్తున్నదో అద్భుతంగా వివరించారు. సాధారణంగా మైనారిటీలపై మెజారిటీ వర్గాలు జులుం ప్రదర్శిస్తాయి. కానీ, అమెరికా, భారత్ వంటి కొన్ని దేశాల్లో మెజారిటీ వర్గాలను సైతం కొన్ని మైనారిటీ వర్గాలు శాసిస్తా యి. నిలువరిస్తాయి. వారి హక్కులను హరిస్తాయి. ఇలాంటి అంశాలనే ప్రధానంగా పేర్కొంటూ, అమెరికా రాజకీయాల్లోని పరిస్థితిని 'ది టిరనీ ఆఫ్ మైనారిటీ' పుస్తకం విశ్లేషిసస్తుంది. అక్కడ మైనారిటీ సమూహం అసమాన అధికారాన్ని, ప్రభావాన్ని కలిగి ఉండడాన్ని ప్రశ్నిస్తుంది. ఈ పుస్తకంలో పేర్కొన్న విషయాల ప్రకారం, మెజారిటీ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా,ఈ మైనారిటీ వర్గం ఏకపక్ష నిర్ణయాలతో అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకుంటుంది. ఈ ఆధిపత్యం వివిధ మార్గాల్లో వ్యక్తమవుతుంది, ఉదాహరణకు మెజారిటీకి అనుకూలంగా ఉన్న చట్టాన్ని అడ్డుకోవడం లేదా





కోర్టులు లేదా మీడియా వంటి కీలక సంస్థలను నియంత్రించడం వంటి చర్యలకు ఈ ఆధిపత్య మైనారిటీ వర్గం పాల్పడుతుంది. అమెరికన్ రాజకీయ వ్యవస్థ, రాజ్యాం గం, చారిత్రక సందర్భం వంటి అనేకానేక సున్నిత అంశాలు ఈ మైనారిటీ దౌర్జన్యకాండలో మిళితమై ఉంటాయి. అణచివేతను, లైంగిక దౌర్జన్యాన్ని ని రోధించడానికి ఉద్దేశించిన వ్యవస్థలపై మైనారిటీ వర్గాలు పట్టుబిగించడంతో, మెజారిటీ వర్గాలు నష్టపోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలు మంటకలుస్తున్నాయి. అమెరికాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పతనం అంచుకు చేరిందేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తుంది. మెజారిటీ వర్గాలో ఉన్న అనైక్యతను, ఆర్థిక దుర్బలత్వాన్ని కొన్ని మైనారిటీ వర్గాలు ఏ విధంగా తమకు అనుకూలంగా మార్చుకొని, చివరికి అధికారాన్ని చేపట్టి, పెత్తనం చెలాయిస్తున్నారో ఈ పుస్త కం వివరిస్తుంది. మన దేశంలో మెజారిటీగా ఉన్న బిసిలకు రాజ్యాధికారం ద క్కకుండా, అత్యంత మైనారిటీగా ఉన్న కొన్ని కులాలు ఏ విధంగా పెత్తనం చెలాయిస్తుందో ప్రత్యక్షంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ పుస్తకం విలువ స్పష్టమవుతుంది.

## సంక్లిష్టమైన భాష..



ఆంగ్ల సాహిత్యంలో అత్యంత క్లిష్టమైన భాషా శైలితో కూడిన రచనగా విలియం ఫాక్‌నర్ రచించిన 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరి' (The Sound and the Fury) నవలను ప్రముఖంగా పేర్కోవాలి. ఈ నవల భాష, శైలి, కథన విధానం చాలా సంక్లిష్టంగా ఉంటాయని విమర్శకులు పేర్కొంటున్నారు. తెలుగు లేదా భారతీయ సాహిత్యంలో, ప్రాచీన సంస్కృత నాటకాలు, ఉదాహరణకు భవభూతి రచించిన 'మాలతీ మాధవం' కూడా క్లిష్టమైన భాషా శైలికి ఉదాహరణగా చెప్పవచ్చు, ఎందుకంటే వీటిలో ఉపయోగించిన పదాలు, భావాలు, శైలీ చాలా అధునిక పాఠకులకు క్లిష్టంగా ఉంటాయి. 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరి' విషయానికి వస్తే, ఇది 1929లో ప్రచురితమైంది. ఇది అమెరికన్ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన నవలల్లో ఒకటి. ఈ నవల కథ మిసిసిప్పిలోని జెఫర్సన్ అనే ఊరిలో నివసించే, ఒకప్పుడు గొప్పగా ఉన్న కానీ, ఇప్పుడు పతనమవుతున్న కాంప్సన్ కుటుంబం చుట్టూ తిరుగుతుంది. ఈ నవల మొత్తం నాలుగు భాగాలుగా ఉంటుంది. మొదటి మూడు భాగాలు ముగ్గురు సోదరులు (బెంజీ, క్వింటిన్, జేసన్) దృష్టికోణంలో కథ నడుస్తుంది. నాలుగో భాగం కుటుంబ సేవకురాలు డిల్సీ దృష్టికోణంలో కొనసాగుతుంది. రచనలో భాషా శైలి, కాలక్రమం చాలా సంక్లిష్టంగా, అసంపూర్ణంగా ఉంటుంది. ముఖ్యంగా బెంజీ భాగం పూర్తిగా స్ట్రీమ్ఆఫ్‌కాన్షియస్‌నెస్ (స్వచ్ఛంద ఆలోచనల ప్రవాహం) శైలిలో ఉంటుంది, కాల పరిమితి లేకుండా జ్ఞాపకాల మధ్య తిరుగుతుంది. ప్రధాన పాత్రల్లో, బెంజీ (మానసికంగా వికలాంగుడు), క్వింటిన్ (హార్వర్డ్ విద్యార్థి, కుటుంబ గౌరవంపై మక్కువ), జేసన్ (క్రూరమైన వ్యక్తి. స్వార్థపరుడు), క్యాడీ (కుటుంబాన్ని ప్రభావితం చేసిన సోదరి), డిల్సీ (పరిచారిక). నవలలో కుటుంబ పతనం, కాలం, జ్ఞాపకాలు, నైతిక విలువల పతనం వంటి ప్రధాన థీమ్స్ ఉన్నాయి. శైలి, కథన విధానం, కాలక్రమం కారణంగా ఈ నవల చదవడం చాలా కష్టం. కాగా, ఈ నవలలో ఉపయోగించిన స్ట్రీమ్ఆఫ్‌కాన్షియస్‌నెస్, కాలక్రమం లోని అసంపూర్ణత, విభిన్న దృష్టికోణాలు వంటి ప్రయోగాత్మక శైలులు, కథను చెప్పే పద్ధతులపై కొత్త దృష్టిని అందిస్తాయి. పాత్రల లోతు, భావోద్వేగాల విశ్లేషణ: పాత్రల అంతర్గత సంఘర్షణలు, వారి భావోద్వేగాల ప్రతిబింబం చదువరుని లోతైన మానవీయ విశ్లేషణ వైపు నడిపిస్తాయి. భిన్నమైన కథన విధానాలు, భాషా ప్రయోగాలు, కాల పరిమితి లేని కథనం వంటి అంశాలు, మీరు సాహిత్యాన్ని ఎలా చదవాలి, ఎలా రాయాలి అనే దృష్టిలో కొత్త కోణాన్ని పరిచయం చేస్తాయి. సామాజిక, మానవ సంబంధాలపై కొత్త ఆలోచన ఏర్పడుతుంది. కుటుంబ పతనం, వ్యక్తిగత విఫలతలు, సమాజంలో మార్పులు వంటి అంశాలపై లోతైన ఆలోచన కలుగుతుంది. ఈ విధంగా, క్లిష్టమైన శైలిలో రాసిన రచనలను చదవడం వల్ల పాఠకుల సాహిత్య అభిరుచిలో, విశ్లేషణా సామర్థ్యంలో, ఆలోచనా విధానంలో కొత్త మార్పులు వస్తాయి.




ఈ వారం కవితలు

## అధర్మ స్థలం

అక్కడ ఎవరున్నారని వెళ్తున్నారు
ఆ చోటులో ఏముందని అడుగుతున్నారు
చుట్టూ కళేబరాల నడుమ
ప్రార్థనా మందిరంలో
నిత్య జన సందోహం!
భక్తి పారవశ్యంలో
చుట్టూ చూసే ఆరా తీసే
తీరికా లేదు సమయమూ లేదు !
శ్మశానమా?! కాదు

అత్యాచారాల్లో ఆరితేరిన
మానవుల అలికిడి గాంచలేని
యువతీ యువకులు
అర్థాంతరంగా చంపబడుతున్నారు
దేహాలు పూడ్చబడ్డాయి ఎక్కడబడితే
అక్కడ రక్షక భటనిలయాల్లో
ఫిర్యాదులకు సైతం
నోచుకోబడని దేహాలవి
బంధుమిత్రులను
నయానా భయానా
ఆ చోటునుండి వెళ్ళగొట్టిన
పెత్తందారీ వ్యవస్థ !
కులమూ లేదు మతమూ లేదు
అంతా పురుషాధిక్య పైత్యంలో
స్థలంలో స్థానభ్రంశం క్షణాల్లో
ఒకటో రోజో రెండో రోజో

గుట్టుచప్పుడు కాకుండా
బొందో దహనమో యథేచ్ఛగా!
వెనుక ఎన్ని హస్తాలుంటేనో
ఇన్ని ఘోరాలు!
ప్రాయశ్చిత్తం ముసుగులో
ఒక విజిల్ బ్లోయర్ వచ్చాడు
అయినా సంఘాన్ని విజిల్ వేసి
లేపే వాడెవ్వడు?
అంతా గాఢ నిద్ర నటన!
నటులున్న సంఘంలో
నాటుకున్న మౌఢ్యాన్ని
తుడిచేసేదెవ్వడు?!
భక్తి నాటకంలో
ఎన్ని అకృత్యాలు జరిగాయో
వెలుగులోకి వచ్చేనా?!
తగ్గని జనాల పోటు
పొట్లు పట్టని జనాలు
సిగ్గు! సిగ్గు!!

– గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## 'నడుమంటిన పొట్టకెన్ని తిప్పలో'



ఆకలితో నడుముకు అంటుకున్న
కడుపు కేకలేస్తూ
సత్తు బొచ్చట్టుక్కుని
వణికే కాళ్ళతో దేవురిస్తూ

తిరుగున్న వీథుల్లో
ఆ దైన్యపుబాలలపై
నిర్దాక్షిణ్యంగా బుల్లెట్ల వర్షం
బీట్రూట్ కూరలా
రక్తపుముద్దలు పేరుకుంటున్న చోట

ఆవురుమంటూ పొడుస్తున్న
రాబందుల రెక్కల సవ్వడి
ఎవరిని కదిలించదా
సభ్య ప్రపంచపు పిడికిళ్ళు
బిగిసేదెపుడు

గాజా ఇలా గాజిబొమ్మలా
ఛిద్రమవ్వాల్సిందేనా

అగ్రరాజ్యపుటుగ్రచేష్టకు
శవాలదిబ్బవుతున్నా
చూస్తూనే వుందామా?
కడుపుకింతన్నం తింటున్నాంకదా!

మన తిండిని త్యాగం చేసి
ఆకలిమంటలనార్పలేమా?
ఆలోచించండి బుద్ధిజీవులారా!
ఎవరో ఒకరు అడుగేస్తే
వందడుగులనుసరిస్తాయేమో!
మానవత్వమనేది నిజమే ఐతే.

కపిల రాంకుమార్
9849535033

## ఎందుకో?

పగలు పిలుస్తుంది
తిమిరంతో సమరంచెయ్యమని
అందాలు ఆహ్వానిస్తున్నాయి
వికారాలను విదిలించుకోమని
పూలు ప్రాధేయపడుతున్నాయి
తుంచకుండా పరిరక్షించమని
ఊహలు ఊరుతున్నాయి
మనసును శుద్ధిచెయ్యమని
మెదడు బ్రతిమిలాడుతోంది
అజ్ఞానాంధకారాన్ని పారద్రోలమని
పలుకులు తేనెనుచిమ్ముతున్నాయి
నిస్సారాన్ని నిరోధించమని
ప్రకృతి అర్థిస్తుంది
విచ్ఛిత్తికి పాలుపడవద్దని
నీలిమబ్బు చినుకులుచల్లుతుంది
క్షామకరువులను కట్టడిచెయ్యాలని

– రాజేంద్రప్రసాద్

## మ్యాన్‌హోల్‌లో డ్రమ్ము, బండరాళ్లు



ప్రజాపక్షం/గండిపేట : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల బాలాజీ నగర్ కాలనీలలో సిల్ట్ తీస్తుండగా అక్కడ మ్యాన్ హోల్ లో ఒక పెద్ద డ్రమ్ము రెండు బండరాళ్లు కనిపించాయి. ఆదివారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలతో వర్షాకాలం మున్సిపాలిటీ లో ముంపు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ లో ఉన్న సిల్ట్ తొలగించే కార్యక్రమాన్ని మంచిర్యాల బాలాజీ నగర్ కాలనీ మ్యాన్ హోల్స్‌లో ఒక్క పెద్ద డ్రమ్ము రెండు పెద్ద బండ్రాలు కనిపించడంతో వెంటనే అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది వాటిని జెసిబి సహాయంతో ఎంతో కష్టపడి తొలగించారు. దీంతో బాలాజీ నగర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైన మ్యాన్ హోల్స్ తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేవాలయ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీలో పోచమ్మ ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధికి తన సహకారం ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల హయత్ నగర్ మండల రెవిన్యూ అధికారులు పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయంపై కప్పు ఉన్న రేకులను తొలగించడంతో తిరిగి యధావిధంగా ఏర్పాటుకు సహకారం చేయాలని కార్పొరేటర్ కాలనీ వాసులు కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ గుడి పునరుద్ధరణకు తన కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు పి. కృష్ణ, సౌభాగ్య నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు నందకిషోర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలి

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. ఆదివారం హైదరాబాద్ లోని హఫీజ్‌పేటలో రైట్‌కేర్ క్లినిక్ బహుల ప్రత్యేకతల వైద్యకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్యోగాభివృద్ధికి రైట్‌కేర్ క్లినిక్ లాంటి ఆరోగ్యకేంద్రాల అవసరం ఉన్నదన్నారు. అమెరికాలో ఉన్నా, ఇక్కడి ప్రజల ఆరోగ్యంకోసం మనోహర్ క్లినిక్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ క్లినిక్‌లో పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఫిజియోథెరపీ సేవలు లభిస్తాయని వైద్యులు తెలిపారు. రైట్‌కేర్ క్లినిక్ సేవల కోసం 91 4035789789ను సంప్రదించాలని సూచించారు. కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ ఆరోగ్య పరీక్షలను స్వయంగా పరిశీలించి, క్లినిక్ యాజమాన్యాన్ని, డాక్టర్‌లను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్, సంకీర్త్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమంపై నేతల నిర్లక్ష్యం

పటేల్ యూత్ ఫోర్స్ వ్యవస్థాపకులు కొత్త లక్ష్మణ్ పటేల్




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : కులాలను రాజకీయ నేతలు ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్పా వారి సంక్షేమానికి కృషిచేయటం లేదని పటేల్ యూత్ ఫోర్స్ వ్యవస్థాపకులు కొత్త లక్ష్మణ్ పటేల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరుకాపు పటేల్ యూత్ ఫోర్స్ కన్వీనర్ల సమావేశం, ఐటి, నాన్ ఐటీ ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ మున్నూరుకాపు యువతను స్థానిక ఎన్నికల్లో ప్రోత్సహిస్తామన్నారు. త్వరలోనే కరీంనగర్ వేదికగా మున్నూరుకాపు యువతకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వంతో కొట్లాడైనా మున్నూరుకాపు బాలబాలికల హాస్టల్, పటేల్ గెజిట్‌ను సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జెఎన్ వెంకట్ మాట్లాడుతూ మున్నూరుకాపు యూత్ ఫోర్స్ ఉద్యోగ, ఉపాధి, రాజకీయరంగంలో ముందుండాలని సూచించారు. అనంతరం మున్నూరుకాపు యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన మ్యాట్రిమోని వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం హైదరాబాద్, మేడ్చల్ , జగిత్యాల జిల్లా ల అధ్యక్షులు పగడాల అరుణ్‌కుమార్, వెంకట్ దాదె, వంగాల రమేశ్ పటేల్, యూత్ ఫోర్స్ కన్వీనర్లు అఖిల్ పటేల్, సాయిచరణ్ పటేల్, ప్రణవ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి బాధితురాలు విజయ విజ్ఞప్తి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : దొంగ పత్రాలను, అక్రమంగా వారసత్వాన్ని సృష్టించి 400 ఏండ్ల శివాలయం భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పి.రజిని అలియాస్ విజయ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తారామతిపేట గ్రామంలో సర్వే నం.103–245లో 200 ఎకరాల భూములు తమ తల్లి కోరకొప్పుల భూలక్ష్మి, తమ పూర్వీకులకు చెందినవని తెలిపారు. ఇందులో 100 ఎకరాలు శివాలయానికి గిఫ్ట్ ఇచ్చారని వివరించారు. ఈ భూమిని తప్పుడు ప్రొటెక్ట్ టెనెన్సీ పత్రాలతో కల్పిత కథనాలతో స్థానిక తారామతిపేట నివాసి మూల చంద్రయ్య కుమారులు, వారి అనుచరులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. మూల కృష్ణ, మూల శంకరయ్య పేర్ల మీద పిటిషనర్లుగా హైకోర్టులో జులై 14న 2017న కేసు వేశారని తెలిపారు. అయితే, వీరిలో ఇద్దరు 2016లో, మరొకరు 2013లో చనిపోయారని తెలిపారు. వీరే ఆ భూమికి నిజమైన వారసులని పత్రాలను మార్చి శివాలయం భూమిని కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ భూములకు సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ తమ దగ్గర ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది సురేశ్ బాబు కొల్లపురెడ్డి, శివసేన పార్టీ ప్రధానకార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల కోసం టిజిసిఎస్‌బి గాలింపు

హైదరాబాద్: నేరగాళ్ల ఆటలు కట్టించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా విస్తృత గాలింపు చేపట్టి.. ఇప్పటి వరకు 27 మంది మహిళలు సహా 228 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. నిందితుల కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, యుపి, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నిందితులపై తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 1,313 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వారంతా ఈ ఏడాది దేశ వ్యాప్తంగా రూ.92 కోట్లు కాజేసినట్లు వెల్లడించారు.

# పాతబస్తీలో వేగంగా మెట్రో రైల్ పనులు

### ప్రభావిత ఆస్తుల సంఖ్య తగ్గించిన అధికారులు – రోజువారీ పనులు స్వయంగా సమీక్షిస్తున్న ఎండి ఎన్‌విఎస్ రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : పాతబస్తీలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్) నుంచి చంద్రాయణ గుట్ట వరకు నిర్మిస్తున్న మెట్రో రైలు మార్గం పనులు వేగవంతమయ్యాయి. మొత్తం 7.5 కిలోమీటర్ల ఈ కారిడార్‌లో, రోడ్డు విస్తరణ పనుల వల్ల ప్రభావితమయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేందుకు మెట్రో అధికారులు ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ఉపయోగించారు. ఈ విషయాన్ని హెచ్‌ఎంఎల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు.

**ప్రభావిత ఆస్తుల కుదింపు, పరిహారం చెల్లింపు...**
మెట్రో అధికారులు మొదట 1,100 ఆస్తులు ఈ మార్గంలో ప్రభావితమవుతాయని అంచనా వేశారు. కానీ కొత్తగా రూపొందించిన అలైన్‌మెంట్‌తో ఈ సంఖ్యను 900కి తగ్గించారు. ఇప్పటివరకు 412 ఆస్తులకు అవార్డులు జారీ చేసి, 380 ఆస్తుల కూల్చివేతలు పూర్తి చేశారు. ఈ ఆస్తుల కోసం రూ. 360 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్టు ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఈ పనుల్లో పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, ఇరుకుగా ఉన్న ఇళ్లు, విద్యుత్ లైన్లు వంటి వాటిని జాగ్రత్తగా తొలగిస్తూ పనులు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండటానికి, అర్ధరాత్రి వేళల్లో పనులు చేపడుతున్నట్టు చెప్పారు.

**పిల్లర్ల మార్కింగ్ పనులు ప్రారంభం...**మెట్రో నిర్మాణ పనులను ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా పిల్లర్ల స్థానాలను గుర్తించి మార్కింగ్ చేసే పని మొదలైందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. పిల్లర్ల మధ్య దూరం 25 మీటర్లు (సుమారు 82 అడుగులు) ఉంటుందన్నారు. భూసార్థ్య పరీక్షల కోసం ఒక ఏజెన్సీని కూడా నియమించామన్నారు. డిజిపిఎస్ (డిజిపిఎస్) సర్వే ద్వారా చారిత్రక, సున్నితమైన కట్టడాలకు నష్టం కలగకుండా పిల్లర్లు, స్టేషన్ల స్థానాలను నిర్ణయిస్తున్నట్టు ఆయన చెప్పారు.

**భూగర్భ యుటిలిటీల తరలింపు...**మెట్రో పిల్లర్లు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో ఉన్న భూగర్భ మరుగునీరు, మంచి నీటి పైపులైన్లు, వరద నీటి డ్రైన్లు, విద్యుత్ లైన్లను తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ లైన్లను భూగర్భ కేబుళ్లుగా మార్చనున్నారు. దీని కోసం వాటర్ బోర్డు, జిహెచ్‌ఎంసి, టిజిఎస్‌పిడిసిఎల్ వంటి శాఖల నుంచి అంచనాలను కోరామని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఈ పనులను పర్యవేక్షించేందుకు ఆయా శాఖల అధికారులతో కలిసి మెట్రో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారన్నారు. రోజువారీగా ఈ పనులను మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి స్వయంగా సమీక్షిస్తున్నారు.

### గోవాలో జాతీయ ఒబిసి మహాసభలో..

# భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఓబిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబిసి మహాసభలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని దేశవ్యాప్తంగా ఉన్న ఓబిసి ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో గోవా సభకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి డి. రమ పాల్గొన్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గోవాలోని డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగే ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి 10 వేల మందికి పైగా ఓబిసి ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల బిసి నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఈ కింది డిమాండ్‌లపై చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, బిసిలపై విధించిన క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలనే అంశాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రీయ ఓబిసి మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజోల్కర్ మాట్లాడుతూ, ఓబిసి రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ ఓబిసి మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి గోవాలో పదో మహాసభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ మహాసభలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి ఉద్యోగ సంఘాల నేతలు రాదరాణి, వారాల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, మహేశ్ యాదవ్, అనురాద, షమీమ్ సుల్తానా, మహేంద్ర సాగర్, రాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఆరోగ్యం కంటే

# గొప్ప ఆస్తి ఏదీ లేదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరోగ్యం కంటే గొప్ప ఆస్తి ఏదీ లేదని,ఆరోగ్యం లేకపోతే ఎంత సంపద ఉన్నప్పటికీ ప్రయోజనం లేదని పలువురు వైద్యులు అన్నారు. అందుకే ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వారు సూచించారు. హైదరాబాద్‌లోని సైబర్ సిటీ రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్‌లో 'చిరంజీవి హాస్పిటల్స్ వాస్క్యులర్ , మల్టీ స్పెషాలిటి' ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు డాక్టర్ కె. సంజీవరావు, డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ శిల్పా పొన్నాడ పలువురు వైద్యులు వైద్య పరీక్షలను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన జీవితాల్లో ఆరోగ్యం ఎంతో ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి తగిన చికిత్స చేసుకునే అవకాశం ఉంటుందని వారు సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు లాంటి కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.



## కాంగ్రెస్ హామీల అమలేది?

'ఆప్' జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక

ప్రజాపక్షం /ఖైరతాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పుడు బస్‌పాస్‌ల కోసం 40రెట్లు ఎక్కువ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కల్యాణలక్ష్మీ పథకంతో 10గ్రాముల బంగారం ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో ఆప్ రాష్ట్ర నేతలు బుర్రా రాములు గౌడ్, విజయ మల్లంగి తదితరులు పాల్గొన్నారు.




### ఆర్థిక సమగ్రత, వృద్ధిని నిర్ధారించడంలో

# చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకం

ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనిల్‌కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారతదేశ ఆర్థిక విజయానికి చార్టర్డ్ అకౌంటెంట్లు (సిఏలు) వెన్నెముక లాంటివారని, ఆర్థిక సమగ్రత, వృద్ధిని నిర్ధారించడంలో వారి పాత్ర అభినందనీయమని ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఎం.అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిఏ చంద్రశేఖర్ వేముల నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వ్యాపారాలకు ఆర్థిక మార్గదర్శకత్వం అందించడంలోనూ, రాష్ట్ర, జాతీయ పన్ను చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడంలోనూ సిఏలు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. పన్ను న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పన్ను చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో, పన్ను చెల్లింపుదారుల హక్కుల కోసం వాదించడంలో, పౌరులు ప్రభుత్వ అధికారుల మధ్య విశ్వసనీయ సంబంధంగా వ్యవహరించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సిఏ పి.వి. నారాయణ రావు, కార్యదర్శి సిఏ ఆశిష్‌జోషి, సలహాదారు సిఏ రాందేవ్ బుటాడా, మాజీ అధ్యక్షులు అమృత్ కుమార్ కోటా, హితేష్ జైన్, జిసి సభ్యుడు ఎపి దహిమా పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
తెల్లవారుజామున కాలనీల్లో పర్యటన



ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రజా సమస్యల పరిష్కారామే ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు జామునుంచే మున్సిపల్ పరిధిలోని 6,7,8,9వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో ఇంటింటికి వెళ్ళి సమస్యలు ఏమైనా ఉన్నాయా..ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..అనే విషయాలను ప్రజలను నేరుగా అడిగి తెలుసుకోవడంతోపాటు నోట్ చేసుకున్నారు. ఎమ్మెల్యే కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవడంతోపాటు కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. జిహెచ్‌ఆర్ కాలనీ, శంకర్‌నగర్ కాలనీ, మల్లిఖార్జున్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో సిసి రోడ్డు పనులు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. వార్డుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అక్కడి నుండే కొన్ని శాఖల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. కాలనీల్లో ఎక్కువ శాతం విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉందని కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకువచ్చారని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకున్నట్లు పేర్కొన్నారు. కాలనీల్లో పర్యటించడంతో విద్యుత్ సమస్య, మురుగు కాలువ సమస్యలను, రోడ్లు వంటి అనేక సమస్యలు తెలుగులోకి వచ్చాయని తెలిపారు. లోవోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను అదేశించారు. ఎమ్మెల్యే కాలనీల పర్యటనతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### విద్యార్థులకు చదువుతో పాటు

# సమాచార పరిజ్ఞానం అవసరం

ఎస్‌సి బాలుర హాస్టల్‌కు టివి బహుకరించిన

కాంగ్రెస్ సీనియర్ నేత గుర్రం మురళిగౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థులకు చదువుతో పాటు సమాచార పరిజ్ఞానం అవసరమని కాంగ్రెస్ నాయకులు గుర్రం మురళిగౌడ్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ జవహర్‌లోని ఎస్‌సి బాలుర హాస్టల్‌కు గుర్రం మురళిగౌడ్ టివి బహుకరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సి.రామయ్య, టి.వినోద్‌కుమార్, ఎండి.గౌస్, వెంకట్‌రెడ్డి, మాల్యాల యాదగిరి, చంద్రమౌళి, కె.రమేష్, సిబ్బంది కె.శోభ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పార్టీని తిరిగి అధికారంలోకి తేవటానికి బిఆర్ఎస్‌లో చేరిన వారందరూ అంకితభావంతో ప్రణాళికాయుక్తంగా పాటుపడాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, రాష్ట్ర పురోగతి బిఆర్ఎస్‌తో మాత్రమే సాధ్యమన్నారు. గౌతంనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ శ్రేణులు వెంకటేష్,శ్రీనివాస్ కపూర్,ఎస్ సురేష్, మెకానిక్ కుమార్, సాంబ తదితరులు బిఆర్ఎస్‌లో స్థానిక కార్పొరేటర్ మేకల సునిత సమక్షంలో చేరారు.



## ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు పలువురిని అలరించాయి. సత్యప్రసాద్ వెంపటి శిష్య బృందం వన్దే వన్దే భవాని,గణపతి కౌతం, జయం జయం, రామదాసు కీర్తన, శివాష్టకం, అన్నమాచార్య కీర్తనలు, కమాలిక, సాత్విక మొదలైన ప్రదర్శనలు చేసారు.



## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే విధంగా కృషి చేస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని బిజెపి సీనియర్ నేత ఊరవెల్లి రాంబాబు సూచించారు. శివపురిలోని కార్యాలయంలో శనివారం శ్రవణ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులకు రూ. 1.25 లక్షలు స్కాలర్‌షిప్ రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రీ, రవి, శివానంద్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లైటింగ్ సిస్టమ్ ప్రారంభించిన కార్పొరేటర్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని బండచెరువు వాకింగ్ ట్రాక్ దగ్గర ప్రాంతంలో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టంను స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సత్యనారాయణ, సంపత్, శ్రీనివాస్, పెంటయ్య, ప్రభాకర్ గౌడ్, శివరాజ్, రమేష్, బద్రినారాయణ, కృష్ణప్రసాద్, గోపినాథ్, హరీష్, సుబ్బారావు, మల్లేశం, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఏ ప్రాంతంలో పని చేసినా అంకితభావంతో ప్రజలకు ఉపయోగపడేలా విధులు నిర్వహించటం వల్ల సరైన గుర్తింపు ఉంటుందని తూంకుంట మున్సిపల్ కమిషన్ ఎంఎన్నార్ జ్యోతి అన్నారు. ఆదివారం బదిలీపై జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయిన రెవెన్యూ అధికారి అర్షద్ అహ్మద్‌ను కార్యాలయ ఉద్యోగులు కల్సి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. రెవెన్యూ అధికారిగా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూంల లబ్దిదారులను గుర్తించటంలో పారదర్శకంగా వ్యవహరించాడని కమిషనర్ కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల సిబ్బంది ఈ కార్యాలయంలో పాల్గొన్నారు.

## పెన్షన్ మొత్తాన్ని పెంచాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌దారులకు పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ అర్హులందరికి పెన్షన్‌లు మంజూరు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 13న ఎల్బీ స్టేడియంలో జరిగే పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ మల్కాజిగిరి నేతలు కోరారు. ఉప్పర్‌గూడలో ఆదివారం జరిగిన పెన్షన్ దారుల సభలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ , ఇతర ప్రతినిధులు రాంచందర్, మనోహర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/కాప్రా :** చిలుకానగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో కోటి ఏడు లక్షల యాభై వేల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి శంకుస్థాపన చేశారు. కళ్యాణ్‌పురిలోని ఇందిరానగర్, జాహిద్‌నగర్, బీరప్ప గడ్డ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజి పనులు, ఈస్ట్ కళ్యాణ్‌పురిలో బ్యాలన్స్ కమ్యూనిటీ హాల్ పనులు, రాఘవేంద్రనగర్ కాలనీ, బొడ్రాయి ప్రాంతాల్లో సిసి రోడ్డు పనులు, మరాలా మైసమ్మ అలయం వద్ద స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ పనులకు శంకుస్థాపన చేసారు. డివిజన్‌లో అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను దశల వారీగా పూర్తి చేస్తున్నామని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలోజిహెచ్ఎంసి డిఇ వెన్నెల గౌడ్, ఏఈ రాధికలతో పాటు బిఆర్ఎస్ శ్రేణులు, కాలనీ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

### సాధారణ ప్రజలకు అందుబాటులో వైద్యం అందించాలి



సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్యం అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. నాచారం ప్రధాన రహదారిలో చర్మ వ్యాధి వైద్య నిపుణులు, ఎముకల సంబందిత వైద్య నిపుణలు డా. ప్రదీప్ వర్మలు ఏర్పాటు చేసిన ఆనహ డెర్మా, ఆర్థో క్లినిక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సామల రఘుప్రసాద్, సామల రంగ, శ్రీలత, బిఆర్ఎస్ శ్రేణులు సాయిజెన్ శేఖర్, నవీన్, విఠల్, బుచ్చన్న గౌడ్, రాంచందర్, సంపత్ యాదవ్, యూసూఫ్,వాసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ గుర్తింపు పొందిన మేధావి అంబేద్కర్

### 16అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/మర్పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహన్ని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ కాశీం, చెవేళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రనిధులతో కలిసి రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలోనే మూడవ అతి ఎత్తైన రాజ్యంగ ప్రధాత, దళిత , గిరిజన, బడుగు,బలహిన వర్గాల ఆత్మబంధువు, భారతరత్న డాక్టర్ బీంరావు అంబేద్కర్ విగ్రహాన్ని అవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ ఒక చరిత్ర అని నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. దేశంలోని కోట్లది మంది దళిత, గిరిజనలు, బలహీన వర్గాల ప్రజలు తలేత్తుకుని బతుకుతున్నారంటే అంబేద్కర్ అని తెలిపారు. విద్యా ఉద్యోగాలు, రాజకీయ,సామాజిక రంగాలలో తమ వాటాను పొందుతూ ప్రజాప్రతినిధులు అవుతున్నారు అంటే దానికి కారణం అంబేద్కర్ అని అన్నారు. తాను పడిన కష్టాలు ,తాను అనుభవించిన బాధాలను భవిష్యత్తులో తన జాతి పడకూడదని అంబేద్కర్ రిజర్వేసన్లు అనే బ్రహ్మాస్త్రాని మనకు ఇచ్చాడని తెలిపారు. అంబేద్కర్ చేపించిన దారిలో నడిచిన మనం ఉన్నత స్థానాలను అందుకోవాలన్నారు. పూరి గుడిసెలో, దళిత వాడలలో గిరిజన గూడాలలో పుట్టిన వారు కూడా దేశ అత్యన్నత పదవులు పొందుతున్నారంటే దానికి ఏకైక కారణం అంబేద్కర్ అని తెలిపారు. అసమానతలు, అస్పృశ్యత సంకెళ్లను చేదించిన భారతదేశమే కాదు ప్రపంచ గుర్తింపు పొందిన గొప్ప మేదవి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో నేటి యువత తమ జీవిత లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నానని తెలిపారు. అంబేద్కర్ దేశ దిళిత ,గిరిజన బడుగు బలహీన వార్గల ఒక కాగడా లాగా వెలుగును పంచుతున్నారు. ఆ వెలుగులో మనం విజయం అనే గమ్యాని అందురోవాలని అప్పుడే అంబేద్కర్ నిజమైన నివాళర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్లూర్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గోన్నారు.

## జవహర్‌నగర్‌లో సిపిఐ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ఈ నెల జరుగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆదివారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ విడుదల చేసారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని దళిత సంక్షేమ భవన్‌లో కాప్రా మండల సమితి ఆధ్వర్యంలో కాప్రా మండల పార్టీ కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. మహాసభల వేదికలో కార్యాచరణ రూపొందించుకొంటామన్నారు. పార్టీ కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్‌రావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలులు మాట్లాడుతూ అధికారం కోసం పాకులాడకుండా ప్రజలతో మమేకమవుతున్న సిపిఐ మరింత ఉత్సాహంతో పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, మహిళా సమైక్య కాప్రా మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిపిఐ గిరిప్రసాద్‌నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం సాగర్, పి.నరసింహ, నాగేష్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం అభినందనీయం

### కొడంగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.శ్రీరామ్

**ప్రజాపక్షం/కొడంగల్ :** కొడంగల్‌లో 'యువసేన ఫ్రెండ్స్' యువకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయించడం జరుగుతుందని కొడంగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.శ్రీరామ్ అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలోని యువసేన ఫెండ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా డిప్యూటీ డిఎంఎచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ సమక్షంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా హజరైన కొడంగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ గత సంవత్సరం క్రితం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆసక్తి, పట్టుదల సమాజ సేవను ఆదర్శంగా తీసుకుని మా సోంత గ్రామంలోని యువకులను అవగాహన కల్పించి వారిచే ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ప్రాణదాత అవుతారని యువకులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం కొడంగల్‌లో దాదాపు 30 మంది కుష్టువ్యాధి భారిన పడిన వారికి నెలకు సరిపడ నిత్యవసర పౌష్టిక ఆహార కిట్లను సైతం అందజేయడంతో యువకులను అభినందించారు. రక్తదాన శిభిరంలో దాదాపు 100 మందికి పైగ రక్తాన్ని అందించి తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తదాన శిభిరానికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక సిఐ శ్రీధర్‌రెడ్డి,ఫైలేరియా యూనిట్ అధికారి పకిరప్ప తదితరులు పాల్గోన్నారు.



## సిపిఐని మరింతగా ఆదరించాలి

### రాష్ట్ర మహాసభల గౌరవాధ్యక్షుడు డిజి సాయిలు గౌడ్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వందేళ్ల చరిత్ర కలిగి ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ సహకరిస్తున్న సిపిఐని మరింతగా ఆదరించాలని రాష్ట్ర మహాసభల గౌరవ అధ్యక్షులు డిజి సాయిలు గౌడ్ కోరారు. ఆదివారం యాప్రాల్‌లోని అంబేద్కర్ విగ్రహం కూడలి ప్రాంతంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను పార్టీ శ్రేణులతో కల్సి విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కె.రవిచంద్రన్, సిపిఐ మండల కార్యదర్శులు రైతుసంఘం అధ్యక్షులు, బికెఎంయు నాయకులు నరేంద్రచారి, ఏ.బాబు, డి. జంగయ్య, చంద్రయ్య, వెంకటేష్, టి.కృష్ణ, దీపక్, పాండు, రమేష్ సింగ్, గణేష్,సైదులు, రాజు, పరంధాములు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల దేవాలయం వద్ద వనమహోత్సం



**ప్రజాపక్షం/తాండూర్ :** పెద్దేముల్ మండల పరిధిలోని బండమిది పల్లి గ్రామంలో ఉన్నా సీతారాముల దేవాలయం వద్ద వనమహోత్సవం నిర్వహించరు. గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులు గ్రామ పెద్దలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మనిచ్చిన గ్రామనికి సేవలు అందించాలే ఉద్దేశంతో గ్రామంలో మొక్కలు నాటడం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఏ స్థాయిలో ఉండి విధులు నిర్వహించినప్పటికి జన్మనిచ్చిన గ్రామానికి మాత్రం మర్చిపోవద్దని సూచించారు. పచ్చని చెట్లు ప్రగతి కి మెట్లని, చెట్లను ఎవరు నరకవద్దని సూచించారు. ఈ క్యాక్రమంలో మల్లేశం, పట్నం లక్ష్మణ్ , నాజకుమార్ ,శ్రీనివాస్ , శివలీల , వెంకటేశం వెంకటలక్ష్మి , రమేష్ వీరన్న రామచందర్ , నర్సిములు , శంకరయ్య, రవి, వెంకట్ ,రామచంద్రయ్య తదితరులుపాల్గోన్నారు.

## అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** అన్నాచెల్లెల అనుబంధానికి, ఆత్మీయతకు రక్షాబంధన్ ప్రతీక అని ఆర్ఎస్ఎస్‌విభాగ్ కార్యవాహ పత్తికొండరాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం భక్తులతోకలిసి ఒకరికొకరు రాఖీలు కట్టుకొని రక్షాబంధన్ చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయంలో రక్షాబంధన్‌కు ప్రముఖస్థానం ఉందని, తోబుట్టువులకు ఎంతటికష్టం వచ్చినవెన్నంటే ఉంటామని సోదరులకు రాఖీకట్టి ధైర్యం కల్పిస్తారని అన్నారు. అదే విధంగా దేశరక్షణకు నేటి యువతరం కంకణబద్దులై ఉండాలనే స్పూర్తి రక్షాబంధన్ రగిలిస్తుందన్నారు. పూర్వీకులు ప్రతిపండుగద్వారా మనందరి మానవ మనుగడ గురించి వివరించారని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఆలయ అర్చకులు వెల్దండ సురేష్ పాల్గొన్నారు.

## గొర్రెల కుంభకోణం.. మాజీ మంత్రి తలసాని పాత్రపై ఇడి ఆరా




**హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన భారీ కుంభకోణం కొత్త మలుపు తిరగబోతోంది. ఇప్పటి వరకు ఈ కుంభకోణంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగుల వరకే పరిమితం అయిన దర్యాప్తు, ఇక నుంచి అప్పట్లో ఆ శాఖ మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ పై దృష్టి సారించబోతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలో ఆయనకు ఇడి నోటీసు జారీ చేయబోతున్నట్టు తెలిసింది. మొదట ఈ కుంభకోణం రూ.253 కోట్లుగా 'కాగ్' తేల్చగా, దీనిపై తీగలాగితే అది వెయ్యి కోట్లపైగానేఉన్నట్టు తేలిందని ఇడి అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ భారీ కుంభకోణం వెనుక బడాబాబు పాత్రపై నిగ్గుతేల్చేందుకు ఇడి అధికారులు రంగం సిద్ధం చేస్తోన్నట్టు ఈ వర్గాల సమాచారం. ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ పాత్రపై ఇడి ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అప్పట్లో మంత్రి వద్ద ఓఎస్‌డిగా పని చేసిన కళ్యాణ్ నివాసంలో ఇడి నిర్వహించిన తనఖీలలో కీలకమైన ఆధారాలు లభించినట్టు ఈ వర్గాల సమాచారం. సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండా ఓఎస్‌డి రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి పాల్పడుతారా? అని ఇడి అనుమానానికి తనఖీలలో లభించిన సాక్షాధారాలు బలం చేకూర్చినట్టు తెలిసింది. దీంతో ఇడి అధికారులు త్వరలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నోటిసులు జారీ చేసి విచారణకు పిలువబోతున్నట్టు తెలిసింది.

## మరో కొరియోగ్రాఫర్‌పై పోక్సో కేసు..

**హైదరాబాద్:** సినీ పరిశ్రమలో మరో కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఉదంతం మరిచిపోకముందే మరో డాన్స్ మాస్టర్ పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఢీ కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కంది జైలుకు తరలించారు. మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో ప్రముఖ రియాలిటీ షో 'ఢీ' కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరులోని ఆయన అన్న నివాసంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో షాకింగ్ నిజాలు తెలిశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణ మాస్టర్‌పై గతనెల బాలిక కుటుంబసభ్యులు గచ్చిబౌలి పిఎస్‌లో కేసు నమోదు చేశారు. పోక్సో కేసు నమోదు అనంతరం కృష్ణ మాస్టర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇటీవలే కృష్ణ మాస్టర్‌కు ఓ మహిళతో వివాహం జరిగింది. భార్యకు సంబంధించిన రూ.9.50 లక్షలు నగదు తీసుకుని పరారయ్యాడు. ఇదిలా ఉంటే గతంలో కూడా కృష్ణ మాస్టర్‌పై పలు ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పలువురు యువతులను, మహిళలను మోసం చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి.

# బిఆర్ఎస్ గప్‌చుప్..!

### నవాబుపేట్‌లో 'స్థానిక' ఎన్నికల ముందే కార్యకర్తల్లో గుబులు రేపుతోన్న పార్టీ తీరు






**ప్రజాపక్షం/నవాబుపేట్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. జెడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. స్థానిక ఎన్నికల నిర్వహణ ఖాయంగా ఉంటుందనే సంకేతాలతో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, బిజెపి ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాయి. వామపక్ష పార్టీల నాయకులు సైతం అవకాశమున్న చోట బరిలో దిగేందుకు ప్రయత్నిస్తుండగా, నవాబ్ పేట్ మండలంలో బిఆర్ఎస్ సైలెంట్ అయింది. కేవలం ప్రతిపక్ష అధినేత హడావిడి ఉన్నపుడే పార్టీ కార్యక్రమాలు, పార్టీ నేత పిలుపు ఇస్తేనే మీడియా సమావేశాలు, మండల ప్రజల సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు లేదంటే గప్‌చుప్ సోడాబుడ్డి అన్నట్టు మండలంలో బిఆర్ఎస్ పార్టీ తీరు ఉందని సొంత పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారనే వినికిడి. బిజెపి మండల సమస్యలపై దూకుడు పెంచగా, 'జనహిత పాద యాత్ర' పేరుతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్తుంది. బిజెపి, కాంగ్రెస్ కేడర్‌తో మమేకమవుతూ జోష్ నింపుతున్నాయి. కానీ ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ మాత్రం ఎలాంటి కార్యక్రమాలు లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లో నిశ్శబ్దం నెలకొంది. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ మండలంలో అప్పుడప్పుడు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారే తప్ప ప్రతిపక్షం పాత్ర మాత్రం పోషించలేకపోవడంపై పార్టీ శ్రేణుల్లో కొంత గుబులు రేపుతోంది. గత మార్చి నెలలో కురిసిన భారీ వడగండ్ల వర్షాలకు మండలంలో వివిధ గ్రామాలల్లో పంట నష్టపోయిన రైతులను పరామర్శించి పంటను పరిశీలించారు. మొదలైన రెండు మూడు కార్యక్రమాలు ప్రతిపక్ష అధిష్టానం పిలుపుతో చేశారు. కానీ మండలంలో మరేలాంటి కార్యక్రమాలు లేవ్, ప్రతిపక్ష నేతలు కనీసం మండలంలో కంటికి కనపడకుండా సొంత పనుల్లోనే బిజీ అయ్యారని తెలుస్తుంది.

### నెలకి ఒకటి.. రెండు కార్యాచరణ కూడా లేవు

అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పేరిట కార్యక్రమాలు చేశారు తప్ప అధికారం కోల్పోయాక ప్రతిపక్ష హోదాలో ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాలు మాత్రం చేపట్టడం లేదు. పార్టీ శ్రేణులకు మండల కమిటీ నుండి రాష్ట్ర స్థాయి నేతల నుండి ఎలాంటి కార్యక్రమాలు ఇవ్వకపోవడంతో గ్రామస్థాయి కార్యకర్తలు అయోమయంతో మౌనం పాటిస్తున్నట్లు తెలుస్తుంది. పార్టీ మండల కార్యాలయం ప్రారంభించిన తర్వాత పార్టీ గ్రామ స్థాయి కార్యకర్తలకు ప్రజల్లోకి ఎలా వెళ్లాలనే ప్రణాళిక ఇస్తామని చెప్పిన మండల కమిటీ ఆదిశగా అడుగులు వేయడం లేదు. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోంది. అందులో భాగంగానే ఒకవైపు గ్రామాల్లో ప్రజా సమస్యలపై, మండలంలో రోడ్డు సమస్యలపై, విద్యార్థుల సమస్యలపై పోకాస్ పెట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాదు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి ఇస్తున్న నిధులు, బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామీణ స్థాయిల్లో బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుంది.

### ప్రజాహిత యాత్ర పేరుతో కాంగ్రెస్..


స్థానిక ఎన్నికల కోడ్‌కు ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాహిత యాత్రను చేపట్టడం జరుగుతోంది. బిజెపి, బిఆర్ఎస్ వామపక్ష పార్టీల వైఫల్యాలను తనదైన శైలీలో కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తూ పార్టీ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. ప్రజలకు అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తున్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందనే భరోసాను నింపుతున్నారు.

### మండలంలో బిఆర్ఎస్ సైలెంట్

ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ మండలంలో సైలెంట్‌గా ఉంది. కాంగ్రెస్, బిజెపిలు నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు. బిఆర్ఎస్ మాత్రం అధికారంలో ఉన్నపుడు చేసిన ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధిని నమ్ముకొని ఉంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో కలిసి వస్తుందని ఆ పార్టీ మండల కమిటీ, గ్రామస్థాయి నాయకులు ధీమాగా ఉన్నారు. అయితే ప్రజలు ఆశించిన స్థాయిలో ప్రభుత్వం పనులు చేయకపోవడంతో వ్యతిరేకత ఉంది. దీనికి తోడు పార్టీ కార్యక్రమాలు సైతం లేకపోవడంతో పార్టీ కేడర్‌లో సైతం స్తబ్దత నెలకొందని మండల నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు.

### ఇంటి తాళాలు పగులగొట్టి

## 16 తులాల బంగారం చోరీ



**మొయినాబాద్ :** పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చే లోపు దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోని బంగారు అభరణాలను అపహరించుకుపోయారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన సిహెచ్ అనిత కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని తన బంధువుల ఇంట్లో పెళ్లికని ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి వాళ్లు ఇంటికి ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా కూడ తెరిచి ఉంది. అందులో నుంచి 2 బంగారు నెక్లెస్‌లు, 2 జతల చెవి కమ్మలు, రెండు బ్రాస్‌లెట్‌లు, 4 బంగారు గాజులు మొత్తం 16 తులాల బంగారం అభరణాలను దొంగిలించారు. దొంగతనం జరగడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రంగంలోనికి దింపి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## క్రీడ

# రూట్.. రికార్డుల మోత

## భారత్‌పై పదమూడో సెంచరీ..



సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంగ్లాండ్ క్రికెటర్ జో రూట్ రికార్డులు పర్వం లిఖిస్తున్నాడు. స్వదేశంలో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీలో శతకాల మోత మోగిస్తున్న అతడు.. సిరీస్‌లో కీలకమైన ఓవల్ మైదానంలోనూ సెంచరీ బాదాడు. ఆకాశ్ దీప్ ఓవర్లో డబుల్స్ తీసి.. భారత్‌పై పదమూడో వందతో చరిత్ర సృష్టించాడు రూట్. తద్వారా ఒకే జట్టుపై అత్యధిక రన్స్ చేసిన మూడో ఆటగాడిగా రూట్ రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ ముందున్నాడు. ఈ దిగ్గజ ప్లేయర్ ఇంగ్లాండ్‌పై ఏకంగా 19 సెంచరీలు కొట్టాడు. వెస్టిండీస్‌పై 13 శతకాలు సాధించిన భారత లెజెండ్ సునీల్ గవాస్కర్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జట్టుకు అవసరమైన సమయంలో బ్యాటుతో బదులిచ్చే రూట్ ఓవల్‌లో వందతో అలరించాడు. భారత బౌలింగ్ దళాన్ని అసహనానికి గురి చేస్తూ టీ బ్రేక్ తర్వాత అతడు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిది 39వ శతకం. ఓవల్ టన్‌తో రూట్ శ్రీలంక వెటరన్ కుమార సంగక్కర రికార్డును బ్రేక్ చేశాడు. ప్రస్తుతం అత్యధిక శతక వీరుల జాబితాలో అతడు నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఓవరాల్‌గా 51 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ టాప్‌లో ఉండగా.. దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్(45) రెండో స్థానంలో,. ఆస్ట్రేలియా మాజీ సారథి రికీ పాంటింగ్(41) మూడో ప్లేస్‌లో ఉన్నారు. స్వదేశంలో బ్యాట్‌తో హడలెత్తించే రూట్ .. అత్యధికంగా 24 సార్లు మూడంకెల స్కోర్ అందుకోవడం విశేషం. పాంటింగ్, కలిస్, జయవర్ధనేలు 23 శతకాలతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు.


## ఆసియా కప్ వేదికలు ఖరారు



ఈ ఏడాది పురుషుల ఆసియా కప్ (2025) తటస్థ వేదికపై జరుగనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలపడంతో ఈమధ్యే ఆసియా క్రికెట్ కౌన్సిల్ షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా టీ20 ఫార్మాట్లో ఆసియా కప్ టోర్నీని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏసీసీ ఆసియా కప్ మ్యాచ్‌ల వేదికలను ఖరారు చేసింది. దుబాయ్, అబుదాబీలో మ్యాచ్‌లు జరపాలని ఏసీసీ నిర్ణయించింది. యూఏఈ కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు) మ్యాచ్‌లు ప్రారంభం అవుతాయయని ఎసిసి వెల్లడించింది. 'ఎసిసి టీ20 ఆసియా కప్ వేదికలు, మ్యాచ్ సమయాలను నిర్ణయించాం. ఈ మెగా టోర్నీ సందర్భంగా స్టేడియాలు కిక్కిరిసి పోతాయని భావిస్తున్నాం. ఆసియా ఖండంలోని అత్యుత్తమ జట్లు ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీ కోసం కొదమ సింహాల్లా తలపడనున్నాయి. ఉపఖండం వ్యాప్తంగా అభిమానులకు ఈ టోర్నీ అసలైన క్రికెట్ మజాను పంచనుంది ' అని ఏసీసీ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ తెలిపాడు. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగునున్న ఆసియా కప్‌లో 8 జట్లు పోటీపడనున్నాయి. భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, యుఏఈ, ఒమన్, హాంకాంగ్ జట్లు టైటిల్ పోరుకు సిద్ధమవుతున్నాయి. 19 రోజుల పాటు జరిగే ఆసియా కప్‌లో లీగ్ మ్యాచ్‌లతో కలిపి 19 మ్యాచ్‌ల ఉంటాయి. సెప్టెంబర్ 15న రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. తొలిపోరులో ఒమన్ జట్టు ఆతిథ్య యూఏఈని ఢీకొట్టనుంది. అనంతరం.. శ్రీలంక జట్టు హాంకాంగ్‌తో తలపడనుంది. భారత జట్టు లీగ్ మ్యాచ్‌ల విషయానికొస్తే.. సెప్టెంబర్ 10న యూఏఈతో, సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో, సెప్టెంబర్ 19న ఒమన్‌తో ఆడనుంది. టీమిండియా సూపర్ 4 మ్యాచ్‌ల తేదీలు లీగ్ ఫలితాలపై ఆధారపడనున్నాయి. సెప్టెంబర్ 28న ఫైనల్ మ్యాచ్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.

## సెంచరీతో మెరిసిన మిస్టర్ 360..

### తొలిసారి ఛాంపియన్‌గా దక్షిణాఫ్రికా




ఈఏడాది దక్షిణాఫ్రికా పట్టిందల్లా బంగారమే అవుతోంది. ఈమధ్యే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలుపొందిన సఫారీ జట్టు.. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ (2025) విజేతగానూ అవతరించింది. ఏబీ డివిలియర్స్ (120 నాటౌట్) మెరుపు శతకంతో ప్రొటీస్ జట్టు తమ కలను సాకారం చేసుకుంది. పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో జరిగిన ఫైనల్లో మిస్టర్ 360 విధ్వంసం సృష్టించాడు. కేవలం 60 బంతుల్లోనే డివిలియన్స్ సెంచరీ బాదేయగా.. దక్షిణాఫ్రికా ఛాంపియన్స్. 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. దాంతో, రెండో సీజన్‌లో ట్రోఫీని అందుకున్న పాక్ రన్నరప్‌గా సరిపెట్టుకుంది. మాజీ ఆటగాళ్లు ఒక్క చోట చేరి ఆడుతున్న వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్‌లో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. లీగ్ దశ నుంచి దుమ్మురేపుతున్న సఫారీ జట్టు ఫైనల్లోనూ పంజా విసిరింది. ఇండియా ఛాంపియన్స్ సెమీస్ నుంచి వైదొలగడంతో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో తలపడిన జాక్వెస్ కలిస్ నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత ఆడిన పాక్‌కు ఓపెనర్ షర్జీల్ ఖాన్ (76) శుభారంభం ఇచ్చాడు. మిడిలార్డర్‌లో ఉమర్ అమిన్(36), అసిఫ్ అలీ(28)లు రాణించడంతో పాక్ నిర్ణీత ఓవర్లలో రన్స్ చేసింది.

### తొలి వికెట్‌కు 72 రన్స్

అనంతరం పాక్ నిర్దేశించిన భారీ ఛేదనను సఫారీ ఓపెనర్లు ఏబీ డివిలియర్స్(120 నాటౌట్), హాషీం ఆమ్లా(18) ధాటిగా ఆరంభించారు. తొలి వికెట్‌కు 72 రన్స్ కలిపిన ఈ జోడీని అజ్మల్ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో ఆమ్లా షాట్‌కు యత్నించి రాయిస్ చేతికి చిక్కాడు. తొలి వికెట్ పడినా.. డివిలియర్స్ తన జోరు తగ్గించలేదు. జీన్ పాలు డుమినీ(50 నాటౌట్)తో కలిసి పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇద్దరూ దంచేయడంతో ప్రొటీస్ జట్టు గెలుపు దిశగా సాగింది. 12 ఫోర్లు, 7 సిక్సర్లు బాదిన డివిలియర్స్ శతకం సాధించగా.. డుమినీ సూపర్ ఫిఫ్టీతో తమ జట్టును మొదటిసారి ఛాంపియన్‌గా నిలిపారు. దాంతో, రెండో పర్యాయం టైటిల్ ముద్దాడాలనుకున్న పాక్ ఆశలు ఆవిరయ్యాయి.

## ఫోకస్

## ఆరోగ్యం




# వెంటాడుతున్న లాంగ్ కొవిడ్ కష్టాలు

యావత్ ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మహమ్మారి శాంతించినట్టు కనిపిస్తున్నప్పటికీ, అది మిగిల్చిన గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఎన్నో దేశాలు ఇప్పటికీ ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకోలేదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. ఇది ఒక సమస్యకాగా, కొవిడ్ లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగడం మరో సమస్య. ఒకవైపు ఆర్థికంగా కుంగిపోతే, మరోవైపు ఆరోగ్యం ఇప్పటికీ కుదుటపడక, వైద్య ఖర్చులు భరించలేక ఎంతో మంది అల్లాడుతున్నారు. దీర్ఘకాల కొవిడ్ లక్షణాలను 'లాంగ్ కొవిడ్'గా పేర్కొంటున్నారు.

కొవిడ్ ఐదు సంవత్సరాల క్రితం నాటిది. సమస్యలు మాత్రం నిత్యనూతనం. పైగా, కరోనా వైరస్ వివిధ రూపాలను సంతరించుకొని, వేరువేరు వేరియంట్స్‌గా మారి, దాడి చేస్తునే ఉంది. ఇలావుంటే, గల్ఫ్ దేశాల్లో కొవిడ్ కేసులు పెరగడం ఆందోళన కలిగించే అంశం. మన దేశం నుంచి లక్షలాది మంది గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. వస్తున్నారు. దీనితో కొవిడ్ ఇక్కడ కూడా పెరిగే ప్రమాదం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో 'లాంగ్ కొవిడ్' బాధితులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వీరిలో చాలా మంది కొవిడ్ సంబంధిత సమస్యలతోపాటు, దాని సైడ్ ఎఫెక్ట్స్‌తోనూ అల్లాడుతున్నారు. పురుషులు, స్త్రీలు అనే తేడా లేకుండా చాలా మందికి అకస్మాత్తుగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరిగితే, కొంత మందికి బట్టతల వచ్చింది. గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, నరాల బలహీనతలు సరేసరి. సాధారణంగా కొవిడ్ 19 ప్రారంభమైన 3 నెలల తర్వాత, లక్షణాలు కనీసం 2 నెలల పాటు ఉంటాయి. 'లాంగ్ కొవిడ్'లో మాత్రం ఆ లక్షణాలు పదేపదే ప్రత్యక్షమవుతాయి. విపరీతమైన నీరసం, అలసట వేధిస్తుంటాయి. క్రమం లేని హృదయ స్పందనతో కొత్తకొత్త సమస్యలు సృష్టిస్తుంది. దీనిని అరిథ్మియా అని కూడా పిలుస్తారు. మెట్లు ఎక్కడం లేదా కొంత దూరం నడవడం కష్టమవుతుంది. నిద్రలో ఉన్నప్పుడు హఠాత్తుగా శ్వాస ఆడకపోవడం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. చాలా మంది 'లాంగ్ కొవిడ్' హోల్డర్లు కొత్త వ్యాధులు అభివృద్ధి చెందుతున్నాయి. వారికి గతంలో ఎప్పుడూ రాని... ఎటువంటి జన్యు సంబంధాలు లేని వ్యాధులు సోకుతున్నాయి. కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత, ఈ విధంగా కొత్త వ్యాధులు సోకడం అనేది ఆ మహమ్మారి అంతర సమస్యల్లో భాగమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) స్పష్టం చేస్తున్నది. కొన్ని సందర్భాల్లో, ప్రారంభ అనారోగ్యం నుండి లక్షణాలు కూడా అలాగే ఉంటాయి. కాలక్రమేణా లక్షణాలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. కొన్ని సందర్భాల్లో తిరగబెడతాయి. డయాబెటిస్, అల్జీమర్స్, కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడిన వారు కూడా ఉన్నారని డబ్ల్యుహెచ్‌ఒ నివేదికలు పేర్కొంటున్నాయి.

## విస్తరిస్తున్న టెలిహెల్త్ సేవలు

కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, టెలిహెల్త్ సేవలు ఇటీవలి కాలంలో బాగా విస్తరిస్తున్నాయి. దీని ద్వారా రోగులు క్లినిక్‌లో ఎక్కువసేపు వేచి ఉండకుండా, తక్షణమే వైద్యులను సంప్రదించగలుగుతారు. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో త్వరిత సేవలు అందించడంలో సహాయపడుతుంది. ట్రస్టేడాక్టర్ (Trustedoctor) వంటి డిజిటల్ వర్చువల్ కేర్ ప్లాట్‌ఫార్మ్‌లు అనేక ఫంక్షనాలిటీలు, అపాయింట్‌మెంట్ ఎంపికలు అందిస్తున్నాయి. తద్వరా ప్రత్యేక వైద్య సేవలను మరింత సులభంగా మరియు సమర్థవంతంగా అందించడాన్ని సాధ్యపరుస్తున్నాయి. రోగుల ఆరోగ్య డేటా ఆధారంగా వ్యక్తిగత వైద్య సలహాలు, చికిత్సలు అందించటం ద్వారా ఫలితాలు మెరుగవుతాయి. రోగుల వ్యక్తిగత సమాచారం గోప్యతను కాపాడుతూ, డేటా ఎన్క్రిప్షన్ వంటి టెక్నాలజీలను వినియోగించడం ద్వారా విశ్వసనీయత పెరుగుతుంది. డిజిటల్ షెడ్యూలింగ్, రిమైండర్లు ద్వారా వైద్యుల సమయాన్ని, రోగుల అపాయింట్‌మెంట్‌లను సమర్థంగా నిర్వహించవచ్చు. ఈ మార్గాల్లో టెలిహెల్త్ సేవలు మరింత వేగవంతంగా, నాణ్యతతో అందుబాటులోకి వస్తాయి. అయితే, వైద్యులతో ప్రత్యక్షంగా కలవకపోవడంతో, వారి పట్ల రోగులకు నమ్మకం కుదరదు. అంతేగాక, వైద్యులు, రోగుల మధ్య సత్సంబంధాలు నెలకొనే అవకాశాలు చాలా తక్కువ. ఇలాంటి కొన్ని సమస్యలు తెరపైకి వచ్చినప్పటికీ, టెలిహెల్త్ సేవలు కేవలం మన దేశంలో మాత్రమేగాక, ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరిస్తున్నాయి.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్న ప్రభుత్వం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్**



**ప్రజాపక్షం/మంచిర్యాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ప్రజావిశ్వాసాన్ని కోల్పోతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం, మండల కార్యదర్శుల సమావేశం ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కలవేన శంకర్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్‌పై అచంచలమైన నమ్మకంతో అధికారంలోకి తీసుకువచ్చారని, కానీ ప్రజల ఆశలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం, చేయూత, రాజీవ్ ఆరోగ్య భద్రత, పెన్షన్ వంటి హామీల అమలు గల్లంతైందని విమర్శించారు. గృహజ్యోతి దరఖాస్తులు ఇంకా ప్రారంభించలేదని, మహిళలకు పెన్షన్ రూ.4000 ఇవ్వాలి అన్న మాట ఏమైందని? ఆరోగ్య భద్రత రూ.10 లక్షల భీమా ఎక్కడని? ప్రశ్నించారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిసిన వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే గడువు పొడిగించాలని, దివ్యాంగులు సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికయిన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలకు ఎన్నికల హామీలు, సంక్షేమపథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేదంటే గత బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో జరుగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కలవేన శంకర్ కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, బోల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, కారుకూరి నగేష్, లింగం రవి, రేగుంట చంద్రకళ, జిల్లా సమితి సభ్యులు నెన్నెల సమ్మయ్య, బొంతల లక్ష్మీనారాయణ, దేవీ పోచన్న, ఆడేపు రాజమౌళి, కొండు భాణేష్, అందే పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# గోకారం చెరువు పునరుద్ధరించాలి

**జినుకుంటలో లెదర్‌పార్కు ఏర్పాటు**

**సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు బాల్‌నర్సింహ్మా డిమాండ్**



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండల పరిధిలోని గోకారం చెరువును తక్షణమే పునరుద్దరించాలని, జిల్లాలోగల వనరులను, ముడిసరుకులతో ఈప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చొరవతీసుకోవాలని, బల్మూర్ మండలం జినుకుంట గ్రామశివారులో లెదర్‌పార్కు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్‌తో కలిసి బాల్‌నర్సింహ్మా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా తృతీయ మహాభలను ఆగస్టు 1,2తేదీలలో నిర్వహించామన్నారు. మహాసభలలో 9 తీర్మాణాలను ఆమోదింపచేయడం జరిగిందన్నారు. పాలెం సమీపంలో పారిశ్రామిక ఇండస్ట్రీపార్కును ఏర్పాటు, జిల్లాలో పలు ఎత్తిపోతల పథకాలద్వారా నీటి సామర్థ్యం పెరగడంతో చేపల పెంపకానికి, మత్స్యసంపద నిల్వకు కోల్డ్‌స్టోరేజ్‌లను నెలకొల్పాలని, కొల్లాపూర్, కల్వకుర్తి ప్రాంతాలలో మామిడి ఆధారిత మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాను విద్యాపరంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, పాలిటెక్నికల్ కళాశాలలను ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలన్నారు. ఈప్రాంతంలోగల ముడిసరుకులు ఖనిజాలు విరివిగా ఉండటంతో సిమెంటు కాగితపు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. కెఎల్‌ఐ పథకం చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, ఉపకాల్వలు పూర్తిచేయలేదన్నారు. మాచర్ల జడ్చర్ల, రాయచూర్ జడ్చర్ల ప్రాంతాలకు రైల్వే మార్గం ఏర్పాటు చేయాలన్నారు. పోరాటాలకు పుట్టినిల్లు పాలమూరుగడ్డ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, యేసయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పరుషరాములు, సిహెచ్ శ్రీనివాసులు, నాయకులు యూసుఫ్,, శివకృష్ణ, దారదాసు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పిల్లలకు ఉద్యోగావకాశాలు



**సి.కా.వ.యూ(ఎఐటియుసి) ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి మెడికల్ బోర్డు విధానాలతో కార్మికులు ఆందోళనలో ఉన్నారని, హయ్యర్ సెంటర్ పేరుతో నిమ్స్‌కు పంపిన 47 మంది కార్మికులను వెంటనే మెడికల్ బోర్డులో అన్ఫిట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుండి ప్రతి నెల మెడికల్ బోర్డు ద్వారా 85 శాతం అన్ఫిట్ అయ్యేవారని, ఆగస్టు 2024 ఆగస్టులో మెడికల్ బోర్డు కొరకు 52 మందిని హయ్యర్ సెంటర్ పేరుతో అధునాతనమైన వైద్యశాల నిమ్స్‌కు రిఫర్ చేసి పంపించారని, వారి రిపోర్టులను పరిశీలించి, అందులో నలుగురిని మాత్రమే అన్ఫిట్ చేశారని, మరో 30 మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్, ఏడుగురికి సర్ఫేస్ జాబు ఇచ్చి అందులో 47 మందికి అన్యాయం చేశారన్నారు. సింగరేణిలో ఏదో కొత్తగా అవినీతి జరిగినట్లుగా మెడికల్ బోర్డు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంపై ఎఐటియుసి డైరెక్టర్‌తో చర్చించడం జరిగిందన్నారు. వెంటనే 47 మందిని బేషరతుగా అన్ఫిట్ చేసి వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. ఒకపక్క నిరుద్యోగం పెరిగిపోతుంటే, అన్ఫిట్ చేయకుండా ఇన్ వ్యాలిడిటీ పేరుతో కాలయాపన చేస్తూ వారి కుటుంబంలో అటు సర్వీసు ఇటు ఉద్యోగం పిల్లలకు రాక అయోమయ పరిస్థితిలో కార్మిక వర్గం ఉందన్నారు. వెంటనే 47 మందిని అన్ఫిట్ చేసి ఉద్యోగాలు కల్పించాలని లేనిపక్షంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాజ్‌కుమార్ హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, జి.శ్రీనివాస్, ఎం.విజేందర్, తాళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్**

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల మహాసభ అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ సిపిఐ కార్యాలయంలో పైడిపల్లి శశి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై యుగేందర్ మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని పోరాటాలు నిర్వహించింది ఎఐవైఎఫ్ అన్నారు. ఉన్నత చదువులు చదువుకుని నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం యువతను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశ సంపద యువతను పాలకులు విస్మరిస్తున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి నెరవేర్చకుండా యువతను మోసం చేసిందన్నారు. డిగ్రీలు, పిజిలు చేత పట్టుకుని ఉద్యోగాల కోసం తిరిగితే ప్రభుత్వ ఉద్యోగాలు దొరకకపోవడంతో ప్రైవేట్ సెక్టార్లలో ఎంతో మంది యువతీ, యువకులు చాలీచాలని వేతనాలతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజీవ్ యువవికాసం పథకం అందిస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు చెంచల రవి, పైడిపల్లి శశి, మహేష్, శ్యామ్, అజయ్, హరీష్, నవీన్, వెంకట్, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలు నీరుగారుస్తున్న పాలకులు



**సాధికారత, 33శాతం రిజర్వేషన్ అమలుకు పోరాడుదాం**

**మహిళా సమాఖ్య కొత్తగూడెం జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మి కుమారి**

**ప్రజపక్షం/కొత్తగూడెం టౌన్ :** మహిళా చట్టాల అమలును పాలకులు నీరుగారుస్తున్నారని భారత జాతీయ మహిళా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి ఆరోపించారు. మహిళా సమాఖ్య కొత్తగూడెం పట్టణ శాఖ 3వ మహాసభ ఆదివారం శేషగిరిభవన్‌లో మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, పైడిపల్లి లక్ష్మి, దారా లక్ష్మి, పుట్టి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమాఖ్య జెండాను ఎగురవేసిన అనంతరం ప్రతినిధుల మహాసభలో బలమైన ఉద్యమాలు నిర్మించడంతోనే మహిళలకు, మహిళా చట్టాలకు, హక్కులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల అరికట్టడంలో పాలకులు విఫలం చెందుతున్నారని, భృన హత్యలు, ఆడపిల్లల అమ్మకాలు, హింస, వివక్ష వంటి దుశ్చర్యలను అరికట్టేందుకు పాలకులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత సాధన, సమాన హక్కులు, 33 శాతం రిజర్వేషన్ అమలుకోసం మహిళాలోకం ఉద్యమబాట పట్టాలని, మహిళలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలలో మహిళలు, యువతుపై జరిగిన దారుణ హత్యాకాండల నిగ్గు తేల్చాలని లక్ష్మి కుమారి డిమాండ్ చేశారు. మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి, ప్రచార కార్యదర్శి కరీషే రత్నకుమారి, నాయకులు భరిగెల సంపూర్ణ, గోనెమని, సత్తెనపల్లి విజయలక్ష్మి, పాలమూరి ధనలక్ష్మి, పైడిపల్లిపల్లి లక్ష్మి, షాహీన్, కౌసర్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని సర్నేనిగూడెం, జనంపల్లి, ఇస్కిల్ల, కక్కిరేణి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముత్తిరెడ్డిగూడెం, జనంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం జనంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ గార్డెన్ అండ్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.





## గోపాల మిత్రల వేతనాలు విడుదల

### మంత్రి శ్రీహరిని కలిసి ధన్యవాదాలు తెలిపిన గోపాల మిత్రలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న గోపాల మిత్రల వేతనాలు ప్రభుత్వం విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేసిన గోపాలమిత్రలు మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి గోపాల మిత్రల సంఘం అధ్యక్షులు మారబోయిన రవీందర్ ముదిరాజ్‌తో కలిసి గోపాల మిత్రలు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఆరు నెలల వేతనాలు గోపాల మిత్రల ఖాతాల్లో జమచేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిగతా వేతనాలు కూడా సరైన సమయంలో అందించి గోపాల మిత్రల జీవితాల్లో వెలుగులు నింపాలని, కుటుంబ పోషణ భారం కాకుండా ప్రభుత్వం ప్రతినెల వేతనాన్ని యధావిధిగా వేయాలని అన్నారు. గోపాల మిత్రలకు శాశ్వత ఉద్యోగ భద్రత, 10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం, స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతిభ కనబరిచిన గోపాల మిత్రలకు అవార్డులు అందించాలని మంత్రిని కోరారు. ఈకార్యక్రమంలో గోపాల మిత్రలు పల్స మహేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రాఘవేందర్‌గౌడ్, రమేష్, యాదగిరి, వెంకోజి, వెంకటేష్ పాల్గొన్నారు.

## క్రీమిలేయర్ ఎత్తివేయాలి : దూళిపాల



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బిసిల విద్యా,ఉద్యోగ రిజర్వేషన్‌లపైనున్న క్రీమిలేయర్‌ను ప్రభుత్వం ఎత్తివేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాల ధనుంజయ్ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలని, హైకోర్టు,సుప్రీం కోర్టుల జడ్జీల నియామకంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టాలని అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అయ్యేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్,రైతుసంఘం రాష్ట్ర సమితి సభ్యులు జక్కుల రమేష్,బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమరాజు వెంకట్ జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్‌క్లబ్ అభివృద్ధికి కృషి

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పబ్లిక్ క్లబ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్‌క్లబ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ భూమిపూజలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేను కార్యదర్శిగా ఉన్నప్పుడు 51 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి పబ్లిక్ క్లబ్‌కు నెలకు మూడు లక్షల రూపాయల ఆదాయ మార్గం వచ్చే విధంగా చేశామన్నారు. గత సంవత్సరం ఇదే తారీఖున కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశామని, గత పాలకవర్గం చేసిన అవినీతిని తప్పిదాలను సరిచేయడానికి 6నెలల సమయం పట్టిందని, త్వరలో 365 రోజులు సూర్యాపేట పట్టణ ప్రజలకు, పబ్లిక్ క్లబ్ సభ్యులకు అందుబాటులో ఉండేలా స్విమ్మింగ్‌ఫుల్ నిర్మాణం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, పబ్లిక్ క్లబ్ ఉపాధ్యక్షుడు మద్రు హనుమంతరావు, కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు శెనగాని రాంబాబు, బత్తిని వెంకటేశ్వర్లు, ఫరిదోద్దీన్ అహ్మద్, పోలేబోయిన నర్సయ్య, గవ్వ కేశవరెడ్డి, రాచకొండ శ్రీనివాస్, నిమ్మల వెంకటేశ్వర్లు, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వం పంపిన అధికారుల నిర్లక్ష్యంతో నిరీక్షణ

**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధాప్య వికలాంగులు ఒంటరి మహిళలు వంటి పెన్షన్లు నెల చివర వారం కు నా బడ్జెట్ నిధులు మంజూరు చేస్తుంది. అధికారులు పోస్ట్ ఆఫీస్ వాళ్లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్య ధోరణి ప్రభావంతో పింఛన్ల కోసం నిత్యం పడిగాపులు కాశ పరిస్థితి ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఆశయాన్ని అధికారులు నీ రగారిస్తున్నారు. అనడంలో సందేహం లేదు. నెలకు 2016 రూపాయలు వస్తే టీఫిన్ కళ్లు సీసా మందు. వృద్ధులు నిత్యము ఉండేవారు. నెల చివర వచ్చిందంటే దారులు బాకీ ఇవ్వమని ఒత్తిడి చేస్తుంచారు. ఇంట్లో కుమారుని కుమార్తెను అడగాలంటే ఇష్టము ఉండదు నీ పెన్షన్ పైసలు వస్త వి కదా అని ఎదురు ప్రశ్ని చేస్తారనేది ఉంది. వృద్ధులు మౌనంగా ఉండిపోతారు. వికలాంగులు పనిపాటలు చేయలేరు వచ్చిన పెన్షన్లతోనే కాలం చెల్లిస్తారు. ఒంటరి మహిళలు ప్రభుత్వం ఇచ్చే 2016 రూపాయలు పొదుపు సంఘాల్లో ఉంటుంది పోదువుగా ఉపయోగించుకొని కుటుంబ పోషణ తదితర బాధ్యతలు తీసుకొని వంటి ఖర్చులు వాడుకుంటారు. ఇలా ప్రతి వారికి అందించే సహాయం ఎంతో ప్రయోజనకరంగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామం పంచాయతీ కార్యాలయం ముందు పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు కాస్తున్నారు. ప్రతినెల పింఛన్ డబ్బుల కోసం ఫింగర్స్ ప్రింట్ ముఖం దృశ్యమే కండ్ల దృశ్యం వంటివి రానప్పుడు పెద్ద సమస్యగా ఏర్పడింది. సెక్రెటీ బాధ్యతలతో మెలిగి ఫోటో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది ఇదంతా తిరుకాసుగా ఎందుకురా భగవంతుడా అని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తే ఎత్తేస్తున్నారు.



# కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు

### మునుగోడు నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడొద్దు
### ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** డబ్బుల కోసం కాంట్రాక్టర్ల కోసం నిర్మించింది కాళేశ్వరం ప్రాజెక్టు అని తుమ్మిడిహట్టి వద్ద నీరు లభ్యత ఉన్నా కూడా అది కాదని మేడిగడ్డ వద్ద నిర్మించారన్నారు. కాళేశ్వరంలో డిజైన్ లోపం, అశ్రద్ధ, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందన్నారు. కారకులు ఎంతటి పెద్ద వారైనా సరే ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరవ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది సేవా కార్యక్రమం అని రాజకీయాలతో సంబంధం లేదు అని అన్నారు.మునుగోడు నియోజకవర్గం లో పేదలకు కంటి సమస్య అనేది ఉండకుండా చూస్తామని అన్నారు. రాబోయే కాలంలో మునుగోడు లోనే కంటి ఆసుపత్రి నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉచిత కంటి ఆపరేషన్ లు నిర్వహిస్తాం అని తెలిపారు.ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.గొర్రెల స్కాము, లిక్కర్ మాఫియా, గ్రానైట్ మాఫియా, ఇసుక మాఫియా, భూమాపియా లకు పాల్పడిన వారిని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొరిమి ఓంకారం, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, వైస్ చైర్మన్ పోలు వెంకట్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పల్లె వెంకన్న, సిపిఐ జిల్లా నాయకురాలు మాజీ జెడ్పిటిసి మాధగోని విజయలక్ష్మి,ఎండి సుజావుద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భూతరాజు ఆంజనేయులు, తలారి నరసింహ పాల్గొన్నారు.

# సాగర్‌కు స్వల్ప ఇన్ ఫ్లో... గేట్లు మూసివేత



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి వస్తున్న వరద ప్రవాహం బాగా తగ్గిపోవడంతో ఆదివారం అధికారులు ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేశారు. గత కొన్ని రోజులుగా రెండు లక్షలకు పైగా ఉన్న ఇన్ ఫ్లో క్రమంగా తగ్గుతూ ఆదివారానికి 48082 క్యూసెక్కులుగా ఉండటంతో మొత్తం గేట్లను మూసివేశారు. ఆదివారం ఉదయం 8 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల హఠాత్తుగా వరద ప్రవాహం తగ్గిపోవడంతో రెండు గేట్లకు కుదించారు ఆ తరువాత వెంటనే మొత్తం గేట్లను మూసివేశారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 585.90అడుగులుగా ఉన్నది. కుడి ఎడమల కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 48082 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.



### గేట్లు మూసివేయడంతో పర్యాటకులు నిరాశ

ఆదివారం సెలవు రోజు కావడంతో సాగర్ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులతో సాగర్ పరిసర ప్రాంతాలలో పర్యాటకుల సందడి నెలకొంది. గత నాలుగు రోజులుగా 26 గేట్ల ద్వారా కొనసాగించిన నీటి విడుదల ఆదివారం మొత్తం గేట్లను మూసివేసిన కూడా పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్థానికంగా ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాం తాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. అయితే ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేయడంతో పర్యాటకులు నిరాశతో వెను తిరుగుతున్నారు.



## అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు : ఎమ్మెల్సీ నెల్లికంటి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి ఉద్యోగి నిబద్ధత అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల మననలు పొందుతారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పోలగోని యాదయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవం పట్టణంలోని రత్న ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సన్మాన మహోత్సవంలో ఎమ్మెల్సీ సత్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ప్రతి ఉద్యోగికి బదిలీలు,పదవి విరమణ సహజమని తాము పనిచేసే చోట ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడు వారిని ప్రజలు ఎప్పుడు గుర్తుపెట్టుకుంటారని గుర్తు చేశారు.బీసీ సంక్షేమ అధికారి యాదయ్య తనకు చిరకాల మిత్రుడన్నారు. తెలంగాణ జర్నలిస్టుల పోరం నాయకులు పల్లె రవికుమార్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన యాదయ్య రాబోయే రోజులలో సామాజిక సేవా కార్యక్రమంలో ముందు భాగంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, నగరికంటి కాశయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, మునుగోడు మండల కార్యదర్శి చాపల శ్రీను, సూరిగి చలపతి, కైలాష్ తదితరులు ఉన్నారు.

## హరిజన కుటుంబాల భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురం గ్రామంలో నిరుపేద హరిజన(25) కుటుంబాలకు చెందిన భూమిని కాపాడి పేద దళితులకు అట్టి భూమిని కేటాయించి పట్టాలు అందచేయాలని కోరుతూ ఆదివారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మండల సీపీఐ నాయకులు, హరిజన కుటుంబాల సభ్యులు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య మాట్లాడుతూ గోపాల్ పురం గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్లు 8/3/1నుంచి 9/ఉలో సుమారు 1ఎకరం 20 గుంటల భూమి కలదని, అట్టి భూమి కాలిగా ఉండటం వలన బూకబ్జా దారులు కన్నువేసి భూమిని చేజిక్కుంచుకోవాలని చూస్తున్నారని అన్నారు. కావున ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున అట్టి భూమిని కాపాడి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ పరంగా సర్వే చేయించి ఒక్కో కుటుంబానికి 100 గజాల చొప్పున నివాస పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కాశబోయిన పెద్దులు, హరిజన కుటుంబ సభ్యులు రాములు, సురేష్, సావిత్రి, యాదమ్మ, కనకయ్య, యాదగిరి, రవి, నర్సయ్య, రేణుక, రాములమ్మ, సుకునమ్మ, సునీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించం

### జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బీసీ రిజర్వేషన్ల విషయంలో బిజెపి నాయకుల మాటల్లో స్పష్టత లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారంపట్టణంలోని రత్న ఫంక్షన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,బిజెపి నాయకులుఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీసీ జాబితాలో ముస్లింలను కలిపారన్నా వంకతో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు తమ వైఖరి మార్చుకోకపోతే వారి పర్యటనలను అడుకుంటామన్నారు.బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆగస్టు రెండో వారంలో సడక్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ల విషయంలో చర్చించడానికి బిజెపి నాయకులు రావాలని సవాల్ విసిరారు .హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలోకి వచ్చిన కూడా ఏమీ లేదని, సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నైనా చర్చించుకుందాం అని సవాల్ విసిరారు. అవసరమైతే హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చర్చ పెడదామన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీ కూడా బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓసిఐ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కాసోజు విశ్వనాథం,నేలపట్ల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాడపల్లి సాయిబాబా,నాయకులు చోల్లేటి రమేష్, గోపాలకృష్ణ, ఆదినారాయణ,కేసబోయిన శంకర్ ముదిరాజ్, నల్ల మధు యాదవ్, లాలయ్య, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

# బ్యాటరీల దొంగలు అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ):** మోటర్ సైకిల్, ట్రాక్టర్, ఆటో,లారీల బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కనగల్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని చండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఆది రెడ్డి వెల్లడించారు. ఆదివారం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం కనగల్ మండల పరిధిలో మోటర్ వాహనాలు ట్రాక్టర్, ఆటోలలో బ్యాటరీలు దొంగతలనాకు పాల్పడుతున్నారనీ ఫిర్యాదుతో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కనగల్ ఎస్.ఐ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహన తనిఖీ లు నిర్వహిస్తుండగా నల్లగొండ నుండి దేవరకొండ వెళ్తున్న ఆటో మోటర్ సైకిల్స్ తనిఖీ చేయగా ఆటోలో 20 బ్యాటరీలు, మోటర్ సైకిల్స్ దొంగలించినదిగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకొనీ విచారించడం జరిగిందని తెలిపారు. ఏ1 నిందితుడు నల్లగొండ పట్టణం గొల్లగూడెం చెందిన సముద్రాల కృష్ణ, ఏ 2 షైక్ టిప్పు సుల్తాన్ జూన్ 27న కనగల్ మండల పరిధిలోని కె.బి తండా గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కరుణాకర్ రెడ్డి రోడ్డు ప్రక్కన గల వ్యవసాయ క్షేత్రం వద్ద తన మోటర్ సైకిల్స్ ను పార్క్ చేసి, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే వరకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనము తీసుకెళ్లారని కనగల్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు నిర్వహిస్తుండగా ఆదివారం కనగల్ పోలీసులు నల్లగొండ దేవరకొండ రహదారిపై కనగల్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖిలు నిర్వహిస్తుండగా నల్లగొండ వైపు నుండి దేవరకొండ వైపు కి వెళ్ళు చున్న బజాజ్ ఆటో మోటార్ సైకిల్ గల వాటిని నడుపుతున్న వారు అనుమానస్పధముగా వెనుకకు తిప్పుకొని వెళ్ళు చుండగా వారిని కనగల్ పోలీసులు వారని పట్టుబడి చేసి తనిఖీ చేయగా వారి వద్ద నుండి మోటార్ సైకల్ ట్రాక్టర్, ఆటొ బ్యాటరీ లు 20 దేవరకొండ కు తరలిస్తుండగా ఆ రెండు వాహనాంలో నడుపుతున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సబ్ ఇన్స్పెక్టర్ కె రాజీవ్ రెడ్డి,ఎస్ఐ రవీందర్ రెడ్డి పిసిలు పి వెంకన్న ,శేఖర్, బి సురేశ్,హెచ్ రమేశ్,వెంకట్ రెడ్డిలను సిఐ ఆదిరెడ్డి అభినందించారు.

# నాణ్యత నవ్వులపాలు

### మూడునెలలకే పగుళ్లు



**ప్రజాపక్షం/మోతె:** మండలంలో చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులు గుత్తేదారులకు వరంగా మారాయి. రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు నేతలు గుత్తేదారులుగా అవతారం మిత్తి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో గుత్తేదారులకు ఆడిందే ఆట పాడిందే పాట మాదిరిగా మారిపోయాయని నాలుగు కాలాలపాటు మన్నిగ ఉండాల్సిన బిటిరోడ్డు మూడు మాసాల్లోనే పగుళ్లు వస్తున్నాయి. నాణ్యతలేని పనులు కారణంగా ప్రజాధనం పక్కదారి పడుతుంది. ఎన్‌హెచ్365 రోడ్డు నుండి భిక్యతండా లింకు రోడ్డు వరకు సిఆర్ఆర్ నిధులు నుండి సుమారు 1.50 లక్షల రూపాయలతో చేపట్టిన బిటిరోడ్డు మూడు నెలల్లోనే మూడు ముక్కలుగా మారింది. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతను తుంగలో తొక్కారు. నిర్మాణ సమయంలో రోడ్డు త్వరగా గట్టిపడేలా రసాయనాలు వాడటంతో పాటు టెండర్లు ఒప్పందం ప్రకారం వాడకం తక్కువ శాతం వాడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులతో కుమ్మక్కై గుత్తేదారు సంస్థ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యత నిర్ధారణ సంస్థ సైతం తమ పాత్ర పాదర్శకంగా నిర్వహించడంలేదని ప్రజలు వాపోతున్నారు. గుతేత్దారులు అందిస్తున్న కమిషన్లకు తలొగ్గి నాణ్యత ఉన్నట్లు ధృవీకరణపత్రాలు జారీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత గుత్తేదారు సంస్థతో పాటు పర్యవేక్షించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 60500 విలువగల సిఎం రిలిఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, రైతులకు రుణమాఫీ, రైతు బరోసా, రైతు బీమా, పంటల బీమా పథకాలతో రైతన్నలను ఆదుకుంటుందన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు ఆర్థికసాయం అందిస్తుందని పేర్కొన్నారు. వైద్య చికిత్స కోసం ఆర్థికసాయం అవసరమైన వారికి గుర్తించి న్యాయం జరిగేలా చూడటం ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికి సిఎం రిలిఫ్ పండ్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, తండు శ్రీను, వల్దాస్ ఉపేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS


మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



**ప్రజాపక్షం/నారాయణపేట్:** దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ను మద్దెల బీడు గ్రామ శివారులో దామరగిద్ద పోలీసులు పట్టుకొని విచారించగా టిప్పర్ డ్రైవర్ తిప్పగేరి నరేష్ తండ్రి చంద్రప్ప, ఓనర్ భగవంతు తండ్రి శివప్ప, శాసనపల్లి గ్రామం అనే వ్యక్తి మక్తల్ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మద్దెలబీడ గ్రామ శివారులో పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి డ్రైవర్ ఓనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలిపారు. దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో ఏవరైన క్రమంగా ఇసుక తరలిస్తే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మైసమ్మ తల్లి అందరినీ, చల్లగా చూడాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండలో కొలువైన శ్రీ మైసమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు మల్లెపోగు శ్రీనివాసులు, గుండా మనోహర్, కిరణ్ కుమార్, రామస్వామి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో టిటి ఇంజక్షన్‌ల కొరత తీర్చాలి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్రంగా టిటి ఇంజక్షన్‌ల కొరత ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఇంజక్షన్లు, మాత్ర లు సరిపోయేటట్టు చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. రాత్రి సమయంలో టిటి ఇంజక్షన్ కోసం వెళితే ఇంక్షన్లు లేవని తీవ్ర కొరత ఉందని డాక్టర్లు చెప్పడం సహజమైపోయింది. ఇప్పటికైనా వైద్య అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాము.

## ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండల కేంద్రంలోని స్నేహ ఫంక్షన్ హాల్ దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ప్రారంభోత్సవం అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన వ్యవసాయ రంగానికి ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చినందుకు షోరూమ్ యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా సంతోషంగా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరాన్ని అందరూ అంగీకరిస్తున్నారు. షోరూమ్ యాజమాన్యం రైతులకు అవసరమైన సమాచారం, శిక్షణ, సేవలను అందించడం ద్వారా వారికి మరింత సహాయపడాలని కోరుకుంటున్నారు. రైతుల అభ్యున్నతికి దోహదపడే ఈ షోరూమ్ విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు. అనంతరం లక్ష్మి ట్రాక్టర్స్ షోరూమ్ యాజమాన్యం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ని శాల్వాతో సత్కరించారు.

## పండుగ సాయన్న జయంతి అధికారికంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/ కొత్తపల్లి:** తెలంగాణ ప్రజావీరుడైన పండుగ సాయన్న జయంతిని ఆగస్టు 8న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదివారం రోజు కొత్తపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమ కాలంలో నిజాం రాజ్యంలో నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి తన సొంతపాలనా వ్యవస్థను స్థాపించుకోని బహుజన రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నం చేశారన్నారు.పేద ప్రజలకు దాన ధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా తెలంగాణ రాబిన్‌హుడ్ పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జనరల్ సెక్రెటరి శివశంకర్ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మహబూబ్‌నగర్ ఎస్పై రాజు తెలిపిన వివరాలు మెరూన్ కలర్ షర్ట్, బ్లూ ప్యాంటు ధరించిన 50 ఏళ్ల వ్యక్తి బలమైన గాయమై రైల్వే పట్టాలపై పడి ఉండటాని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేశాన్ని మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహబూబ్ నగర్ ఎస్పై కే. రాజు మాట్లాడుతూ ఇతడిని గుర్తు పట్టినవారు 8712658597 కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

## ఇరవై నెలల్లోనే అభివృద్ధి చేసి చూపించాం

**ప్రజాపక్షం/కొత్తకోట :** పదేళ్లలో బీఆర్ఎస్ చేయని అభివృద్ధిని ఇరవై నెలల కాలంలో చేసి చూపిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని మండల అధ్యక్షులు నాగారపు బీచుపల్లి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్నా వ్యతిరేక ప్రచారాలను తిప్పి కొట్టాలని, అర్హులైన ఇందిరమ్మ ఇండ్లు రాని వారికి మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు పోతులపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మాసన్న, రమణ, హరిశ్చంద్రరెడ్డి, సాయిలు రెడ్డి, గోకరయ్య, శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంజన్న యాదవ్ , నాగరాజు, యాదగిరిరెడ్డి, శివరాజు, వహీద్ , రాములు, జహంగీర్ , ముజీబ్ , శివారెడ్డి, మాజీ సర్పంచ్ విశ్వనాథం , రవి, శివ, రామకృష్ణ, యూత్ అధ్యక్షులు కరాటే శివ, గ్రామ అధ్యక్షులు రాములు, గాంధీ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల భూ నిర్వాసితుల రాస్తారోకో




**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర కనుగుణంగా పరిహారం అందివ్వాలని కోరుతూ అంబేద్కర్ చౌక్‌లో బస్టాండ్ రోడ్డు మీద ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో భూ నిర్వాసితుల సంఘం పుంజనూరు ఆంజనేయులు, సిఆర్ గోవింద్ మాట్లాడుతూ గత 20 రోజులుగా భూ నిర్వాసితులు జిల్లా కేంద్రంలో రీలే దీక్షలు చేస్తున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేసిన ప్రభుత్వం మొండిఆ వ్యవహరిస్తున్నాదని భూ నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఇట్లానే మొండి వైఖరితో ఉంటే భవిష్యత్తులో భూ నిర్వాసితుల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. ప్రభుత్వం ఇస్తామన్న ఎకరంకు పరిహారము 14 లక్షల రూపాయలు ఆమోదయోగ్యం కాదని ఆ డబ్బుతో మరో వంక భూమి కొనే పరిస్థితి లేదని అన్నారు. ప్రాజెక్టులకు భూములు ఇస్తున్న భూనిర్వాసితులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. ప్రాజెక్టు కోసం తమ భూములను అప్పగిస్తున్న రైతులను కన్నీళ్లకు గురి చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ ధర నిర్ణయించెందుకు న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలని బేసిక్ ధర ప్రకారం 2013 సేకరణ చట్టాన్ని అమలు చేసి భూ నిర్వాసితులకు ఆదుకోవాలని కోరారు. భూ నిర్వాసితుల జిల్లా కార్యదర్శి కేశవ్ గౌడ్, రవిందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుకబడి గుర్తైన నారాయణపేట ప్రాంతానికి నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం మంచిదేనని అయితే అదే స్థాయిలో భూనిర్వాసితులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని భూ నిర్వాసితులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సాయం అందివ్వాలని అందుకు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా వారికి పరిహారం అందించే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం కాట్రేపల్లి, కార్చ్వర్ ఎర్నాగుపల్లి గ్రామ నాయకులు ఆంజనేయులు, భూనిర్వసితుల గ్రామ నాయకులు హనుమంతు, భూనిర్వాసితుల సంఘం నాయకులు నరసింహులు, కృష్ణ, మాల గజలప్ప, జిలాని, నారాయణ గౌడ్, సత్యనారాయణ గౌడ్, అంజప్ప, బొంబాయి సోమ్మన్న, అశోక్ గౌడ్, పెద్ద తమ్మ, సోమన్న, రాజు, వెంకట్ రెడ్డి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు కొండంత భరోసానిచ్చిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల :** విలక్షణ రాజకీయ లక్షణాలతో రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు వినూత్న రీతిలో వేల మందికి భోజనం పెట్టి వారికి రావలసిన ప్రతి పైసా అందే వరకు వారికి అండగా నిలుస్తానని గుండెల్లో కొండంత భరోసా నింపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల గూడును గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టించుకోకపోగ వారి సమస్యలను గాలికి వదిలేసిన నేపథ్యంలో వారికి అండగా నిలబడతానని అవసరమైతే సర్కారుతో నైనా కలబడుతానని హామీ ఇచ్చి రంగంలోకి దిగిన అనిరుధ్ రెడ్డి తన నిర్విరామ ప్రయత్నాలతో ఒకవైపు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచే విషయంగా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తేస్తూనే, మరోకవైపు మూడు విడతలుగా రూ.250 కోట్లను నిర్వాసితుల ప్యాకేజీ కోసం మంజూరు చేయించారు. లక్షల మంది రైతుల బాగు కోసం ఉదండాపూర్ నిర్వసితులు చేసిన త్యాగం అమూల్యమైనది. ఆ త్యాగధనుల కోసం చివరి వరకు తాను అండగా నిలబడతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఉదండాపూర్ ప్రాజెక్టులో భాగమైన వల్లూరు గ్రామం వద్ద వేలాదిమంది నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాకు ఫోన్ చేసి ఉదండాపూర్ భూ నిర్వాసితులకు మనం అండగా ఉండాలి, నీవు వెళ్లి వారికి నా తరపున భోజనం పెట్టమని చెప్పారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డిసెంబర్ 9వ తారీకు లోపు ఉదండాపూర్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను పూర్తిగా చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసితులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి అనిరుద్ రెడ్డి గవర్నమెంట్ అని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# వనపర్తి విద్యార్థికి 6 బంగారు పతకాలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్శిటీలో జరిగిన 55 కాన్వకేషన్ లో భాగంగా వనపర్తి పట్టణానికి చెందిన జి. యాదగిరి చారి, విజయ హైమావతి దంపతులకు చెందిన జి.భార్గవి చారి యూనివర్శిటీకి సంబంధించిన ఓవరాల్ క్యాటగిరి భాగంలో 4 గోల్డ్ మెడల్స్, ఫామ్ మిషనరీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి 2 డిపార్ట్మెంట్‌లో 2 గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ రైతు అంటే దేశానికి వెన్నముక అదే వ్యవసాయం అంటే గుండెలాంటిది. అలాంటిది నిరంతరం కొనసాగాలి అంటే విద్యార్థిని, విద్యార్థులు కొత్త కొత్త విషయాలతో నూతన ఆలోచన పరిశోధన విధానంతో రాణిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ వ్యవసాయం, ఆర్టిఫిషియల్ , రోబోటిక్, అధునిక టెక్నాలజీతో ముందరికి వెళ్లి విద్యార్థులు రైతులకు ఏజి హబ్, ఆర్ఏడబ్ల్యూఈ లాంటి కార్యక్రమాలు నిర్వహించి మరింత అవగాహన కల్పించాలని రైతుల అవసరం సమాజానికి ఎంతో అవసరమని ప్రతి గింజలో వారి కష్టాన్ని మనం గుర్తుకు తెచ్చుకొని నెమరేసుకోవాలన్నారు. ఇలాంటి గొప్ప విజయం వెనక ఉన్న తల్లిదండ్రులకు నా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. మంగి లాల్ జాట్ , వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు

ఎస్పీ యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం/నారాయణపేట్:** మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి, ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు రోజుకి కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజలకు సూచించారు. మోసం చేసే మల్టీలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ కింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవెల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తామని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటాలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. సైబ ర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్ళు మల్టీలెవెల్ మార్కెటింగ్‌పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను చాలా మంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్‌లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వల పన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైన చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం కాయం. గొలుసుకట్టు మార్కెటింగ్‌లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్‌వర్క్‌లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమవేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఎపీకె ఫైల్స్ లాంటివి గొన్లోడ్ చేయవద్దు. ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

# విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేత



**ప్రజాపక్షం/మక్తల్ :** రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ రోడ్డు స్పీడ్ సైక్లింగ్ 5,1.0,20 కిలోమీటర్ల పోటీలలో నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో జిల్లా నుండి 99 మంది బాలికలు, మహిళలు పాల్గొని క్రీడా నైపుణ్యతను క్రీడా ప్రతిభను చాటి 32 మంది జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ రోడ్ స్పీడ్‌లో సైకిలింగ్ పోటీలకు ఎంపికైన వారికి ఆదివారం మక్తల్ శ్రీ సత్య సాయి మందిరంలో బి.గోపాలం ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. బి.గోపాలం మాట్లాడుతూ చదువు ఎంత ముఖ్యంగా క్రీడలు కూడా అంతే ముఖ్యమని, బాలికలు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని, వారు సాధించిన క్రీడా ప్రశంసా పత్రాలు భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో, పైచదువుల కొరకు ఉద్యోగాల కొరకు ఉపయోగపడతాయని, క్రీడల వలన సంపూర్ణ ఆరోగ్యము, సమాజంలో గౌరవం ఉంటుందని ఆయన తెలిపారు, రాష్ట్రస్థాయి సైకలింగ్ పోటీలలో పాల్గొన్న 99 మంది బాలికలకు, మహిళలందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు సత్య ఆంజనేయులు మాట్లాడుతూ బి.గోపాలం సార్ రిటైర్‌మెంట్ తర్వాత కూడా గత పది సంవత్సరములు నుండి శిక్షణ ఉచితంగా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తూ, రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా సొంత ఖర్చులతో పోత్సహించడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు అమ్రేష్, రమేష్, త్రివేణి, స్వరూప, సౌమ్య, వెన్నెల, గాయత్రి, అనూష, మల్లీశ్వరి, అంకిత, సంగీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## లబ్ధిదారుల కల నెరవేర్చిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** గత పాలకులకు ప్రజలు ఓట్లు వేసి అవకాశం ఇస్తే 10 సంవత్సరాల్లో వాళ్లే లబ్ది పొందారు. తప్ప ప్రజలకు చేసిందేమి లేదని, ఎన్నో రోజుల నుండి ఎదురు చూస్తున్న రేషన్ కార్డు లబ్దిదారుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని స్థానిక మాజీ కౌన్సిలర్ పద్మ పరశురాం అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని నాలుగవ వార్డు నర్సింగాయపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ , పద్మ పరశురాం హాజరయ్యారు. అనంతరం లబ్దిదారులకు రేషన్ కార్డుల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు రాని వారు సమీప మీ సేవ కేంద్రాల్లో అప్లై చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డుల మంజూరికి కృషి చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి, స్థానిక మాజీ కౌన్సిలర్ కి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు, వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు, శేఖర్ రెడ్డి, రేషన్ షాపు, డీలర్ రాంరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు నక్క రాములు, మిరియాల వెంకట్రాములు, రాములు, మహేష్ , కురుమూర్తి, మహేష్ , నర్సింహ, కడమంచి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పని చేసినవారికే ప్రాధాన్యత

**ప్రజాపక్షం/వంగూర్ :** కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి పని చేసిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రకాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్‌పైనమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. 18నెలల్లో కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమపథకాలను పూర్తిగా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.

## పారదర్శకంగా ఉపాధ్యాయుల పదోన్నతులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ప్రారంభమైందని, ఉపాధ్యాయుల పదోన్నతులను సీనియారిటి ఆధారంగా పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లావిద్యాశాఖ అధికారి ఎ.రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులనుంచి 39మంది జిహెచ్‌ఎంలుగా, 109మంది స్కూల్ అసిస్టెంట్లు, 22మంది పిఎస్‌హెచ్‌ఎంలు పదోన్నతి పొందనున్నారని తెలిపారు. ఆదివారం డిఇఓ కార్యాలయంలో ఇటీవలే విడుదలచేసిన ఉపాధ్యాయుల సీనియారిటి జాబితాపై ఉపాధ్యాయులనుండి అభ్యంతరాలను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుర్మయ్య, ఏసి రాజశేఖర్‌రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఎంఈవో భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లుశెట్టి, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## ఓమేష్ కుటుంబానికి అండగా...



**ప్రజాపక్షం/వెల్దండ :** మహాశివరాత్రి పర్వదినంరోజు దక్షిణకాశిగా పేరుగాంచిన గుండాల కొలువైన శ్రీఅంబారామలింగేశ్వరస్వామి ఆలయంలోని కోనేరులో స్నానం ఆచరించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. ప్రమాదఘటనలో మరణించిన పెరుమాళ్ల ఓమేశ్ కుటుంబసభ్యులకు సీఎం సహాయనిధినుండి రూ.10లక్షలు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ఓమేష్ తల్లిదండ్రులు పెరుమాళ్ల రాములు, లక్ష్మిలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనేరులోపడిన ఓమేష్ కుటుంబానికి ఈప్రజాపాలనలో ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుండాల దేవాలయ కమిటిచైర్మన్ మల్లేపల్లి సందీప్‌రెడ్డి, కిసాన్‌సెల్‌తాలుకా అధ్యక్షులు మల్లేపల్లి పర్వత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, ఆలయకమిటిసభ్యులు అరుణ్, కొమ్ము అంజయ్య, కొమ్ము లింగమయ్య, తిరుపతయ్య, ఆలయ అర్చకులు కృష్ణయ్య, నరహరిశర్మ పాల్గొన్నారు.

## ఎంపిని కలిసిన బాదేపల్లి శతాబ్ది ఉత్సవ కమిటీ



**ప్రజాపక్షం/జడ్చర్ల:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణను ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యవర్గం కలిసింది. ఈ సందర్భంగా నవంబర్లో నిర్వహించే మూడు రోజుల ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. ప్రధానంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఉత్సవాలకు తీసుకురావాలని కార్యవర్గం కోరారు. పాఠశాలను సైతం విజిట్ చేయాలని సూచించారు. అలాగే తాను సైతం మెయిల్ చేయాలని సూచించారు. అలాగే తాను సైతం మెయిల్ చేస్తూ అపాయింట్‌మెంట్ కోరుతానని భరోసా ఇచ్చారు. ఉత్సవాలకు కేంద్రమంత్రులను తీసుకురావాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఎంపీ ని కలిసిన వారిలో ఎంఈఓ మంజులదేవి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి చక్రవర్తుల రమణాచార్యులు, కోశాధికారి మేడిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులు జీనురాల సత్యం ఆకుల వెంకటేష్, సంతోష్ చారి, శ్రీహరి, ప్రకాష్, అర్జున్, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, నరేష్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మౌనిక, సయ్యద్, ఇబ్రహీం, గోపాల్, స్వాతి ప్రసన్న, ఉపాధ్యాయులు లక్ష్మ ణ్, శంకర్ బాబు తదితరులు ఉన్నారు.

# రీల్



## సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ పోస్టర్ విడుదల

సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటులు మురళీ మోహన్, నిర్మాత కేఎస్ రామారావు, ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, రామసత్యనారాయణ, డైరెక్టర్స్ అనిల్, డా.సురేష్ బాబు, తదితరుల ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా అతిథులు చేతుల మీదుగా సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 ఫంక్షన్ డేట్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నటులు మురళీ మోహన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా అవార్డ్స్ ఈవెంట్ చే స్తున్న ఏకైక మేగజైన్ సంతోషం. సౌత్ ఇండియా లో ఫిలింఫేర్ తప్ప మరో మేగజైన్ ఏదీ కూడా ఇంత సుదీర్ఘ కాలం అవార్డ్స్ ఫంక్షన్స్ చేయలేదు. పెద్ద పెద్ద మీడియా సంస్థలు పెట్టిన అవార్డ్స్ ఫంక్షన్స్ కూడా సక్సెస్ కాలేదు. కానీ సురేష్ ఒక్కడు ఎంతో కష్టపడి 24వ సారి ఈవెంట్ చేస్తున్నాడు. తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. ఏపీలో త్వరలో ఫిలిం అవార్డ్స్ ఇవ్వబోతున్నారు. సూర్య చంద్రులకు గ్రహణం పట్టినంత మాత్రాన వారికేం కాదని అన్నారు. నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ ఒక సినిమా ఈవెంట్ చేయాలంటే ప్రభుత్వాలకే పదేళ్ల టైమ్ పట్టింది. అలాంటిది ఒక్కడు, సామాన్యుడు సురేష్ కొండేటి 24 ఏళ్లుగా దిగ్విజయంగా సంతోషం అవార్డ్స్ ఫంక్షన్ చేస్తుండటం మామూలు విషయం కాదు. నేను ఆ టైమ్‌లో సురేష్ కు ఏదో ఒకటి చేయాలని ఎఫ్‌ఎన్ సీసీ కల్చరల్ కమిటీ అడిషనల్ ఛైర్మన్‌గా నియమించాను. కానీ ఏ రోజు సురేష్ బాధపడటం నేను చూడలేదు. నవ్వుతూనే ఉన్నాడు. ఈ 24వ అవార్డ్స్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, వి.వి.కె. హౌసింగ్ ఇండియా ప్రై వెట్ లిమిట్ అధినేత వళ్లూరు విజయకుమార్, సూర్య సెమ్ డైరెక్టర్ అనిల్, డా.సురేష్ బాబు, సంతోషం అధినేత సురేష్ కొండేటి పాల్గొన్నారు.



## ఇది అదృష్టంగా భావిస్తున్నా

### 'సక్సెస్ మీట్'లో నిర్మాత అల్లు అరవింద్



హోంబాలే ఫిలమ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మహావతార్ నరసింహ. ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించారు. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూలై 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకొని, భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ఈ సినిమాని నేను రిలీజ్ చేసేలా అనుగ్రహించిన నరసింహ స్వామివారికి నమస్కారం. నిర్మాత విజయ్ ఫోన్ చేసి, ఈ సినిమాని తెలుగులో మీరు విడుదల చేయాలని అని అడిగారు వెంటనే ఓకే అన్నాను. సినిమా విడుదలైన రోజు మార్నింగ్ షోకి వచ్చిన రెస్పాన్స్‌ని దృష్టిలో పెట్టుకుని ఈవెనింగ్ కొన్ని షోస్ పెంచాం. ఈ సినిమా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడ్డారు. 2021లో సినిమాని మొదలుపెట్టి ఎన్నోఒడిదొడుకులు ఎదుర్కొని, పట్టుదలతో సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. ఆ నరసింహ స్వామి వారే వారికి ఈ అద్భుతమైన విజయాన్ని అందించారు. ఎప్పుడూ థియేటర్స్ రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు అని చెప్పారు.

## డ్రగ్స్‌పై హీరో పాట



డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపునకు స్పందించిన హీరో కృష్ణసాయి పలు ప్రచార చిత్రాలను రూపొందిస్తున్నారు. కృష్ణ సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు?' అనే సందేశంతో రూపొందించిన ప్రచార వీడియోను హీరో కృష్ణ సాయి పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో కృష్ణ సాయి మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్య పూరిత గీతాన్ని రూపొందించాం. గవర్నర్లు, పోలీస్ విభాగంతో పాటు, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రశంసలు వెల్లువెత్తాయి.



## 'కూలీ' ట్రైలర్ రిలీజ్

సన్ పిక్చర్స్ పతాకంపై తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఈ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు సినిమా నటుడు నాగార్జున విలన్ పాత్రలో నటిస్తున్నారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. రజనీకాంత్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.ఒకడు పుట్టగానే వాడు ఎవడి చేతిలో చావాలో తలమీద రాసిపెట్టి ఉంటుంది' అనే నాగార్జున పవర్ ఫుల్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది. 'అడుగు పెడితే విజిల్లు మోగులే' అనే పవర్ ఫుల్ బీజీఎంతో దేవా పాత్రలో రజనీకాంత్ ఎంట్రీ అదిరిపోయింది. రజనీకాంత్ డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. సూపర్ స్టార్ అమీర్‌ఖాన్, కన్నడాస్టార్ ఉపేంద్ర ఎంట్రీలు అదిరిపోయాయి. సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్ పాత్రలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కూలీ కోసం చేసిన వరల్డ్ బిల్డింగ్ అద్భుతంగా వుంది. ఆయన నెక్ట్స్ లెవెల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. అనిరుధ్ బ్యాగ్రౌండ్ గూస్ బంప్స్ బీజీఎం ఇచ్చారు. గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ. విజువల్స్ గ్రాండియర్‌గా వున్నాయి. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ బాగుంది. మొత్తానికి ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలని డబుల్ చేసింది.

## నాపై ఇంత ప్రేమ చూపుతారని అనుకోలేదు

### సత్యదేవ్



విజయ్ దేవర కొండ కథా నాయకుడిగా నటించిన 'కింగ్డమ్'లో సత్యదేవ్ అన్నగా నటించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా థియేటర్లలో సక్సెస్ ఫుల్‌గా నడుస్తోంది. ఈ నేపథ్యంలో సత్యదేవ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

*** 'కింగ్డమ్' లాంటి భారీ సినిమాలో శివ అనే పవర్ ఫుల్ రోల్ చేశారు.. స్పందన ఎలా ఉంది?**

ఇప్పటిదాకా ఈ సినిమాకి వచ్చినన్ని ఫోన్ కాల్స్ నాకు ఎప్పుడూ రాలేదు. మొదటి షో నుంచి అందరూ ఫోన్లు చేసి అభినందిస్తూనే ఉన్నారు. గౌతమ్ నాకు 'కింగ్డమ్' కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా వెంటనే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాను. అంత నచ్చింది నాకు ఈ కథ. నా నమ్మకం నిజమై, ఇప్పుడు సినిమాకి ఇంతటి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది.

*** యాక్షన్ సీన్స్‌కి మంచి పేరు రావడం ఎలా అనిపించింది?**

ఎప్పుడైనా యాక్షన్ సీన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాము. ఇందులో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే.. నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది.

*** ఈ చిత్రంలో మీకు ఛాలెంజింగ్‌గా అనిపించిన సీన్ ఏంటి?**

విజయ్ నా తమ్ముడు అని తెలిసిన తర్వాత జైల్లో మా ఇద్దరి మధ్య సంభాషణ జరుగుతుంది. అసలు గౌతమ్ నా పాత్రను రాసిన తీరే అద్భుతంగా ఉంది. ఓ వైపు తమ్ముడు, మరోవైపు దివి ప్రజలు, ఇంకో వైపు ఒక నిజం తెలుసు కానీ ఎవరికీ చెప్పలేదు. ఇలా ఆ పాత్ర చుట్టూ ఎంతో ఎమోషన్ ఉంది. అందుకే డ్రామా అంతలా పండింది.

*** మురుగన్ పాత్ర పోషించిన వెంకటేష్ గురించి చెప్పండి?**

ఈ సినిమాలో విజయ్‌కి, నాకు ఎంతో పేరు వచ్చిందో వెంకటేష్ కి కూడా అంత పేరు వచ్చింది. అద్భుతంగా నటించాడు. షూటింగ్ సమయంలోనే బాగా నటిస్తున్నాడని మేమందరం అనుకున్నాం. ఇప్పుడు ప్రేక్షకులు కూడా అదే మాట చెప్తున్నారు. ఒక కొత్త నటుడికి ఇంత పేరు రావడం మామూలు విషయం కాదు.

*** విజయ్ దేవరకొండ గురించి ఏం చెప్తారు?**

విజయ్ తో నాకు అంతకముందు పరిచయం లేదు. కలిసిన తర్వాత తెలిసింది విజయ్ చాలా మంచి వ్యక్తి అని. తక్కువ సమయం లోనే మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. విజయ్‌ని నేను నిజంగానే ఒక బ్రదర్‌లా ఫీల్ అయ్యాను. విజయ్ అంత మంచి వ్యక్తి కావడం, నాతో అంత మంచిగా ఉండటం వల్లే. విజయ్ గొప్ప నటుడు. సన్నివేశాన్ని కానీ, సంభాషణలను కానీ అతను అర్థం చేసుకొని నటించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది.

*** నిర్మాత నాగవంశీ గురించి?**

నాగవంశీ గట్స్ ఉన్న ప్రొడ్యూసర్. ఒక కథను నమ్మి సినిమా చేద్దాం అనుకున్నారంటే.. ఎక్కడా వెనకడుగు వేయరు, ఏ విషయంలోనూ రాజీపడరు. పరిశ్రమలో వంశీ తనకంటూ ప్రత్యేక పంథాను సృష్టించుకున్నారు కాబట్టే.. సితార ఎంటర్టైన్మెంట్స్ ఇంత పెద్ద నిర్మాణ సంస్థగా ఎదిగింది. వంశీ గారంటే నాకెప్పుడూ గౌరవం ఉంటుంది.

*** తదుపరి ప్రాజెక్ట్‌లు?**

అరేబియన్ కడలి అనే సిరీస్ చేశాను. అమెజాన్ ప్రైమ్‌లో ఆగస్టు 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఫుల్ బాటిల్' అనే సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. వెంకటేష్ మహా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. 'ఆరంభం' ఫేమ్ అజయ్ నాగ్ తోనూ ఓ చిత్రం చేస్తున్నాను. వీటితో పాటు మరో రెండు సినిమాలు ఉన్నాయి.

## సులభ వ్యాపారం కోసం కొత్త మైనింగ్ విధానం: గడ్కరీ


**నాగపూర్:** పారిశ్రామిక వాటాదారులు సులభంగా వ్యాపారం చేయడం కోసమే కొత్త ప్రతిపాదిత గనుల తవ్వకం విధానం తీసుకువచ్చినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. మూడునెలల్ల అన్నిరకాల అనుమతులను పారిశ్రామికవేత్తలకు ఇవ్వడంద్వారా నాలుగో నెలనుండే పారిశ్రామికవేత్తలు తవ్వకాలు చేసి వాటిని బయటకు తీసే ప్రక్రియ ప్రారంభించడానికి వీలుగా ఉంటుందని ఆయన చెప్పారు. కొత్త విధానం వల్ల గనుల తవ్వకాల్లో ఉంటే అన్ని ఆటంకాలూ తొలగిపోతాయని, వాటిని తొలగించడంకోసమే కొత్త విధానం ప్రతిపాదించామని చెప్పారు. 'అభివృద్ధి భారతంలో విదర్భ ప్రయాణ ప్రణాళిక ఇండియా@100' అనే అంశంపై నాగపూర్‌లో జరిగిన ఒక సమావేశంలో మంత్రిగడ్కరీ మాట్లాడుతూ, విదర్భలోని గడ్చిరోలీజిల్లాలో గనుల తవ్వకాలు, స్టీలుకు సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం గనుల తవ్వకానికి కొత్త విధానం ప్రతిపాదించిందని చెప్పారు. 'ఈ గనుల తవ్వకం విధానం ఇటీవల కేంద్రమంత్రివర్గం ముందుకు ఆమోదం కోసం వచ్చిందని, ఐతే ప్రధాని మోదీ ఈ విధానంపట్ల పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో కొన్ని సలహాలు ఇచ్చారని, కొన్ని మార్పులు చేర్పుల సలహాలు ఇచ్చారని, తనతో ఈ విధానం గురించి చర్చించాలని మంత్రివర్గ కార్యదర్శికి మోదీ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

## ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కలకలం

### బర్త్‌డే పార్టీలో నిర్వహించిన టెస్టుల్లో పాజిటివ్

### ఆరుగురు ఐటి ఉద్యోగుల అరెస్టు





**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లిలోని ఓ ఫామ్ హౌస్ బర్త్‌డే పార్టీలో ఐటీ ఉద్యోగుల గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్, విదేశీ మద్యం సేవిస్తున్నారన్న పక్క సమాచారంతో సమాచారంతో ఎక్సైజ్ ట్రాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడి చేసి భగ్నం చేశారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఉండే ఐటీ ఉద్యోగి అభిజిత్ తన బర్త్‌డే పార్టీ నిర్వహించేందుకు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామ సమీపంలోని సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు బర్త్‌డే వేడుకలు చేసుకుంటున్నారన్న పక్కా సమాచారంతో ఫామ్ హౌస్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. డ్రగ్స్ టెస్టుల్లో పాజిటివ్‌గా తేలిన ఆరుగురు ఐటీ ఉద్యోగులైన అభిజిత్ తోపాటు సింప్సన్, పార్థు, గోయల్, యశ్వంత్, సేవియో డెన్నిష్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు. అదేవిధంగా సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద నుండి సుమారు రెండు లక్షల విలువ చేసే ఎల్ఎస్‌డీ బ్లాట్స్, హాష్ ఆయిల్ డ్రగ్స్, ఐదు విదేశీ మద్యం బాటిళ్లు, మూడు లగ్జరీ కార్లు, ఆరు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులకు నిందితులను అప్పగించగా ఈ మేరకు చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో ఐజిపిల కొరత తీరాలంటే

# పదేళ్లు ఆగాల్సిందే!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజిపి)ల కొరత రాష్ట్ర ప్రభుత్వాన్ని వేధిస్తోంది. పోలీసు శాఖలో ఆయా విభాగాలలో 16 ఐజి స్థాయి పోస్టులు ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారు. అలాగే డిఐజి, ఎస్‌పి పోస్టులు కూడా ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఐజి పోస్టు స్థానాల్లో డిఐజి, ఎస్‌పి స్థాయి అధికారులతో పాటు రిటైర్డ్ అయిన అధికారులతో భర్తీచేసి నెట్టుకొస్తున్నారు. తెలంగాణకు గుండెకాయగా ఉండాల్సిన హైదరాబాద్ పోలీసు విభాగంలోని స్పెషల్ బ్రాంచ్ చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి ఉండాలి అయితే ఐజిల కొరత వల్ల ఈ పోస్టును కేవలం ఎస్‌పి స్థాయి అధికారి అపూర్వ రావుతో సర్దుబాటు చేశారు. అలాగే హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి ఉండా అయితే ఇక్కడ కూడా డిఐజి స్థాయి అధికారి జోయల్ డేవిస్‌తో సర్దుబాటు చేయక తప్పలేదు. ఇక సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సిఎఆర్) చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి పోస్టు ఇది. అయితే ఎస్‌పి స్థాయి అధికారిణి రక్షితమూర్తితో భర్తి చేయకతప్పలేదు. అలాగే ఇంటెలిజెన్స్ సెక్యూరిటి వింగ్ (ఐఎస్‌డబ్ల్యు)కు కూడా ఐజి స్థాయి అధికారి ఉండాలి. అయితే ఐజిల కొరత కారణంగా ఈ పోస్టులో ఇటీవలే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఐజి)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన విబి కమలాసన్‌రెడ్డిని రీ రిక్రూట్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇక శాంతిభద్రతల విభాగంలో అత్యంత కీలకమైన మల్టీజోన్2 ఐజిగా సత్యనారాయణ ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఖాళీ అయిన ఈ పోస్టులో కూడా ఐజి స్థాయి అధికారిని నియమించలేదు. ఈ స్థానాన్ని డిఐజి స్థాయి అధికారి అయిన ఎక్బాల్ సిద్దిఖీతో భర్తి చేశారు. ఇకపోతే పోలీసు సంక్షేమ విభాగం చీఫ్‌గా అదనపు డిజి స్థాయి అధికారి పోస్టు ఇది అయితే లా అండ్ ఆర్డర్ ఎఐజి రమణకుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇక సిఐడి విభాగంలో కూడా ఐజి పోస్టులు ఖాళీగా ఉంది. హైదరాబాద్ సిసిఎస్ చీఫ్‌గా ప్రస్తుతం ఉన్న ఐజి విశ్వప్రసాద్ ఈ ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ స్థానం కూడా ఖాళీ అవుతుంది. ఈ స్థానాన్ని కూడా ఎస్‌పి లేదా డిఐజి స్థాయి అధికారులతో భర్తీ చేయాల్సిందే. ఐజీ పోస్టుల్లో ఐజిలుగా పనిచేస్తున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఐజి సుమతి ప్రస్తుం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి)చీఫ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఐజి కె.రమేష్ నాయుడు రైల్వే, రోడ్ సేఫ్టీ, ఆర్గనైజేషన్, లీగల్ ఐజిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక ఐజి ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి మల్టీజోన్1 ఐజిగా పనిచేస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో ఐజిగా ఎఆర్ శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రొవిజనింగ్, లాజిస్టిక్స్ ఐజిగా ఎం.రమేష్ బాధ్యతలు నెరవేరుస్తున్నారు. అయితే తెలంగాణలో ఐజిల కొరత తీరాలంటే పదేళ్లు ఆగాల్సిందేనని పలువురు అధికారులు అంటున్నారు.2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన సమయంలో గెజిట్‌లో ఎపికి 116 మంది ఐపిఎస్‌లు, తెలంగాణకు 95 మంది ఐపిఎస్‌లను కేటాయించారు. 11 ఏళ్ల క్రితం ఉన్న ఈ సంఖ్య అప్పట్లోనే అరకొరగా ఉండే. అయితే తెలంగాణలో అదనంగా 23 జిల్లాలు పెరగడంతో ఐపిఎస్‌ల కొరత మరింత పెరిగిపోయింది.

## కాలువలో పడిన కారు

(మొదటి పేజీ తరువాయి)

సహాయంతో మునిగిపోయిన వాహనం నుండి 11 మృతదేహాలను వెలికితీశారు. ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మరణించిన ప్రతి ఒక్కరి బంధువులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50,000 ఇవ్వబడుతుందని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారిలో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నారని పోలీసు సూపరింటెండెంట్ వినీత్ జైస్వాల్ తెలిపారు. బాధితులను బీనా (35), కాజల్ (22), మెహక్ (12), దుర్గేష్, నందిని, అంకిత్, శుభ్, సంజు వర్మ, అంజు, అనసూయ, సౌమ్యగా గుర్తించారు. కారు డ్రైవర్ సహా నలుగురిని రక్షించి ఆసుపత్రికి పంపినట్లు ఎస్‌పి తెలిపారు. ఉదయం వర్షం కారణంగా రోడ్డు బురదమయమై జారిపోయేలా మారిందని ప్రత్యక్ష సాక్షి ఇటియాథోక్ నివాసి రాహుల్ వర్మ తెలిపారు. కాలువ పక్కన నిర్మించిన రోడ్డుపై కారు వెళ్తుండగా, డ్రైవర్ బ్రేక్ వేసినప్పుడు అదుపుతప్పి కాలువలో పడిపోయిందని ఆయన అన్నారు. తాము వెంటనే పోలీసులను, గ్రామస్తులను ఘటన స్థలానికి పిలిపించి తాడు సహాయంతో కారును బయటకు తీశామని చెప్పారు. ప్రమాదం నుండి బయటపడిన ఒక టీనేజ్ అమ్మాయి మాట్లాడుతూ తామందరం పృథ్వీనాథ్ ఆలయాన్ని సందర్శించబోతున్నామని, ఘటన జరిగిన సమయంలో మహిళలు, బాలికలు భజనలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడంతో మృతులకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.

## దుర్వినియోగం చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. వలస కార్మికులను శాశ్వతంగా వలస వచ్చినవారు అని అభివర్ణించడం వారిని అవమానించడమేనన్నారు. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కులో తీవ్ర జోక్యం చేసుకోవడమేనని రాజ్యసభ ఎంపి పేర్కొన్నారు. వలస కార్మికుడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వారి స్వరాష్ట్రానికి వెళ్లి ఎందుకు బిహార్‌కు తిరిగి రాకూడదని ప్రశ్నించారు. వారు సాధారణంగా చేసే పని అదేనన్నారు. ఛఠ్ పూజ సమయంలో వలస కార్మికుడు బిహార్‌కు తిరిగి రాలేదా? అని అన్నారు. ఓటరుగా నమోదు కావడానికి ఒక వ్యక్తికి స్థిర, శాశ్వత చట్టబద్ధమైన ఇల్లు ఉండాలి. వలస కార్మికుడికి బిహార్‌లో (లేదా మరొక రాష్ట్రంలో) అలాంటి ఇల్లు ఉంటుంది. అతను/ఆమె తమిళనాడులో ఓటరుగా ఎలా నమోదు చేసుకోవచ్చు? అని చిదంబరం అన్నారు. వలస కార్మికుడి కుటుంబం బిహార్‌లో శాశ్వత ఇల్లు కలిగి ఉండి అక్కడే నివసిస్తుంటే, ఆ వలస కార్మికుడిని తమిళనాడుకు శాశ్వతంగా వలస వచ్చినవారుగా ఎలా పరిగణించవచ్చని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని, రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోందని, ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే.

## రికార్డులు మాయం

(మొదటి పేజీ తరువాయి)

సంచలనం సృష్టిస్తోంది. అదీకాక.. ఈ రికార్డులన్నీ ఒక క్రమపద్ధతిలో మాయం చేసినట్లు ఆర్‌టిఐ దరఖాస్తు ద్వారా వెల్లడైందని జయంత్ పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు ఫిర్యాదు చేసినట్లు జయంత్ వివరించారు. ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతపెట్టడం తాను చూశానని.. అధికారులు సైతం అక్కడే ఉన్నారని జయంత్ సంచలన విషయం వెల్లడించారు. ఈ నేపథ్యంలో సదరు మృతదేహాన్ని సిట్ అధికారులు వెలికి తీయాల్సి ఉందన్నారు. అయితే ఈ యువతుల గల్లంతుపై పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి చాలా కాలంగా ఆర్‌టిఐను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఆ క్రమంలో ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫొటోలు, వాల్ పోస్టర్లు, పోస్ట్‌మార్టం నివేదికలు అన్ని ఒక పథకం ప్రకారం పోలీసులు నాశనం చేశారని వివరించారు జయంత్. దీనిపై శనివారం సిట్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో యువతి మృతదేహం పోలీసులకు లభించిందని.. అయితే వారు ఆ మృతదేహాన్ని అత్యంత దారుణంగా పాతిపెట్టారని చెప్పారు. ఇప్పుడు మృతదేహాలకు సంబంధించిన అవశేషాలు లభించినా.. వాటిని వేటితో సరి పోల్చుతారని ఆర్‌టిఐ కార్యకర్త జయంత్ ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. దీనిపై ఇంతగా ఎవరు ప్రభావం చూపించారని ప్రశ్నించారు. ఈ రికార్డులను కంప్యూటర్ బ్యాక్ అప్ ద్వారా వెనక్కి తీయాల్సిన అవసరం ఉందని జయంత్ అభిప్రాయపడ్డారు. దేనికి ఆధారం లేకుండా నాశనం చేశారంటే ఎలా నమ్మాలని, దీనిపై క్షుణ్ణంగా దర్యాపు జరపాలన్నారు. మరోవైపు తన వెనుక ఎవరూ లేరని ఆర్‌టిఐ కమిషనర్ కుండబద్దలు కొట్టారు. ఈ అంశం తనపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అందుకే వీటిని తేల్చాలని తాను నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు.

## సోషల్ మీడియా గేమ్!

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు.వీరితో నిశ్చితార్థ ఒప్పందం అనంతరం ప్రకటనదారులనుండి ఎండార్స్‌మెంట్‌ల కోసం చెల్లింపులను స్వీకరించడం ద్వారా వారి సోషల్ మీడియా ఖాతాలను ఉపయోగించుకుంటోంది. ముఖ్యంగా సరిహద్దు దాటి, విదేశాలనుంచి అనేకమంది అనుచరులను పొందిన తర్వాత ఖాతా హ్యాండ్లరు ఈ చిత్రాలను పర్వతాలు లేదా చినార్ వృక్షాల వంటి ఇతర చిత్రాలతో భర్తీ చేసేవారని అధికారులు తెలియజేశారు. ఈ ప్రాంతంలో ఆన్‌లైన్ ప్రచార వాతావరణ, రాజకీయ ప్రతిపక్షాలు, రాడికల్ అంశాలు, ఆన్‌లైన్ ఖ్యాతి, సంపదను కోరుకునే అవకాశవాదుల మధ్య సరిహద్దులను చెరిపివేస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ధోరణి కలవరపెడుతున్నదని అధికారులు చెప్పారు. సున్నితమైన భద్రతా పరిస్థితిని వ్యక్తిగతంగా ఉపయోగించుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై నిఘాను ముమ్మరం చేయాలని పోలీసులు గట్టిగా నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా వారి పిల్లల భవిష్యత్తుపై దీని ప్రభావం గురించి కుటుంబాలకు అర్థం అయ్యేలా చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల పోలీసుల అదుపులో ఉన్నటువంటి ఏడుగురు పిల్లలను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత విడుదల చేసినట్లు ఒక అధికారి తెలియజేశారు. కశ్మీర్‌లో రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించే సోషల్ మీడియా ప్రభావశీలుల పెరుగుదల వెనక ఉన్న ప్రేరణల గురించి అధికారులు వివరించారు. ఆర్థిక, డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో కంటెంట్‌ను మానిటైజ్ చేయడం లక్ష్యం కానిచోట, నిశ్చితార్థం ఆదాయాన్ని అనుసరించడం అస్పష్టమైన బూడిద రంగుకు దారితీసింది. ఈ ప్రభావశీలురులలో ఎక్కువ మంది సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై బ్రాండ్ భాగస్వామ్యాలపై ఆధారపడ్డారని, అక్కడ వారు ఉత్పత్తిని ప్రమోట్ చేస్తారని లేదా వాటిని వారి కంటెంట్‌లో అనుసంధానిస్తారని అధికారులు చెప్పారు. మూడు సామాజిక వేదికలపై పనిచేస్తున్న ఇద్దరు ప్రముఖ ప్రభావశీలుర ప్రకారం,బ్లూటిక్ వెరిఫికేషన్ సిస్టమ్ ఉన్నప్పటికీ ఆదాయంషేరింగ్ మోడల్ అస్పష్టంగానే ఉన్నది. ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ పేరు చెప్పడానికి ఇష్టపడని వ్యక్తి ఈ ప్రక్రియను అస్పష్టంగా వర్ణించాడు. ఫ్రీక్వెన్సీ, చెల్లింపుల మొత్తాన్ని నిర్ణయించే అంశాలు ఒక మిస్టరీ అని చెప్పాడు. ఆన్‌లైన్ సెలబ్రిటీల కోసం అన్వేషణ తరచుగా బహిరంగంగా ఒక ప్రక్రియతో సులభం లేదా డబ్బు ఆర్జనతో ముడిపడి ఉంటుంది. ఇది కొన్నిసార్లు తప్పనిసరిగా హామీ ఇవ్వబడదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్,యూట్యూబ్ వంటి పెద్ద ఫ్లాట్‌ఫామ్‌లలో డబ్బు ఆర్జన అనేది ప్రత్యక్ష ప్రకటనల ఆదాయం కలయిక. సబ్‌స్క్రైబర్, బ్రాండ్ వారి సొంత నిబంధనలు, అడ్డంకులతో వ్యవహరిస్తాయి. ఒక సోషల్‌మీడియాకు ప్రొఫెషనల్ ఖాతా ఎంత అవసరం, 10,000మంది అనుచరులు, 60 రోజులలోపు వెయ్యి నిమిషాలు వీక్షించిన కంటెంట్ ఉండాలి. కాబట్టి కశ్మీర్‌లో ఫాలోవర్ల గణనలను పెంచడానికి, రెచ్చగొట్టే కంటెంట్‌ను ఉపయోగించే వ్యూహం అస్థిర డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రత్యక్ష పర్యవసానంగా కనిపిస్తున్నది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com